ఆంధ్రపత్రిక

సచిత్ర వార పత్రిక



4 అణాలు

12-10-'55

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY



కడవ

టి. సుందరబాబు—మద్రాసు.

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతి 4 అ.


ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 49
సంచిక 6
12-10-55

మన్మథ నిజ భాద్రపద బహుళ ద్వాదశి బుధవారం



అక్టోబరు 20 వ తేదీని పెరంబూర్ ఇంటెగ్రల్ కోచ్‌ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం జరిపిన పండిట్ నెహ్రూ ఫాక్టరీ సిబ్బందిపిల్లలకు పూలహారాలు బహూకరించారు.

విషయానుక్రమణిక



చీమలు పెట్టిన పుట్టలు

మెల్లగా సాగిపోతున్న రెండెడ్ల బండిలో బిస్తర్ల నిద్దర్ని ఆనుకొన్నవైపు పడుకోబెట్టుకుని, గత జీవితాన్ని గురించి ఆలోచిస్తూ కూర్చుంది కల్యాణి

ఎక్కడో దూరంగా కనిపిస్తున్న పడమటి కొండచాటున అస్తమించిన లోకబాంధవుడి కెంపురంగులు కొన్ని యింకా ఆకాశాన అలముకునివుండటంవల్ల సరిపోయిందిగానీ లేకుంటే ఆ పాటికి లోకం కారుచీకటిలో మునిగిపోయి వుండేది

వెంకట్రామయ్య తన చావుని గురించి కలగన్నవాడిలా చనిపోవడానికి నాలుగైదు నెలలు ముందుగా తొందరపడి కుమార్తెకి పెళ్ళిచేసేశాడు లేకుంటే కల్యాణి బ్రతుకు ఎలా పరిణమించి వుండేదని ఊహించడం కష్టం ఎవరెరుగుదురు, ఈ జీవితగాథ ఈ విధంగా కాకుండా మరొక విధంగా పరిణమించి వుంటే ఏమై వుండేదన్న విచిత్ర ప్రశ్నకి సమాధానం!

కల్యాణి పెళ్ళి ఆమె అనుకున్నంతకంటే వైభవంగానే జరిగింది. కానీ అందుకు కారణం వెంకట్రామయ్య ప్రయోజకత్వమని మాత్రం చెప్పడానికి వీల్లేదు. ఆయన సంపాదించిన ఆస్తికంటే చేసిన అప్పులు ఎక్కువ. ఊరూరా గాజుబుడ్డీలతో నింపిన బీరువాలతో డాక్టర్లు వెలిసిన తర్వాత వెంకట్రామయ్యకు తాత ముత్తాతలనుంచీ సంక్రమించిన వైద్యవృత్తి ఉదరపోషణకు వెరవు చూపించలేకపోయింది. అందుచేత అతని సాంసారిక జీవితమంతా లోటు బడ్జెటుని పూర్తిచేయడమెట్లా అన్న నిరంతర సమస్యని ఎదుర్కోవడంతోనే సరిపోయింది కానీ చనిపోకముందు అతడొకటి రెండు అద్భుతమైన పనులు చేసి మరీ చనిపోయాడు తన తరువాత అటు తన కుమారుడికిగానీ, యిటు తన కుమార్తెకుగానీ జీవితం సమస్యలా కాకుండా, వడ్డించిన విస్తరిలా అవంత్రపడం కావాలని ఆ వృద్ధుడు తన చివరి రోజుల్లో చాలా తాపత్రయపడ్డాడు. అతడి కోరిక నెరవేరడానికి పరిస్థితులు అనుకూలించాయి

తను శాశ్వతంగా కళ్ళుమూసుకోడానికి కిక ఆరునెలల ముందు ఒకానొక కేసులో సాక్ష్యం చెప్పవలసివచ్చి వెంకట్రామయ్య కోర్టుకి హాజరయ్యాడు. ఆరోజు అమావాస్య. మధ్యాహ్నం రెండుగంటలవరకూ కోర్టు పనితోనే సరిపోయింది. ఆ తరువాత తర్పణం వదలుకోడానికి ఆయన ఆదరాబాదరగా బస్తీకి ప్రక్కనే ప్రవహిస్తున్న ఏటివైపు వెళ్తూ, మార్గమధ్యంలో ఒక చింతచెట్టుక్రింద పచ్చికపైన పడుకుని అటూ ఇటూ దొర్లుతూ అవసోపాలు పడుతున్న ముసలాతడినొకణ్ణి చూచాడు ఆ వృద్ధుడి దురవస్థ కళ్ళబడేసరికి వెంకట్రామయ్య అమావాస్యనీ, తర్పణాన్నీ మరచిపోయి పచ్చికపైన తన పైపంచ పరచి కానుగ కొమ్మలతో తలగడ అమరించి రోగిని పంచపైన పడుకోబెడుతూ "ఏమైందండీ! ఎందుకిలా బాధపడుతున్నారు?" అని ప్రశ్నించాడు

"ఎందుకైతే నీకెందేవయ్యా! నువ్వేం ఆర్చేవా, తీర్చేవా" అంటూ ఆ వృద్ధుడు ముఖం మరోవైపుకు త్రిప్పుకున్నాడు.

"ఆర్చగలను, తీర్చగలను మీ కెందుకా సందేహం! జబ్బేమిటో చెప్పండి ఆతరువాత చూద్దురుగాని" అన్నాడు వెంకట్రామయ్య

మధురాంతకం రాజారాం

రోగి యించుక విస్మయంతో వెంకట్రామయ్యని చూస్తూ "నువ్వేం వైద్యుడివా?" అన్నాడు.

"అవును. నేను నాటువైద్యుణ్ణి. బ్రతుకు గడవడమే దుర్లభమైపోయిన నాటువైద్యుణ్ణి నేను"

రోగి తనని పట్టి పీడిస్తున్న వ్యాధిని గురించి చెప్పాడు: "నాలుగేళ్ళయింది ఈ కడుపునొప్పి కనబడి! ఇదేం మాయదారి జబ్బో ఆ దేవుడికే ఎరుక! ఎన్నో మందులు తిన్నాను. నయం కాలేదు. నాలుగుసార్లు ఆపరేషన్ జరిగింది. గుణం కనిపించలేదు. నిన్నటి మానానికి ఉదయంనుంచీ సాయంత్రంవరకు నరకయాతన పడ్డానంటే నమ్ము. తెల్లవారి బస్సులో యిక్కడికొచ్చాను. పెద్ద డాక్టరుగారు చూచి మళ్ళీ ఆపరేషన్ జరగాలన్నాడు ఈసారి ఆపరేషన్ మాట వినేసరికి నా ఒళ్ళు కంపించిపోయింది ఈ బాధతో చచ్చిపోయినాసరే ఆపరేషన్ మాత్రం వద్దని మనసులో స్థిరపరచుకున్నాను ఏదో వాళ్ళిచ్చిన మందు గుక్కెడు త్రాగి స్నానంచేస్తే ఏమైనా నొప్పి తగ్గుతుందేమోనని యిలా వచ్చాను ఇక్కడికి వచ్చేసరికి నొప్పి మరింత తీవ్రమయింది. పన్నెండు గంటలనుంచీ యిక్కడే పడి వున్నాను."

వెంకట్రామయ్య తన జీవితకాలంలో రోగులకోసం తయారుచేసిన మందులు చాలా తక్కువ. ఆయనదగ్గర రెండు మూడు సీసాల నిండుకు ఏవో చూర్ణాలు కొన్ని, నాలుగైదు కట్టుమాత్రలు, ఒకటి రెండు లేహ్యాలు యింతమాత్రమే వుండేవి. లెక్కా పక్కా లేని అసంఖ్యాకమైన రోగాలన్నింటికీ ఆయన ఈ మందుల్నే వాడేవాడు. అవి నయమైతే నయమయ్యేవి. లేకపోతే లేదు. తను రాయి వైద్యుడని గాని, ఇంగ్లీషు వైద్యాలు తన వైద్యంముందు బలాదూరనిగానీ వెంకట్రామయ్య ఎప్పుడూ సవాలుకు పోలేదు. అతనిది సహజంగా నమ్ర స్వభావం

వెంకట్రామయ్య భుజంపైనుంచీ మందుల సంచిని చేతికి తీసుకుని చుట్టుప్రక్కలా కలయజూచి ఏదో ఆకు పెరికి తెచ్చి ఒక చూర్ణాన్ని అందులో వేసి ఒక రాయిపైన దంచి "బాబూ! వైద్యో నారాయణో హరిః అనుకుంటూ ఈ మందు కాస్తా మ్రింగివేయండి. ఆతరువాత మీ అదృష్టం. నా అదృష్టం" అన్నాడు

విచిత్రం జరిగింది! మందు గొంతుకవెంట దిగజారిన పది నిమిషాల్లోనే రోగికి గుణం కనిపించింది. అతడు లేచి కూచుని వెంకట్రామయ్యవైపు తెల్లబోయి చూచాడు.

"ఏమండీ! కొంచెమైనా తగ్గిందా" అన్నాడు వెంకట్రామయ్య.

"నిదానించు చెబుతాను" అంటూ రోగి లేచి చెట్టుమొదలు కానుకుని కూర్చున్నాడు

మెల్లమెల్లగా పది, యిరవై, ముప్పై నిమిషాలు గడచిపోయాయి. రోగిముఖంలో బాధాచిహ్నాలు క్రమక్రమంగా మాయమైపోయాయి. మనసు కృతజ్ఞతతో నిండిపోయిందేమో మరి, అతడు వెంకట్రామయ్యని దగ్గరికి పిలిచి తనప్రక్క కూర్చోమన్నాడు జేబులోనుంచీ రెండు పది రూపాయలనోట్లు తీసి అతడి చేతిలో పెట్టబోయాడు

వెంకట్రామయ్య చేతిని వెనక్కి తీసుకుంటూ "అబ్బే! నా మందు కంత విలువెక్కడిదండీ! రెండో మూడో యిప్పిం

★ చీమలు పెట్టిన పుట్టలు ★

ఉండి. అదే వాకు దండి! లేనిపోని దురాశ ఒంటపోతే వైద్యం ఫలించదు బాబూ!" అన్నాడు

డబ్బు జేబులో వేసుకుని రోగిష్ఠివృద్ధుడు చేతులు జోడించి "అయ్యా వైద్యుడూ! మనిషంటే నువ్వయ్యా మనిషివి" అన్నాడు

"అబ్బే! అగం లేదండీ! నాకూ ఆశ వుంది. కానీ మితిమీరకుండా జాగ్రత్తపడు తుంటాను" అన్నాడు వెంకట్రామయ్య

"ఇదిగో, ఇలా చూడు. ఇగే యింకెవ రైనా ఈ జబ్బు నింత త్వరగా నయం చేసి వుంటే యాభై, అరవై యిచ్చేదాకా వదలి వుండేవారుకారు. ఓయ్ లోకమంటే ఏమిటో తెలియని బైరాగీ! ఈ బుజువర్తన వల్ల అన్నం దొరుకుతుందనుకోవడం శుద్ధ భ్రమ! యాచించడానికి వెళ్లినప్పుడు కూడా దాత పెంపు సొంపులకు తగినంత దానాన్ని అడగాలన్నారే! నేను గ్రేలి గ్రేలికీ వేసుకున్న ఉంగరాల్ని చూచి, చేతుల్లో మెడలో తగిలించుకున్న బంగారు కంటెల్ని చూచి నువ్వు నేనిచ్చిన యిరవై రూపాయల్ని మారుమాట్లాడకుండా తీసి జేబులో వేసుకోగూడదూ! పోనీలే నీకు ప్రాప్తి లేదు"

"మీరు కలిగినవాళ్లు కాబట్టి మీదగ్గర ఎంత గుంజుకున్నా ఫరవాలేదని నే ననుకోలేను బాబూ! నా కష్టానికి ప్రతిఫలం నాకు ముట్టితే చాలు" అన్నాడు వెంకట్రామయ్య.

"ఈమాట మొదటిసారిగా నీ నోట వింటున్నాను షావుకారు రంగధామయ్యని గురించి నువ్వు విన్నావుకదూ! అతడికి బిడ్డలు లేరనీ, వడ్డీ వ్యాపారంలో అతను అతడి తాత ముత్తాతలు గడించిన లక్షలకు ఉత్తరాధికారి లేడనీ, ఆ ఆస్తిని పిడికైనంత వరకూ కాజేయడానికి అతడి మిత్రులు, బంధువులు ఎందరో ప్రయత్నిస్తున్నారనీ ఈ విషయాలన్నీ ఈ ప్రాంతంలో ఎవరికి తెలియనివి! ఆ రంగధామయ్యని నేనే! ఏమయ్యా వైద్యుడా! ఇప్పుడైనా తీసుకుంటావా ఈ యిరవై రూపాయలు?" అంటూ రంగధామయ్య మళ్ళీ డబ్బు పైకి తీశాడు

"ఇప్పుడేం తొందర! ఉండనివ్వండి బాబూ! జబ్బు పూర్తిగా నయమైం తర్వాత తీసుకుంటాను" అన్నాడు వెంట్రామయ్య

ఆరోజు సాయంత్రం బస్సులో వెంకట్రామయ్య రంగధామయ్యని వెంటబెట్టుకుని స్వగ్రామం చేరుకున్నాడు.

కల్యాణి వడ్డించగా ఇద్దరు వృద్ధులూ భోజనం చేశారు నాగరాజు ఆరుబయట మంచాలు వేశాడు వెన్నెల పాలార కాస్తోంది. రంగధామయ్య తాంబూలం నములుతూ వున్నట్టుండి తలపైకెత్తి "వెంకట్రామయ్యా! ఇలా నా మంచంపైకి వచ్చి కూచుంటావూ" అన్నాడు

"ఏం బాబూ! మళ్ళీ కడుపు నొప్పి ఏమైనా. "అంటూ వెంకట్రామయ్య దగ్గరికి వచ్చాడు

"కాదులే, ఇది వేరే సంగతి ఎందుకడుగుతున్నానో తరువాత చెబుతా గానీ, మొదట నా ప్రశ్నకి సమాధానం చెప్పు మీరు ములకనాటివా రేకదూ!"

"అవునండీ!"

"గోత్రం, సూత్రం చెబుతావూ!"

వంకట్రామయ్య చెప్పాడు.

"అంతా సరిపోయింది చూడు వెంకట్రామయ్యా, నీకేం ఆక్షేపణ లేకపోతే నేను మీ నాగరాజుని దత్తు తీసుకుంటాను"

"ఏమిటి బాబూ! ఏమన్నారు!" వెంకట్రామయ్య నోరు తెరిచింది తెరిచినట్టే వుండిపోయింది

"ఎందుకో చెప్పలేను వెంకట్రామయ్యా! నీతో నాకు పరిచయం కలిగి ఒక్క రోజయినా కాలేదు. మీ యింట్లో అడుగు పెట్టి ఒక్క ఝామైనా కాలేదు. కానీ మీ కుటుంబంపట్ల నాకేదో మాటల్లో చెప్పరానంత ఆత్మీయత ఏర్పడిపోయింది. మీ అమ్మాయి నన్ను బాబయ్యా అని పిలుస్తోంటే నా మనసు ఏ ఆనందలోకాల్లోనో తేలిపోయినట్టుంది. శుభస్యశీఘ్రం అన్నారు ఆమె కొక సంబంధాన్ని చూడు ఇటు పెళ్ళి—అటు దత్తస్వీకరణ రెండూ ఒకే సారి జరిగిపోవాలి" అన్నాడు రంగధామయ్య

వెంకట్రామయ్య కుమార్తెకి సంబంధం కోసం ఊళ్లన్నీ గాలించాడు మంచి వరుడు గనుక కుదిరినట్టయితే తను స్వయంగా రెండు మూడు వేల రూపాయలు కట్నం యిచ్చి, లక్షణంగా కళ్యాణి పెళ్ళి జరిపించగలనని రంగధామయ్య చెప్పినప్పటికీ, అతని డబ్బును తన కుమార్తె పెళ్ళికట్నంకోసం వాడుకోవడం వెంకట్రామయ్యకు మనస్కరించలేదు. ఆదినుంచీ ఆయన్ను అంటిపెట్టుకుని వుండిన అమాయకత్వం వరనిర్ణయంలో సైతం విడిచి పెట్టలేదు టిచర్సు ట్రెయినింగు స్కూల్లో ఉపాధ్యాయుడుగా తయారౌతున్న ఒక సన్నటి, ఎర్రటి మామూలురకం అబ్బాయిలో తన అల్లుడికి కావలసిన లక్షణాలన్నీ వెంకట్రామయ్యకు కనిపించాయి.

ఒక శుభముహూర్తాన తిరుచానూరు మంగతాయారుపాదసన్నిధిలో ముద్దుల పెళ్ళికూతురు కల్యాణికీ, తారాజువ్వలా ఎప్పుడో ఒకనాటికి ఆకాశానికి ఎగరలేకపోతానా అన్నట్టు బిక్కుబిక్కుమని శ్రీమంతులైన బంధువుల్ని చూస్తూ కూర్చున్న రాధాపతికి పెళ్ళి జరిగిపోయింది.

అంతకు ముందురోజే నాగరాజు షావుకారు రంగధామయ్యగారి దత్తపుత్రుడై, హఠాత్తుగా తనపై ప్రసరించిన శ్రీదేవి అనురాగ వీక్షణాల పన్నీటిజల్లు ఈ చెంపకు ఆ చెంపకు కొట్టడంవల్ల నేమో ఉక్కిరిబిక్కిరై తబ్బిబ్బుపడిపోసాగడు.

2

"ఇంకా ఎంతదూరముందర్రా ఊరు?" నాన్నని అడిగింది కల్యాణి.

"ఎంతో ఎక్కడిదమ్మా! ఇదిగో ఈ గుట్టవుంది చూచావూ, దీన్ని దాటుకోగానే నిమ్మలచెరువు చెరువు మరవ దాటుకుంటే చింత తోపు తోపు దాటుకుంటే ఊరు." అన్నాడు నాగులు

డొంక దారిలో బండి పడుతూ లేస్తూ పోతున్నది. శొక్టెలు గట్టుకుని లోకాన్ని ముట్టడించిన కారుచీకట్లు వున్నట్టుండి మాయమైపోసాయి తూరుపు కొండ శిఖరంపైన ఆకాశం క్రమక్రమంగా ఎరుపెక్కసాగింది చల్లగా చంద్రుడు పైకి వచ్చి ప్రకృతికి గిలిగింతలు పెట్టాడు.

వెన్నెల సర్వసామాన్యంగా ప్రాణులన్నింటికీ ఆనందదాయిని అది విషాదభరితమైన కల్యాణిహృదిలో కూడా గతించిపోయిన కొన్ని దివ్యానుభూతుల స్మృతుల్ని పైకి తోడింది

ఆ రోజు రాత్రి .

ఆమెకు పెళ్ళయి యింకా ఒక నెల కూడా కాలేదు. భర్త ఊరినుంచీ వచ్చాడు అతడి రాకకోసం అప్పుడామె ఎదురు చూడలేదు న్యాయానికతడు పదిరోజుల తర్వాత వచ్చివుండవలసింది ఆ రాత్రి కూడా వెన్నెల కాసింది. సరిగ్గా ఇలాటి వెన్నెలే! ఇంటివెనుక జాజిమల్లెపందిరిక్రింద కూర్చున్నప్పుడు "ఏమండీ! వస్తున్నట్టు జాబైనా వ్రాశారు కాదేం" అని ఆమె అడిగింది రాధాపతి ఇలా అన్నాడు "రాకపోకలన్నీ నా నిర్ణయంపైనే జరిగితే, నా నిర్ణయాన్ని ఎప్పటికప్పుడే నీకు తెలిపేవాడిని కల్యాణీ! నేను బొత్తిగా అస్వతంత్రుడినైపోయాను ఏదో ఒక యింద్రజాలం ప్రభావానికి నేను లోనైపోయాను. ఈ యింద్రజాల మెక్కడుందో చెప్పమంటావా? నీలో. స్పష్టంగా చెప్పాలంటే నీ కళ్ళలో."

సిగ్గుపడిపోయింది కల్యాణి!

రాధాపతి అప్పటికే యిప్పటికీ వెన్నెల్లో కూచున్నప్పుడల్లా ఆ మాట చెబుతూనే వుంటాడు.

అందుచేత ఆ మాట పాతబడిపోలేదు. ఆ

రాగం, ఆ ఆదరం ఇంకా కల్యాణికి నిత్యనూతనంగానే వుంటాయి.

కానీ కాలం గడిచిపోయింది. జీవితం కల్యాణి అనుకున్నంత సౌఖ్యావహం మాత్రం కాలేదు. సంతానం కోసం ఏడుకొండలెక్కి ముడుపు చెల్లించకముందే, ఇరుగింటి పొరుగింటి బిడ్డల్ని చంకకెత్తుకుని పసిపాపల సాన్నిధ్యంలో బ్రతుకెంత హాయిగా గడచిపోగలదని ఊహాగానాలు సాగించకముందే ఆమె యిద్దరు బిడ్డల తల్లయింది. నెలకరవై రూపాయల సంపాదనలో పల్లెగాక పట్నమూ గాని పేటకొంపలో వంటకట్టెలనుంచీ, పాలడబ్బాల వరకూ అన్నీ కొనుక్కుంటూ బ్రతుకు నీడ్చడం ఆమెకి భారంగా తోచడానికి ఎంతోకాలం పట్టలేదు.

బ్రతుకు లేకపోతే బడిపంతుళ్లయ్యేవారట మును పెప్పుడో! ఇప్పుడా వుద్యోగం దొరకడానికి కూడా బ్రహ్మప్రయత్నం కావలసి వస్తోంది. ట్రెయినింగు అయినప్పటి నుంచీ, ప్రయత్నించగా ప్రయత్నించగా ఒక డిస్ట్రిక్టుబోర్డు ఛాన్సు దొరికింది. ఆ ఛాన్సు దొరికిన మూడు నెలలకే వేసవి సెలవులొచ్చాయి. సెలవుల్లో జూనియర్ మోస్టు టీచర్లనందరినీ ఊస్టు చేసి పారేశారు.

ఆ తరువాత రాధాపతి ఎక్కడైనా స్వంతంగా ఒక స్కూలు ప్రారంభించుకుంటే బాగుంటుందేమోనని తలపోశాడు. ఎయిడెడ్ స్కూళ్ళమీద ప్రభుత్వానికి చిన్నచూపున్నమాట నిజమే అయినా బాగా కృషిచేసే వుపాధ్యాయుడికి అలాంటి స్కూళ్లల్లో ప్రతిఫలం ముట్టకపోదనే నమ్మకంతో అతడు దాదాపు రెండువేల కడప వరకూ వున్న ఒక వూళ్లో స్కూలు ప్రారంభించి రికగ్నిషన్ తెప్పించుకున్నాడు. ఈ ఎయిడెడ్ స్కూలుకు, అంతకు పూర్వం నుంచీ వున్న బోర్డుస్కూలుకు ఆదిలో కొంచెం పోటీ చెలరేగి రానురానూ తగ్గిపోయింది. విద్యాబోధనలో ఎయిడెడ్ స్కూలుకు ప్రథమస్థానం లభించినప్పటికీ, అత్యవసరాలైన బోధనోపకరణాలు సైతం లేకపోవడంవల్లనూ, కట్టడం బొత్తిగా పాతబడిపోయి శిధిలావస్థలో వుండడంవల్లనూ అది పైఅధికారుల మన్ననకు నోచుకోలేకపోయింది. ఎలాగైనా ఒక అయిదు వందల రూపాయలతో అయిదంకణాల పూరికొంపయినా వేసుకోకపోతే పాఠశాలని చెట్లక్రింద నడపవలసిన దుర్గతి తటస్థించుతుందేమోనని రాధాపతి లోలోపల తపించిపోసాగాడు.

"ఏం కల్యాణీ! మీ అన్నయ్య నింతవరకూ మన మెప్పుడూ యాచించలేదు. ఇప్పుడైనా మనం ఆయన్ని ఉచితంగా యివ్వమని అడుగబోవడం లేదు. అప్పుగా అయిదు వందల రూపాయలివ్వమను. కావాలంటే వడ్డీ కూడా.' కల్యాణి ముఖంలో అలముకుంటున్న కోపచ్ఛాయల్ని చూచి రాధాపతి అర్ధోక్తిలోనే ఆగిపోయాడు.

"చెప్పండి చెప్పండి నిలిపేశారెందుకు? మనం యిచ్చే వడ్డీతో నేగదూ ఆయన బతుకు సాగుతోంది! ఐనా యింత పుల్ల విరిచినట్టు మాట్లాడగూడదండీ!" అంది కల్యాణి.

"అదిగో! అప్పుడే భద్రకాళిలా మారిపోతే నేనేం చెప్పను! నేనిప్పుడు మాట్లాడుతున్నది మీ అన్నయ్యతో కాదు; నీతో. ఆయన వుచితంగానే మన కా డబ్బు యివ్వగలిగితే మరీ సంతోషం."

కల్యాణి ఫలానా రోజు సాయంత్రం రానున్నదనీ, స్టేషనుకి బండి పంపించమనీ రాధాపతి నాగరాజుకు జాబు వ్రాశాడు.

3

చెరువుకట్టమీద బండి హఠాత్తుగా ఆగింది. ఎద్దులు బెదిరి బండిని దారి తప్పించబోయాయి. నొగమీద కూచున్న నాగులు అసాధ్యుడు. అతడు పగ్గాలు బిగబట్టి వలపెద్దుని అదుగుతూ ముందుకు పోనీకుండా ఆపి, దాపెద్దుని వీపుమీద చరిచి "ఈ పాడు చెరువుకట్టపైన పుట్టలు బలిసిపోతున్నాయండమ్మగారూ! నేను చూస్తూనే వున్నానుగా, ఈ పుట్టల్లో కోడెత్రాచులు బుసకొడుతుంటాయి. ఒకటిప్పుడిలా పరుగెత్తింది. ఎద్దులు బెదిరిపోయాయి" అన్నాడు.

"పాము ఎగురయిందా నాగులూ! అయ్యో, అది అపశకునమే!" అంది కల్యాణి

"శకునాలెవరు నమ్ముతారండమ్మా ఈ కాలం! బాబుగారు ఎక్కడికైనా బయల్దేరుతారనుకోండి. పెంపుడు పిల్లి అడ్డంరాకుండా వుండదు. అది వచ్చింది కదా అని ఆయన పని చెడిపోయిందెప్పుడు? అదంతా ఒక పిచ్చి" నాగులు ఒక్క ఉదాహరణంతో శకునశాస్త్రాన్ని కొట్టిపారేశాడు.

కల్యాణి బిక్కు బిక్కుమంటున్న గుండెతో చెరువు కట్టపైన పుట్టల్ని చూడసాగింది. పుట్టల వెనుక నిండిన చెరువుపైనుంచీ, కట్టక్రింద కనుచూపుమేరకా పండి సాపుగా క్రిందికి వ్రాలిన వరిమళ్ళపైనుంచీ చల్లనిగాలి మెల్లగా వీస్తోంది. ఆ చెరువు నిండి ఆ పొలాలు పండితే చనిపోయిన రంగధామయ్య కట్టించిన గరిసెలు నాలుగూ నిండుతాయి. ఊళ్లో రావిచెట్టుక్రింద నెలకొనివున్న రాములవారి భజనగుడి తాలూకు అర్చకమాన్యమూ, మంగలిమాన్యమూ మినహాయిస్తే మిగతా పొలాలన్నింటినీ కొనివేసి ట్రాక్టర్లతో కయ్యలను తీర్పించి వాన కోసం ఎదురుచూస్తూ కూచోవలసిన అవసరం లేకుండా రెండు పెద్దబావుల్ని త్రవ్వించి రంగధామయ్య తన వారసులకి కూడా చెరువుక్రింద ఒక అమూల్యమైన ఆస్తిని సంపాదించిపెట్టాడు. రంగధామయ్యగానీ అతడి పూర్వులుగానీ ఏ పనిచేసినా అలాగే చేశారు. ఇల్లు కట్టాలనుకుంటే నాలుగైదు మహిడీలకు సరిపోగల కర్రసామానుకు దూలాలుగా త్రావులుగా తలుపులుగా ద్వారబంధాలుగా తీర్పించి కొట్టాల్లో పదిలం చేశారు. ఒక పూరిపాక వేసే సరిపోయే చోట మంగుళూరు పెంకులు తెప్పించి శాశ్వతంగా వుండిపోయేటట్టు పెద్ద పెద్ద కొట్టడీలు కట్టారు. వెండి సామానుపైన మోజు పడితే నప్పుడు వీశలు వీశలుగా వెండికొని బత్తెగాళ్ళ చేత పాత్రలు పళ్లేరాలు చేయించారు. ఇక బంగారం సంగతి సరేసరి! నిర్దిష్టంగా ఎవరికీ తెలియదుగానీ ఆయింట్లో బంగారు వుంగరాలు మాత్రం ఒక్క సేరు నిండా వున్నాయని అమ్మలక్కలు ఆశ్చర్యంతో చెప్పుకోవడం పరిపాటి.

బండి చెరువుగట్టు దిగుతుండగా బాబు లేచి కూచుని "ఇంకా ఎంతదూరం పోవాలమ్మా!" అన్నాడు.


కల్యాణి చెదరిపోయిన బాబు ముంగురుల్ని సవరిస్తూ "ఊరి దగ్గరికి వచ్చేశాం బాబూ! అదిగో, ఆ చింతచెట్టు సందులోంచీ మామయ్యగారి మేడ కనబడుతోంది చూడు" అంటూ దూరంగా ఎక్కడో గంభీరంగా నిలిచివున్న మూడంతస్తుల మేడపైని గదిలోనుంచీ కిటికీద్వారా బయటపడుతున్న దీపపు వెలుగుని కుమారుడికి చూపించింది.

భజనగుడి సుందర మండపంలో మేను వాల్చి గత జీవితంలోని మధురస్మృతుల్ని నెమరు వేసుకుంటున్న వృద్ధులిద్దరు ముగ్గురు ఎద్దులబండిని చూచి మిద్దింటివారి బంధువులెవరో వస్తున్నారనుకున్నారు. ఇంకా తిండిపైన ఆశ వదులుకోలేక ఊళ్లో ఆ చివర నుంచీ ఈ చివరకు గస్తీ తిరుగుతున్న కుక్కలు బండిని చూచి మొరగబోయి నాగుల్ని కోలకట్టెతో కొడించుకుంటూ వెళ్ళిపోయాయి.


బండి యింటిముందు నిలిచింది. నాగులు నొగపైనుంచీ క్రిందికి దూకి ఇనుపతలుపులు తెరచి బండిని లోపలికి తోలాడు. వెన్నెల వెలుగులో కల్యాణికి భవనం స్పష్టంగా కనిపించింది. రంగధామయ్య చనిపోయినప్పుడు కల్యాణి ఆ యింటికోసారి వచ్చింది. ఆయన చనిపోయిన తర్వాత రెండు మూడేళ్లు గడిచిపోయాయి. రంగధామయ్య ఆ భవనం కట్టించడంలో ఎంత పట్టుదల చూపాడో, దాన్ని నాజూకుగా

(8 వ పేజీ చూడండి)

పెరంబూర్ ఇంటెగ్రల్ కోచ్ ఫాక్టరీ.



ఇంటెగ్రల్ కోచ్ ఫాక్టరీలో కూర్చిన రైలుపెట్టె



రైలుపెట్టెల [illegible]

అతడొక్కడికో ప్రయాణమై మేడమెట్లు దిగుతూ గదితలుపుదగ్గర ప్రత్యక్షమైన కల్యాణిని చూచి "ఎప్పుడొచ్చావు కల్యాణీ! జాబులో వ్రాసినట్లు రాత్రే వచ్చేశావన్న మాట! అరరే, స్టేషనుదగ్గరికి బండి పంపడం మరచిపోయాను గదూ!" అన్నాడు

"నువ్వు మరచిపోయినా వదిన నన్ను మరచిపోతుందా అన్నయ్యా! స్టేషను దగ్గరికి బండి వచ్చింది" అంది కల్యాణి.

నాగరాజు హాల్లో కుర్చీలో కూర్చుంటూ "బంధువుల విషయంలో మీ వదిన చాలా జాగ్రత్త తీసుకుంటుంది కల్యాణీ! ఆమే లేకపోతే ఈ యింటికి బంధువులు రావడమే చాలించుకుంటారేమో! నేను రానురానూ మందమతినై పోతున్నాను" అంటూ తన మతిమరపుకు నొచ్చుకున్నాడు

కల్యాణి మౌనంగా అన్నగారి ముఖంలోకి చూస్తూవుండి పోయింది చూస్తూ వుండగా ఆమెకెన్నో సందేహాలు కలిగాయి పెళ్ళిగాకముందు తనని చూచి "కల్యాణీ! అమ్మ ఎప్పుడో చనిపోయింది నిన్ను చూస్తున్నప్పుడల్లా అమ్మ నాకు జ్ఞాపకమొస్తుంది పెళ్ళయి నువ్వు అత్తగారింటికి వెళ్ళిపోతే, ఆ తరువాత ఈ యిల్లు భూతగృహమై పోతుందనుకో! ఆపైన ఇక్కడ నేనూ, నాన్నగారు ఎలా కాలం వెళ్ళబుచ్చగలమో తలుచుకుంటేనే గుండె కుతకుతలాడి పోతుందనుకో" అని గురపిల్లిన ఆ అన్నయ్యేనా యితడు!

కల్యాణి కళ్లు నీళ్ళతో నిండాయి అంతలో నాగరాజు "అదేం కల్యాణీ ఒంటరిగా వచ్చావు! బావగారేం చేస్తున్నట్టు?" అని ప్రశ్నించాడు

"ఆయనకు సెలవు దొరకదన్నయా!" అంది కల్యాణి

"సెలవు దొరికినప్పుడు రమ్మన్నానని చెప్పు" అంటూ నాగరాజు లేచాడు.

వెళ్ళిపోతున్న నాగరాజుని చూస్తూ అక్కడే నిలుచుండిపోయింది కల్యాణి రాగానే వదిన ఆమెని పరామర్శించింది. మరునాటి వుదయం అన్నయ్య పరామర్శించాడు. కానీ ఈ పరామర్శల వెనుక అవ్యాజానురాగంతో నిండిన హృదయాలున్నాయా, లేవా? ఈ సందేహానికి కల్యాణి సమాధానం చెప్పుకోలేకపోయింది.

తనకోసం రెండో అంతస్తులో ప్రత్యేకించుకున్న గదిని విడిచిపెట్టి శేషమాంబ ప్రతిరోజూ నాలుగైదు సార్లయినా క్రిందికి వస్తుంది. వచ్చినప్పుడల్లా "ఏమమ్మా కల్యాణీ! నిద్రపోతున్నావా" అనో "ఏమమ్మా మరదలా! చదువుకుంటున్నావా" అనో కల్యాణిని పలకరిస్తుంది. వదినా మరదళ్లిద్దరూ హాల్లో కూర్చుంటారు ఇంతలో ఏ సాఖిగో, ఏ సేద్యగాడో, ఏ గుమాస్తాగో అమ్మగారికోసం అక్కడికి వస్తాడు ఒకసారి బస్తీనుంచి బట్టలవర్తకుడొకడు వచ్చాడు శేషమాంబ అతడిపైన విరుచుకపడింది "నువ్విచ్చిన చీరల్లో చాయ వుండి ఏడిచింది ఒక్కటీ లేదు చూడమ్మా కల్యాణీ! ఈ చీర అరవై అయిదురూపాయలని యిచ్చిపోయాడు. నాలుగు దళకలకెళ్లి వచ్చిందంతే! చూడు. పైనవున్న పువ్వులన్నీ చెవరిపోయి అచ్చం గ్లాస్కో మల్లులా తయారైంది అబ్బబ్బ! ప్రపంచమంతా మోసంతో నిండిపోయింది," ఇలా సాగింది ప్రసంగం. వర్తకుడు తెల్లబోయి "ఆ చీర నేనిచ్చింది కాదమ్మా" అని మొరపెట్టుకున్నాడు. అతని మొర ఆలకిస్తూ కూచోడానికి శేషమాంబ అంతతీరికున్న మనిషేం కాదు. "ఇప్పుడు బట్టలు కొనే వుద్దేశం లేదు. పదిపదిహేను రోజుల్లో తాళిరా" అన్నదామె. వర్తకుడు పై బట్ట విదిలించి భుజాన వేసుకుని మూట తలపైన పెట్టుకుని వెళ్ళిపోయాడు.

వర్తకుడు దూరంగా వెళ్ళిపోయిన తర్వాత శేషమాంబ గొల్లుననవ్వి "ఏం కల్యాణీ! చూచావా ఎటువంటిమనిషి ఎలా దెంగైపోతాడో! అమ్మో, కొంచెం చోరవ యిచ్చామంటే యిలాంటి అసాములు ఇంటిని గుల్లచేసి పారేస్తారనుకో ఒక వారం క్రిందట ఒకసారి వచ్చాడు. అప్పుడు మూడు వందల రూపాయలైంది బిల్లు. మళ్లీ యిక్కడే పాతిపోయినట్లు అప్పుడే వచ్చేశాడు. ఈ చీర ఇతడిచ్చింది కాదు లే! ఊరికే దబాయించేశాను" అంది

కల్యాణి నిర్ఘాంతపోయింది!

రోజులొక్కొక్కటిగా గడుస్తూ గడుస్తూ కల్యాణి కాయింట్లో యింకా ఎన్ని రోజులుండవలసి వస్తుందోనన్న బెంగపట్టుకుంది. ఐతే ఆమె అక్కడ ఎంతో కాలం

★ చీమలు పెట్టిన పుట్టలు ★

వుండడానికి కూడా పరిస్థితులు అనుకూలించలేదు

ఒక రోజు సాయంకాలం ప్రొద్దుపోక కల్యాణి మేడముందర పందిరి క్రింద కూర్చుని ఏదో పుస్తకం చదువుకుంటోంది. ఏ ఊరికో వెళ్ళిన నాగరాజు యింకా తిరిగి రాలేదు. ఒళ్లు జబ్బుగా వుందని శేషమాంబ ఆ రోజంతా మేడపైనుంచీ క్రిందికి దిగలేదు. బాబు ప్రక్కింటివారి అబ్బాయితో ఆడుకోడానికి వెళ్ళాడు. రవి కప్పుడే నిద్ర పట్టింది. కల్యాణి కెందుకో ఆరోజు వుదయంనుంచీ మనసు బాగుండలేదు కళ్లు పుస్తకంపైనే వున్నప్పటికీ మనసుమాత్రం ఎక్కడో సంచరిస్తోంది

"ఒంటరిగా మిగిలిపోయావేం కల్యాణీ!" వాసు వీధిలోంచి వస్తూ పలకరించాడు

కల్యాణి తల పైకెత్తింది. ఫుట్‌బాల్ ఆటగాడి దుస్తుల్లో వాసు కనిపించాడు. ఒకటి రెండు క్షణాలు ఊరుకుని కల్యాణి మాటవరుసకు "కూచో వాసు" అంది

వాసు కల్యాణి కూర్చున్న బెంచీపైనే ఒకవారగా కూర్చుంటూ గాఢంగా ఒక నిటూర్పు నిగుడించి కల్యాణివైపు జాలిగా చూచాడు ఆ చూపుల వెనుక ఎలాటి భావం నిక్షిప్తమై వున్నదో తెలియక కల్యాణి "ఏం వాసూ! నిట్టూర్పు విడుస్తున్నావు" అంది.

"ఈ ప్రపంచంలో కొన్ని అనుచిత కార్యాలు జరిగిపోతుంటాయి కల్యాణీ! అందుల్ల కొందరిజీవితాలు అడవి గాచిన వెన్నెల్లా వ్యర్థమైపోతుంటాయి. నాకు విధి, కర్మ మొదలైనవాటిపైన నమ్మకం లేదు. మానవులకు దూరదృష్టి లేకపోవడమే ఈ అనర్థాలన్నిటికీ కారణం"

మానవజీవితాన్ని గురించి వాసుకు ఇంత తీవ్రంగా ఆలోచించవలసిన అవసరమేమొచ్చిందో కల్యాణి గ్రహించలేకపోయింది తన బ్రతుకును ప్రయాణాలకు, సినిమాలకు క్రికెట్టు పందాలకు మీదుకట్టిన వాసు, క్వెట్టాలో భూకంపం జరిగినా, గోదావరి వరదల్లో మనుషులు కొట్టుకుపోయినా, గోవాలో సత్యాగ్రహుల్ని నిలబెట్టి కాల్చివేస్తున్నా నిటూర్పు విడువని వాసు ఉన్నట్టుండి తన ధోరణికి విరుద్ధమైన భావాల్ని బయటపెట్టేసరికి కల్యాణి తెల్లబోయింది కూడా!

"నలభై ఎనిమిదిలో ననుకుంటాను, నిన్ను మొట్టమొదటిసారిగా పెళ్లిపీటలమీద చూచాను చూడగానే నా మనసు చివుక్కుమంది కల్యాణీ!" మళ్ళీ ప్రారంభించాడు వాసు.

"ఎందుకూ?" అప్రయత్నంగా ప్రశ్నించింది కల్యాణి.

"చెబుతాను. ఒక రత్నం వుందనుకో అది మహారాజు మకుటంలో నైతే శోభిస్తుంది. నేలపైన విసరివేస్తే యేమౌతుంది చెప్పు?"

"అంటే?"

"నువ్వేమైనా అనుకో కల్యాణీ! నీకు వరుణ్ణి నిర్ణయించడంలో మీ నాన్నగారు చాలా పొరబడ్డారు"

"మాడు వాసూ! ఈ విషయంలో పొరబడుతున్నది నువ్వే, మా నాన్నగారు కాదు. మావారిని గురించి నువ్విలాటి విపరీత నిర్ణయాని కెలా వచ్చావో నా కర్థం కావడం లేదు. అలాటివారు మగవాళ్లలో నూటికి కోటికి ఒక్కరుంటారు."

"ఇదంతా ఆత్మవంచన కల్యాణీ! చేత డబ్బులేనివాడు, బ్రతుకు గడవాలంటే పదిమంది సహకారం కావలసినవాడు తప్పనిసరిగా మంచివాడుగానే వుంటాడు. మంచితనమనేది అసమర్థతకు పర్యాయపదమని నా వుద్దేశం."

కల్యాణి వాసుని చురచురా చూచింది. ఆ చూపుల్లోని అర్థాన్ని ఆకళించుకునే పాటి వివేకం వాసుకి లేదు. "అదీగాక కల్యాణీ!" అంటూ అతడు మళ్లీ తన ప్రసంగాన్ని కొనసాగించబోయాడు.

"నాకు తలనొప్పిగా వుంది వాసూ! పోయి పడుకుంటాను" అంటూ కల్యాణి లోపలికి వెళ్ళిపోయింది

తుపానులో అల్లకల్లోలమైపోయిన ప్రకృతిలా కల్యాణిమనసు ఆందోళితమైపోయింది. తనభర్తనిగురించి హీనంగా మాట్లాడేంత చొరవ అతడి కెలా కలిగింది? ఏ అండచూచుకుని అతడంత ధైర్యంగా మాట్లాడగలిగాడు? అలా మాట్లాడడంలో అతడి ఉద్దేశమేమిటి?...గోడ గడియారం ఎనిమిదిసార్లు మ్రోగేంతవరకూ కల్యాణి ఆలోచిస్తూ ఉండిపోయింది ఐనా ఆలోచనలు తెమల్లేదు హాల్లో అడుగుల సవ్వడి వినిపించడం వల్ల ఆమె లేచి కూర్చుంది ఒకవేళ ఆ వచ్చింది నాగరాజేమో ననుకుంది కాని అతడు రాలేదు వచ్చినవాడు వాసు అతడు ద్వారందగ్గర నిలబడి "పుస్తకం బెంచీపైన మరచిపోయావు కల్యాణీ!" అంటూ దాన్ని గదిలోని స్టూలుపైన వుంచి బయటికి వెళ్ళిపోయాడు. ఆ రావడంలోనూ పోవడంలోనూ కల్యాణి కేదో అనుమానం తగిలింది. వాసు శారీరకంగా ఎంతటి బలవంతుడో, మానసికంగా అంత దుర్బలుడు. మనసుప్రభావం శరీరంపైన ఎప్పుడూ ఉండనే ఉంటుంది గదిలోకి వచ్చినప్పుడు వాసు ముఖంలో కత్తివేటుకు నెత్తురుచుక్క లేకపోవడం కల్యాణి గమనించింది. అతడేదో అకార్యం చేసివుంటాడు. ఏమిటది? ఒకానొక సందేహంతో కల్యాణి పుస్తకాన్ని చేతికి తీసుకుని పుటలు తిరగవేసింది. ఆమె సందేహం వృథాగా పోలేదు. అక్షరాలా నిజమైంది

పుస్తకంలోనుంచి జారిన చీటీని కల్యాణి వణుకుతున్న చేతుల్లో విప్పింది

"కల్యాణీ! నువ్వు నా మనోవేదన గ్రహించివుంటావనుకున్నాను. కానీ నువ్వేమీ తెలియనట్లు మాట్లాడుతుంటే, నా హృదయం తుత్తునియలై పోతోంది. నేనొక పశువులా ప్రవర్తిస్తున్నానని నువ్వనుకోవచ్చు. కానీ ఏం చేయమంటావు! ప్రేమ గ్రుడ్డిది కదా!"

ఆ క్షణంలో కల్యాణి మనోవీధిలో ఎలాటి భావాలు చెలరేగాయో ఊహించడమంత సులభసాధ్యమైన పని కాదు ఆమె ఉన్మత్తురాలిలా ఒక్కసారి విరగబడి వికటంగా నవ్వాలనుకుంది. గొంతెత్తి ప్రపంచానికంతా వినబడేటట్టు "మానవతుల శీలాలకు ముప్పు తలపెట్టే కిరాతకుడు కూడా అచ్చంగా మానవుడిలాగే ఉంటాడు జాగ్రత్త, జాగ్రత్త" అని హెచ్చరిక చేయాలనుకుంది. కానీ ఆమె పెదవులుసైతం కదల్లేదు. చేతుల్లో చీటీ తునాతునకలైపోయింది.

ఆ రాత్రి కల్యాణికి నిద్రపట్టలేదు. తను పుట్టింటిని వెరుక్కుంటూ వచ్చింది. అన్నయ్య ఆదరంతో, అనురాగంతో తనను సత్కరిస్తాడనుకుంది వదిన తనతో మనసిచ్చి మాట్లాడుతుందనుకుంది తన కలాటి మున్నదేదీ జరుగలేదు పైగా ఈ ఇంట్లో కొత్తగా ఒకటి తిరుగాడుతోందనే విషయం తనకిప్పుడిప్పుడే తెలియవస్తోంది. తన కిది ఉండదగిన చోటు కాదు ఇక్కడికి రావడమే పెద్దపొరబాటు

అర్ధరాత్రి దాటింది బయట చలిగాలి రివ్వున వీస్తున్నా గదిలోమాత్రం వెచ్చగానే వుంది చీకటీగలు మాత్రం రొదచేస్తూనే ఉన్నాయి. నిద్రిస్తున్న కుర్రాళ్లపైన ఏదైనా కప్పాలనుకుని కల్యాణి దుప్పటి కోసం గదంతా వెదికింది బాబు దాన్ని తీసుకెళ్ళి హాల్లో పారేశాడేమోనని తలుపు తెరిచింది హాల్లో దీపం వెలగడంలేదు గదిలోనుంచీ దీపకాంతి వచ్చి హాల్లో పడింది. ఆ వెలుగులో కల్యాణికి ద్వారందగ్గర నిలబడివున్న వాసు కనిపించాడు.

వాసు తలుపు తెరిచిన కల్యాణిని చూచాడు అతడూ అప్పటివరకూ నిద్రపోక తనవల్ల పిలయినంతవరకూ కథను అల్లుకపోయాడు. తన చీటీని కల్యాణి చూసి ఉంటుంది. బదులు లేదు. మౌనం అంగీకార సూచకమేమో! అదిగాక ఈ మెకు కూడా నిద్రపట్టినట్టు లేదు పైగా తలుపు తెరుస్తోంది.

వాసు అడుగు ముందుకు వేయబోయాడు

కానీ కాలు కదలడానికి నిరాకరించింది. పెదవి విప్పబోయాడు. కానీ నోటికెవరో తాళం వేసేశారు! అతడు తనపాచిక పారిందనుకున్నాడు. అనుకుంటూనే ఏదో ఊహాకందని భయంచేత ఆపాదమస్తకం గడగడ వణికి పోసాగేడు.

కల్యాణి కేం చేయడానికీ పాలుపోలేదు. ముల్లువచ్చి అరిటాకుపైన పడినా, అరిటాకు ఎగిరి ముల్లుమీద పడినా చిరిగేది అరిటాకే నన్న సత్యం కల్యాణికి తెలియందికాదు. ఆమె ఆలోచించింది. ఇది తనకు అనువుగాని చోటు. ఇక్కడివాళ్లు తన సౌశీల్యాన్ని గుర్తించగలరని నమ్మడానికి వీల్లేదు. కానీ ఇప్పుడు తనేం చేయాలి?

కల్యాణి ఒక నిర్ణయానికి వచ్చేలోపల రెండు మూడు నిమిషాలు గడిచిపోయాయి ఆమె తలుపుని ముందరికి త్రోసి సందులోనుంచీ వాసుని చూస్తూ "నేనాడదాన్ననీ, ఒంటరిగా వున్నాననీ నువ్వేదో దౌర్జన్యం చేయాలనుకుంటున్నావు నీకు మంచిగా చెబుతున్నాను. వినాశకాలం సమీపించితేగాని ఇలాటి దుర్బుద్ధి పుట్టదు. బుద్ధితెచ్చుకుని ఇక్కడినుంచీ వెళ్ళిపో. రేపటినుంచీ నీముఖాన్ని నాకు చూపకు" అని ఒక్క విసురుతో తలుపుమూసి గడియ వేసుకుంది.

ఆ మరునాటి ఉదయం శేషమాంబ పడకపైన లేచి కూచుని, తనకెదురుగా కుర్చీలో కూచునివున్న కల్యాణిని చూచి ఆశ్చర్యపడుతూ "ఏం కల్యాణీ! తెల్లవారకముందే యిలా వచ్చేశావు! ఇంకా పర్రాళ్లు నిద్ర లేవలేదేమిటి?" అంది.

"ఇంకా లేవలేదు వదినా! నాకేమో యిక్కడి వాతావరణం బొత్తిగా సరిపడ్డం లేదు. ఊరికి వెళ్ళిపోదామనుకుంటున్నాను."

"మీ అన్నయ్య రానీవుండు, వెళ్దువు గానీ"

"లేదు వదినా! నాకేమో ఇక్కడ భయంగా వుంది."

"భయమా! ఇక్కడేం భూతాలున్నాయా కల్యాణీ!"

"భూతాలు యిష్టంవచ్చినట్టు ఏ రూపాన్నయినా ధరించగలవుకదా వదినా! ఈ నమ్మకం ప్రకారం ఆలోచించినట్టయితే యిక్కడ మానవరూపాన్ని ధరించిన భూతాలున్నాయేమోనని నాకు సందేహంగా వుంది."

"ఏమిటమ్మా మరదలా! పరిహాసాలు ప్రారంభిస్తున్నావా" అంటూ శేషమాంబ అద్దంలో ముఖం చూచుకుంటూ కేశపాశాన్ని సవరించుకోసాగింది.

"పరిహాసాలుకావు వదినా! ఈ సంగతి నీకు చెప్పకుండా వుండలేకపోతున్నాను మీ తమ్ముడున్నాడు చూడు, వాసు! అతణ్ణి వాసు అనడంకన్నా వాసుకి అనడం సబబుగా వుంటుంది. అతడు నిన్న నాదగ్గర తనిన్నిరోజులుగా లోలోపల దాచుకున్న హాలాహలాన్ని వెళ్ళగక్కాడు."

"ఏమిటీ!" తోకత్రొక్కిన త్రాచులా కల్యాణివైపు తిరిగింది శేషమాంబ.

"ఆ పాడుసంగతి వివరంగా ఎలా చెప్పను వదినా! నువ్వూ నాలాటి ఆడదానివి! నిదానంగా ఆలోచించుకో. అన్నయ్య వచ్చినా రాకపోయినా నేను రేపో మాపో ఊరికి వెళ్ళిపోవాలి" అంటూ కల్యాణి గదిలోనుంచి బయటికి పోబోయింది.

"ఏతే కల్యాణీ! యీ అభాండాన్ని మోపి వాడిని నలుగురిలో నగుబాట్లపాలు చేయాలని నీ వుద్దేశమా!" అని శేషమాంబ కల్యాణిపైకి ఒక విశితోక్తి విసరింది.

"అబ్బే, నావుద్దేశం అదికాదు వదినా! నీ తమ్ముడి విషయం నీతో రహస్యంగా చెప్పానంతే" అని కల్యాణి తరువాత అక్కడ నిలుచోకుండా మెట్లు దిగి క్రిందికి వచ్చేసింది'

ఆ రోజు మధ్యాహ్నం నాగరాజు ఊరినుంచీ తిరిగి వచ్చాడు. వస్తూనే స్నానం చేసి భోజనం కానిచ్చి మేడపైకి వెళ్ళిపోయాడు కల్యాణి అతడు క్రిందికి దిగిరాగలడని సాయంత్రంవరకూ ఎదురు చూచింది. చివరికి తనే మేడపైకి వెళ్తే వచ్చే అగౌరవమేముందని రవిని తీసుకుని మేడమెట్లెక్కింది. ఆమె సరాసరి నాగరాజు గదిలోకి వెళ్ళాలనే అనుకుంది. కానీ లోపల ఏదో తీవ్రమైన చర్చ జరుగుతుండడం విని గది బయటే నిల్చుంది.

శేషమాంబ ప్రసంగంలో చిట్టచివరి మాటల్ని మాత్రం వినగలిగింది కల్యాణి

"వీడు వట్టి బోళాబాయిరకం కదండీ! మీకు తెలియందేముంది! తెల్లనివన్నీ పాలనుకుంటాడు. శుద్ధ అమాయికంగా ఆమెతో ఏం మాట్లాడాడో ఏమో! పరిచయమున్న అమ్మాయికదా, పైగా వరుసకూడా వుంది కదా అని తమాషాకి ఏమైనా అన్నాడేమో! ఆమె గోటబోయే పనికి గొడ్డలే పైకితీస్తోంది. వీడట, మానవరూపంలో వున్న దయ్యమట! అబ్బబ్బ, ఆ మాటల్ని వినలేకపోయానంటే నమ్మండి"

"ఇంతకూ నేనేమన్నానని బావా! చూడు కల్యాణీ! నీ గుణగణాలకు, రూపలావణ్యాలకు తగిన భర్త నీకు దొరకలేదన్నాను. అంతే. ఇంతమాత్రానికే ఆవిడ.." వాసు వాక్యాన్ని సగంలో త్రుంచివేశాడు.

"పోనీలేరా వాసూ! మా చెల్లెలని నేనేమీ ఆమెను వెనకేసుకుని రావడం లేదుగా! విశాల దృక్పథం లేనివాళ్లతో వచ్చిన చిక్కేయిదే!" నాగరాజు ఈ పలుకులతో ఆ చర్చని ముగించాడు.

కల్యాణి కళ్లల్లోనీళ్లు గిర్రున తిరిగాయి. నిజంగా నాగరాజు ధోరణి ఆమె మనసుపైన పెద్ద వ్యాఘాతంలా పనిచేసింది. తనపట్ల వాసు ప్రవర్తన సైతం ఆమె కింతటి విచారం కలిగించలేదు. వదిన ముఖాముఖీ నిలిచి తనని దూషించినా ఆమె కింతటి అవమానం కలుగదు. వాళ్లెవరో? తనెవరో? కానీ ఒక రక్తం పంచుకుని పుట్టిన అన్నయ్య తనకి విశాల దృక్పథం లేదని, అక్కడికి తన భార్య, బావమరిది ఏదో గొప్ప సంస్కారం గలిగినవారైనట్టు మాట్లాడుతుంటే, ఆమెకి తలని గోడకు మోదుకుని విలపించాలనిపించింది. కానీ ఆదినుంచీ ఆమెని వదలని మనస్సంయమనం అప్పుడుకూడా ఆమెకు బాసటై నిలిచింది. కన్నీళ్లుతుడుచుకోకుండానే ఆమె మెట్లుదిగి తన గదిలోకి వెళ్లిపోయింది.

ఆ రోజురాత్రి పడుకోకముందు అన్నాచెల్లెళ్లిద్దరూ కలుసుకోడం తటస్థించింది.

భోజనమైనతర్వాత తాంబూలం నములుతూ నాగరాజు చెల్లెలిగదివరకూ వచ్చి "ఏం కల్యాణీ! ఒంట్లో కులాసాగావుంది కదా! ఇది మలేరియా ప్రాంతం"అన్నాడు.

★ చీమలు పెట్టిన పుట్టలు ★

"జబ్బేమీ లేదన్నయ్యా! వచ్చి ఏడెనిమిది రోజులు కావస్తోంది ఆయన అటు స్కూలుతోనూ, యిటు వంటతోనూ సతమతమై పోతుంటారు. అదీగాక కుర్రాళ్లు ఆయన్ని వదిలిపెట్టి వుండలేరు ఊరికి వెళ్ళాలని వదినతో చెప్పాను. నువ్వు వచ్చేవరకూ ఆగమంది."

"రాక రాక వచ్చావు. అప్పుడే వెళ్లిపోవాలంటే ఎలా కల్యాణీ!" అన్నాడు నాగరాజు.

"మళ్లీ ఎప్పుడైనా రాకపోతానా అన్నయ్యా!"

"సరే నీయిష్టం. నన్నొకసారి రమ్మని బావ రెండుమూడుసార్లు జాబు వ్రాశాడు. తీరిక లేక రాలేకపోయానని చెప్పు కల్యాణీ! అన్నట్లు యిప్పుడు మీరున్నది ముందున్న ఊళ్లో కాదటగా! ఇంకేదో వూరికి ట్రాన్స్ఫరు అయినట్టు జాబు వ్రాశాడులే ఒకసారి."

"ట్రాన్స్ఫరు కాదన్నయ్యా! అక్కడ ఊస్టు చేసేశారు. ప్రక్కనే కృష్ణాపురంలో ఈయన స్వంతంగా ఓ స్కూలు ప్రారంభించారు. ఇన్నిరోజులూ ఓ అద్దె కొంపలో స్కూలు నడిపించారు. కట్టడం కట్టి చూపిస్తే గానీ రికగ్నిషన్ ఖాయం గాదట! అయిదు వందలరూపాయలంటే ఒకమాదిరి పూరి కొంపైనా వేసుకోవచ్చు ఆ కొత్తచోట అప్పు పుట్టదు, మీ అన్నయ్యని అడిగి చూడు అన్నారాయన. అప్పుగా యిచ్చినా సరే, రెండు మూడేండ్లలో తీర్చేయవచ్చునన్నారు."

నాగరాజు యీమాటవిని నవ్వయినా వుండవలసింది. లేక జాలైనా పడివుండవలసింది. కానీ అతడు నవ్వనూలేదు. జాలి పడ్డట్టు కనీసం అభినయించనుకూడా లేదు ముక్తసరిగా "అంతగా అవసరమైతే ఒక జాబు వ్రాయమను కల్యాణీ! సర్దుబాటుచేసి పంపిస్తాను" అని వాళ్లోనుంచే నాగుల్ని కేకవేసి "తెల్లవారు ఝామున కల్యాణి ఊరికి వెళ్తుంది ఆమెని స్టేషనులోవదిలి పెట్టిరా" అంటూ మేడమెట్లవైపు వెళ్ళిపోయాడు.

5

మధ్యాహ్నం ఫస్టు బెల్ మ్రోగినతర్వాత రాధాపతి అటెండెన్సు వేసి కుర్రాళ్లకేదో పాఠంచెప్పడానికి ఉపక్రమించబోతుండగా ఎవరోవచ్చి కల్యాణిపూరినుంచితిరిగి వచ్చినదన్న వార్తని అతడిచెవిలో వేశారు ఒక కుర్రవాడిచేత తాళం చెవిని ఇంటికి పంపించి తెరచివున్న పాఠ్యపుస్తకాన్ని టేబిల్ పైన బోరగిలబెట్టి కుర్చీలో వెరగిలబడి రాధాపతి ఆలోచనలో మునిగిపోయాడు కల్యాణి యింత త్వరగా తిరిగి రాగలదని తను అనుకోలేదు ఒకవేళ ఆమె తనవారి ఆత్మాధిక్యత ముందు కుంచించుకు పోయిందేమో! అందుచేత అక్కడుండడానికి సరిపడక పారిపోయివచ్చేసిందేమో! ఐతే ఇంతకీ వోయిన పని ఏంచేసుకుని వచ్చిందోమరి!

పంతులుగారు ఏదో ముఖ్యమైన విషయాన్ని గురించి ఆలోచిస్తున్నారుగదా అని ఊరుకునే యింగితజ్ఞాతం సర్వసాధారణంగా కుర్రాళ్లలో కనపడదు అవకాశం దొరకడమే తరువాయి వాళ్ల అల్లరి ప్రతిమించి రాగాన బడడానికి ఎంతో సేపు పట్టదు. రాధాపతి తుళ్లిపడిలేచి నిటారుగా కూచుంటూ 'సైలెన్స్, సైలెన్స్' అని పుస్తకాన్ని చేతికి తీసుకున్నాడు.

తిరువాత గంట నాలుగున్నరైందన్న బెల్ మ్రోగేంతవరకూ రాధాపతి తాత్కాలికంగా కల్యాణిని గురించి, తన సంసారాన్ని గురించి తనింక కట్టవలసిన కట్టడాన్ని గురించి మరచిపోయి కుర్రాళ్లలోకంలో కలసిపోయాడు

బెల్ మ్రోగింది. కుర్రాళ్లందరూ వెళ్లిపోయారు. రాధాపతి రికార్డుల్ని డ్రాయరులోవుంచి చరచరా బయటికివచ్చి తలుపులుమూసి బీగం వేశాడు. ఇంటిదగ్గర పాలు కూడా లేవు, కల్యాణి కాఫీఅయినా కాచి పిల్లలకిచ్చివుండదేమో ననుకుంటూ గబగబ అడుగులువేస్తూ యింటివైపు నడవసాగేడు అతడు పదిబారలదూరం వెళ్లివుంటాడంతే, ఒకకుర్రాడు వెనుకనుంచే వచ్చి "సార్? ఎవరో స్కూలెక్కడ? అని అడుగుతూ జట్కాలో వస్తున్నారు" అన్నాడు

రాధాపతి కంగారుపడ్డాడు. ఆరోజు తన గడియారం నాలుగున్నరయ్యే సరికే అతను స్కూలు మూసేశాడు. న్యాయంగా ఆలోచిస్తే ఇంకొక పదినిమిషాలపాటు స్కూలు వుంచుకోవలసింది ఎవరెవరి గడియారాలు ఎట్లానడుస్తాయో చెప్పలేంకదా మరి! ఆ ఆగంతుకుడు తప్పకుండా ఇన్స్పెక్టరే అయి ఉంటా డనుకుని రాధాపతి గబగబా వెళ్ళి స్కూలు తలుపులు తెరిచాడు.

కాని తీరా జట్కా స్కూలుముందరికి వచ్చి ఆగినతర్వాత అందులోనుంచీ దిగిన వ్యక్తిని చూచి రాధాపతి తెల్లబోయాడు. ఆగంతుకుడు ఇన్స్పెక్టరు కాడు. నాగరాజు!

"అరేమిటి నాగరాజా! మీ చెల్లెలు మధ్యాహ్నమనగా వచ్చింది. నువ్విప్పుడొస్తున్నావు. ఇద్దరూ కలిసి రాకూడదూ!" అంటూ రాధాపతి జట్కాలో బెడ్డింగు వగైరాలున్నాయేమోనని దగ్గరికి వెళ్లాడు. జట్కా శూన్యంగా ఉంది. అంతలో నాగరాజు జట్కావాడికి అద్దె డబ్బు ముట్టజెప్పి స్కూల్లోకి వెళ్ళిపోయాడు

రాధాపతి నాగరాజు వెనుకనుంచే లోపలికి వస్తూ "ఏమిటది నాగరాజా! వచ్చినవాడివి ఇక్కడే కూచుంటున్నావు! నీరాక కల్యాణికి తెలుసుకదా! ఆవిడ వచ్చినతర్వాత నేనుకూడా ఇంకా ఇంటికి వెళ్ళనేలేదు" అన్నాడు

"వడ్డువుగారి కూచో బావా! కొంచెం మాట్లాడాలి" అన్నాడు నాగరాజు.

"ఆ మాట్లాడేదేదో ఇంటికి వెళ్లినతర్వాత తీరిగ్గా మాట్లాడుకోకూడదా నాగరాజా!" అన్నాడు రాధాపతి

"కాదు బావా! ఇక్కడే మాట్లాడ్డం మంచిది. నేను చెప్పబోయే విషయం నీ మనసుకు బాధాకరమైందే కావచ్చు కానీ చెప్పకతప్పదు రాత్రి నాయింట్లో చోరీ జరిగింది చాలా విచిత్రమైన చోరీ. ఇనప్పెట్టె తాళాలు ఎక్కడుండాలో అక్కడే ఉన్నాయి పెట్టమూసింది మూసినట్టే ఉంది లోపలున్న నగలు, వెండి సామానులు కూడా అలాగవున్నాయి మళ్లీ అందులో అదృష్టమేమిటంటే డబ్బు పూరాగా కూడా దోచుకోబడలేదు. అందులో ఇప్పుడులేంది ఐదు వేల రూపాయలు మాత్రమే! ఐదువేలంటే అంత తక్కువ మొత్తం కాదు. ఇంట్లో నౌకర్లయినా పడుకోరు వాళ్ళకోసం ఇంటికి బయట వేరే గుడిసెలున్నాయి మరి బయటివాళ్ళవరో వచ్చి ఈపని చేసివుంటారనుకోడానికి ఆధారమే కనిపించడంలేదు. ఇది ఇంటివాళ్ళ పనైవుంటే పెట్టె సీదాగా ఖాళీ అయిపోయి వుండేది"

నాగరాజు మాటలకు అడ్డొచ్చి రాధాపతి

(47-వ పేజీ చూడండి)

(సీరియల్)

హోమాగ్ని

జి. సి. రామకృష్ణ

12

మాధవశాస్త్రిగారు అబద్ధపు సాక్ష్యం చెప్పడానికి నిరాకరించారు. ఆయన గుమాస్తా ఉద్యోగం ఊడిపోయింది. శ్రీరామ సంకీర్తనంలో సర్వస్వాన్నీ మరచిపోయిన త్యాగరాజువలె మాధవశాస్త్రి సర్వకాల సర్వావస్థల్లో కుసుమహరనాధ సంకీర్తనంలో నిమగ్నుడయి, అన్ని ఆలోచనలు, దిగుళ్లు, విస్మరించాడు. మెడలో, ఒక రూపాయ వెడల్పు కుసుమహరనాధుని చిత్రం తగిలించుకున్నాడు. చొక్కా వేసుకోవటం మానేశాడు.

సుబ్బారావు పంతులుగారు మాధవశాస్త్రిగారి వైరాగ్యాన్ని చూచి నవ్వుతూండేవాడు. సుబ్బారావుగారు దేవుడు, దైవం అనే మాటలు మరిచేపోయాడు. "ఏ మానవుని హృదయంలో దయాదాక్షిణ్యాలూ ప్రేమానురాగాలూ ఉంటాయో, వాడే దేవుడు" అని తన జీవితానుభవం ద్వారా తెలుసుకొన్న మనిషి. అందువల్ల ఆయన స్థిరచిత్తంతో జీవితం వెళ్ళబుచ్చుతూండేవాడు.

దేవుడున్నాడా లేడా అనే సందేహంతో, సతమత మవుతున్న రోజుల్లో, మాధవశాస్త్రిగారు నిరాశతో, నిస్పృహతో అసంతృప్తితో నలిగిపోతుండేవాడు. కాని కుసుమహరనాధుని సేవించడం ప్రారంభించిన తర్వాత అతని అసంతృప్తి అంతరించింది. అతని సందేహాలు పటాపంచలయినాయి. ఏదో విపరీతమైన ఆనందాతిరేకంతో, స్వేచ్ఛాజీవివలె మారిపోయాడు మాధవయ్య. ఆయన ధైర్యంచూచి అందరూ ఆశ్చర్యపడ్డారు. సావిత్రమ్మ సంతోషానికి పరిహద్దులే లేవు. మాధవయ్య ఉద్యోగం పోయినతర్వాత మహాభక్తుడవడంతో ఆయనకు గౌరవం క్రమంగా పెరిగింది.

శివరాత్రినాడు జరిగిన కొట్లాట కేసు వాయిదాలు పడుతూనే ఉంది "కొన్ని వందలమైళ్ళ దూరంలో, ఎక్కడో మారుమూల గ్రామంలో, ఒక అర్ధరాత్రి సమయంలో జరిగిన నేరాలను, కొంతమంది జడ్జీలు, ఒక మహానగరంలో కూర్చొని, సాక్షుల సహాయంతో విచారించి, వకీళ్ల వాదాలు విని, తీర్పు చెప్పడం" అనేది మానవులమధ్య ప్రేమవిశ్వాసాలే సకల సమస్యలకూ పరిష్కార మార్గమని నమ్మే మాధవశాస్త్రికి హాస్యాస్పదంగా కనిపించింది. ఆ చెప్పబోయే తీర్పులో ఎంత న్యాయముంటుందో నని మాధవశాస్త్రి చిరునవ్వు నవ్వుకున్నాడు.

ఆ కేసు తీర్పు చెప్పకముందే గ్రామంలో పంచాయతీబోర్డు ఎలెక్షన్లు జరుగుతాయని ప్రకటించబడింది.

దేవాలయ ధర్మకర్తగారైన రామిరెడ్డిగారు రామసుబ్బారెడ్డిగారినే బలపరిచాడు కాని గ్రామమున్సబుగారైన వెంకటరెడ్డిగారు తన తమ్ముడైన సుబ్బారెడ్డిగార్ని నిలబెట్టారు. గ్రామంలో పరిస్థితులు మళ్లీ భయంకరస్వరూపం దాల్చాయి రెండు పార్టీలవాళ్లూ తీవ్రంగా ప్రచారం ప్రారంభించారు. గ్రామం మళ్లీ రెండు శత్రు శిబిరాలుగా తయారయింది. ఆరిపోయిన అగ్ని మళ్లీ ఎలెక్షన్ గాలిసోకడంవల్ల రగుల్కొంది.

ఒకరోజు బడిపంతులు సుబ్బారావు మాధవశాస్త్రిగారూ చెరువుకట్టమీద కూచొని ఏదో ఆలోచించారు. సుబ్బారావుగారి సలహా మాధవశాస్త్రిగారికి చాలా బాగా నచ్చింది.

ఆ రోజు రాత్రి ఒక కుసుమహరనాధభక్తుడు ఒక రామభక్తుణ్ణి కలుసుకోవడానికోసం, నెత్తిన ముసుగు వేసుకొని చీకట్లో నడిచిపోతున్నాడు. ఆ కుసుమహరనాధభక్తుడు మెల్లగా హరిజనవాడలో ఒక కుటీరంముందు నిల్చొని "గెరటయ్యా" అని నెమ్మదిగా పిల్చాడు. రామభక్తుడు విస్మితుడై మాధవశాస్త్రినిచూచి, "స్వాములా మాధవయ్య స్వాములూ" అని ఆనంద భరితుడై, చెమ్మగిలిన కళ్లు తుడుచుకొని, ఆనందాతిరేకంతో ఏమి చెయ్యడానికీ తోచక కొంచెంసేపు అటూయిటూచూచి, "కూచోండి స్వాములూ" అని చిరునవ్వు నవ్వేడు. మాధవశాస్త్రి ఆ కుటీరంలో నాలుగువైపులా చూచాడు. ఒకవైపు సీతారామస్వామిపటం, ఇంకొకవైపు గాంధీజీ పటం రెండుపటాలకు వాడిపోయిన బంతి పూలమాలలు వేసిఉన్నాయి.

మాధవయ్య సంతృప్తిచెంది కూర్చొని "గెరటయ్యా! నీతో ఒకముఖ్యమైనవిషయం మాట్లాడాలి కూచో" అన్నాడు

గెరటయ్య తడికెలతలుపు వేసి, వినయంతో కూచొని ఆసక్తితో మాధవయ్యవైపు చూచాడు.

"ఏమీ లేదు గెరటయ్యా, నువ్వు పంచాయతీబోర్డుకు అధ్యక్షుడుగా నిలబడాలి" అన్నాడు, మాధవయ్య.

గెరటయ్య ఆ క్షణంలో అనుభవించినంత ఆనందం ఎన్నడూ అనుభవించలేదు. గెరటయ్య వీధిభాగవతంలో ధర్మరాజు వేషం వేసినప్పుడు అంత ఆనందం అనుభవించి ఉంటాడేమో!

గెరటయ్య తత్తరపడి - "స్వామీ, నేను మాలోణ్ణి, ఒక్క సెంటుపొలమైనా లేనోణ్ణి. ఏదైనా కష్టంచేసుకుంటే గంజినీళ్లు తాగాల్సిందే. పెద్దపెద్దరెడ్లతో నేను పోటీకి సరిపోతానా?" అని ఆశ్చర్యంగా అన్నాడు.

"నీకెందుకు గెరటయ్యా! నువ్వుగెల్చినా గెలవకపోయినా, నేను చెప్పాను కాబట్టి నా మాటతో సెయ్యొద్దు నీవు నిలబడితే, మీ మాలవాళ్ళందరూ నీకు ఓటీస్తారా ఇవ్వరా?" అన్నాడు మాధవశాస్త్రి.

గెరటయ్య ఒక క్షణం ఆలోచించి, "ఓ

తప్పకుండా! నేను నిలబడితే మా మాలోళ్లు నాకు ఓటెయ్యకుండా ఇంకోరికి వేస్తారా స్వామీ! నేను అటు రామిరెడ్డిగారిపక్షమూ కాదు. ఇటు వెంకటరెడ్డిగారి పక్షమూ కాదు" అని గరటయ్య ఆత్మవిశ్వాసంతో అన్నాడు. మాధవశాస్త్రి సంతోషించి, "నువ్వు గెల్చినా గెలవకపోయినా, మీ మాలవాళ్ళలో ఐకమత్యం అయినా కలుగుతుంది" అని, కుటీరంలోనుండి వెలుపలికొచ్చి, "శెల్వు మళ్ళీ వస్తానే గరటయ్యా" అంటూ తలమీద ముసుగు వేసుకొని, అంధకారంలో ధైర్యంగా నడిచాడు. మిణుకు మిణుకుమంటూ నక్షత్రాలు అయనకు దారి చూపించాయి.

గరటయ్య వేకువజామునే లేచి రామనామ సంకీర్తన చేస్తుంటే అందరూ మేల్కొని పనిపాటలకు వెళ్తుండేవారు.

గరటయ్య పంచాయతీబోర్డు ప్రెసిడెంటుగా నిలబడానికి నిశ్చయించుకొని, హరిజనవాడలో ప్రచారం ప్రారంభించాడు. అయన ప్రచారం హరిజనుల్ని మేల్కొల్పింది. హరిజనులు క్రమంగా ఐకమత్యంతో బలపడ్డారు.

హరిజనులు బలపడ్డారని రామిరెడ్డిగారూ వెంకటరెడ్డిగారూ గమనించారు. మాలవాడు గరటయ్య పంచాయతీబోర్డుప్రెసిడెంటుగా నిలుస్తాడనేసరికి వాళ్ళకు ఎక్కడలేని ఆశ్చర్యం కల్గింది. ఆ స్థితిలేనివాడు ప్రెసిడెంటుగా నిలవడానికి వీలులేదన్నారు. ఆ సంగతి గరటయ్య వచ్చి మాధవశాస్త్రితో మనవి చేసుకున్నాడు. మాధవశాస్త్రి మంచి సలహా చెప్పిపంపించాడు. ఒక ఎకరా, రెండెకరాలు ఆస్తులున్న హరిజనులు నలుగురు గరటయ్యకు జామీనుంటామని పత్రాలు రాసిచ్చారు.

గ్రామంలోని కూలినాలి జనమంతా గరటయ్యకే ఓటెయ్యాలని అనుకుంటున్నారు.

శివరాత్రినాడు జరిగిన, కొట్లాటకేసులో ఇంకా తీర్పు చెప్పబడనేలేదు.

రామిరెడ్డిగారూ వెంకటరెడ్డిగారూ తమ పాతవిరోధాలన్నీ మరిచి పోయేటట్లు రాజీ చేసుకొని, రామసుబ్బారెడ్డిగార్ని ఇద్దరూ బలపరిచి, వెంకటరెడ్డిగారి తమ్ముడైన సుబ్బారెడ్డిగార్ని విరమించుకొనేట్లు చేశారు. గ్రామంలో పరిస్థితులు తారుమారయినాయి. వెంకటరెడ్డిగారూ రామిరెడ్డిగారూ రాజీ పడతారని ఎవ్వరూ ఊహించనేలేదు. కానీ ఒక హరిజనుణ్ణి ఎదుర్కొనేందుకోసం వారు శత్రుత్వాల్ని మరిచి పోయి ఒకటైపోయారు. ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగారైన కామేశ్వరరావుగారు అహోరాత్రాలు కృషిచేసి రామిరెడ్డిగారికీ వెంకటరెడ్డిగారికీ మధ్య రాజీ కుదిర్చారు. మేధావంతుడైన కామేశ్వరరావు పంతులుగారు గరటయ్యను మాధవశాస్త్రిగారు బలపరుస్తున్నాడని పసిగట్టాడు. ఆ విషయం రామిరెడ్డిగారికీ వెంకటరెడ్డిగారికీ చెవులో వూదేడు. ఇద్దరికీ మాధవశాస్త్రిగారిపై ఆగ్రహం ఎక్కువయింది.

13

ఆరోజు ఎలెక్షనుజరిగేరోజు. ఎన్నికలు రహస్య వోటింగ్ పద్ధతిలో జరుగలేదు. ఆ ఎన్నికలకోసమని ఓటర్లనందర్నీ ఒకచోట చేర్చారు. అక్కడ ఒకవైపు భరింపరాని కంపు- జోరీగలు జొయ్‌మని కాళ్ళకు చుట్టుకుంటున్నాయి. ఏవో చిన్న చిన్న పురుగులు ఓటర్ల కాళ్ళను తగుల్కొని రక్తం పీలుస్తున్నాయి. స్త్రీలు, పురుషులు ఎఱ్ఱటి ఎండలో ఆదొడ్డిలో కూచున్నారు.

రామిరెడ్డిగారూ వెంకటరెడ్డిగారూ పక్కపక్కన్నే నిల్చొని గంభీరంగా చూస్తున్నారు. రామభక్తుడు గరటయ్య రామనామసంకీర్తనంచేస్తూ నిల్చున్నాడు.

ఓటింగ్ రహస్యంగా జరుగుతుందేమో గుట్టుగా గరటయ్యపెట్లో ఓటు వెయ్య వచ్చుననుకున్నారు హరిజనులు. కానీ బహిరంగంగా ఎన్నికలు జరిగేసరికి హరిజనులకు ధైర్యం చాల్లేదు.

పొద్దున నిద్రలేచిందిమొదలు ఖామందుల పొలాల్లో కష్టం చేయాలి. వాళ్ళ దయాదాక్షిణ్యాలపైనే హరిజనులజీవితాలు ఆధారపడి ఉంటాయి ... అందువల్ల హరిజనులు కూడా గరటయ్యకు పూర్తిగా ఓట్లు యివ్వలేదు. గరటయ్యపైన భక్తివిశ్వాసాలున్న కొంతమందిమాత్రం చేతులెత్తారు.

రామభక్తుడు గరటయ్య ఎలెక్షనులో ఓడిపోయాడు. ఆ గ్రామంలో పంచాయతీబోర్డు అనే సంస్థ పెట్టబడినప్పటి నుండి అధ్యక్షుడుగా ఉంటూ, ఆ పంచాయతీబోర్డు దయవల్ల పదెకరాలు సంపాదించుకొన్న రామసుబ్బారెడ్డిగారే తిరిగి అధ్యక్షులుగా ఎన్నుకొనబడ్డారు.

తమ ఆలోచన విఫలమయినందుకు మాధవశాస్త్రిగారు కృష్ణారావుపంతులుగారు నిరాశతో కృంగిపోయారు.

కొన్ని నెలలు భారంగా గడిచిపోయాయి. శివరాత్రినాడు జరిగిన కొట్లాటకేసు తీర్పు చెప్పబడింది. మేధావంతులైన న్యాయవాదుల కృషి ఫలితంగా, నలుగురు హరిజనులకు ఆరేసి సంవత్సరాలు కఠినశిక్షలు విధించబడ్డాయి.—

ఒకరోజు దేవాలయ ధర్మకర్తగారైన రామిరెడ్డిగారు మద్రాసు వెళ్ళారు. రామిరెడ్డిగారికి మద్రాసులో పెద్ద భవనాలున్నాయి. ఎప్పుడైనా మద్రాసు వెళ్ళినపుడు ఒక భవనంలో తను బసచేసేవాడు. మిగిలినవి బాడుగలకిచ్చి ఉండేవి. ఆ బాడుగలు దండుకొని రావాలనే సాకుతో రెడ్డిగారు మద్రాసు వెళ్లి ఎన్ని రోజులైనా తిరిగి రాలేదు.

రామిరెడ్డిగారికుండే వ్యసనాలు సావిత్రమ్మగారికి బాగా తెలుసు. ఆమె ఆందోళనపడి ఏమీ తోచక మాధవశాస్త్రి గార్ని పిలిపించి, "మాధవయ్యా, జరిగిందేదో జరిగిపోయింది. నేను రెడ్డితో ఎట్లనో ఒకట్ల చెప్పి నీ నౌకరి నీకిప్పిస్తాను. నువ్వు మద్రాసుపోయి ఆయనెట్లున్నాడో చూచిరా స్వామి" అని బ్రతిమాలుకుంది...

మాధవయ్య పకపక నవ్వి "ఎంత అమాయకురాలివమ్మా! ఆయ నేమైనా పసివాడా? నన్ను చూస్తే మండిపడతాడమ్మా నేను పోనుతల్లీ" అని వేడుకున్నాడు. "సరే" అని సావిత్రమ్మ మనసు దిటవు చేసుకొని, "అయితే మాధవయ్యా, పాపం మీ రెట్ట చేస్తున్నారు. నువ్వు నౌకరి ముగించుకొంటివి." అని జాలిగా చూచింది.

మాధవశాస్త్రి మహాభక్తుని వలె పైకి చూచి, "అంతా ఆ కుసుమహరనాథుని దయ తల్లీ" అన్నాడు. సావిత్రమ్మ పకపక నవ్వి, "మాధవయ్యా! మీ కొత్త దేవుణ్ణి నే నెప్పుడూ చూళ్ళేదు. ఆ దేవుని పటం ఒక్కసారి మా యింటికి పంపిస్తావా?" అన్నది.

"అలాగే నమ్మా" అని మాధవశాస్త్రి వెళ్ళి కుసుమహరనాథుని పటం తీసుకొచ్చి సావిత్రమ్మకు చూపించాడు. అభయహస్తంతో నిల్చున్న హరనాథుని చూచి సావిత్రమ్మ అప్రయత్నంగా కళ్ళుమూసుకొని కళ్ళద్దుకొని మనసులోనే నమస్కరించింది. మాధవశాస్త్రి ఆ పటం తనచేతికి తీసుకొని చిరునవ్వు నవ్వుతూ, వాకిటికి వచ్చి "వస్తానమ్మా" అన్నాడు.

"ఉండు మాధవయ్యా పోదుగానీ" అని సావిత్రమ్మ ఇంట్లోకివెళ్లి, ఒక గెల అరటిపండ్లు తీసుకొచ్చి మాధవయ్య కిచ్చింది.

మాధవశాస్త్రి ఒక చేతిలో, అరటిపండ్ల గెల, యింకొక చేతిలో కుసుమహరనాథుని పటం పట్టుకొని, ముసి ముసి నవ్వులు నవ్వుతూ, సావిత్రమ్మగారిదగ్గర సెలవు తీసుకొని, గడపలు దిగి, మెల్లగా వీధివైపు చూచాడు. రచ్చ టరుగుమీద ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగారైన కామేశ్వరరావు పంతులుగారు కూచొని ఉన్నారు. మాధవయ్య గుండె ఎందుకో జల్లుమంది.

కామేశ్వరరావు వ్యంగ్యంగా నవ్వుతూ "ఏం మాధవయ్యా, ఎక్కడనుండి రావటం ?" అని తెలియనట్లుగా అడిగాడు.

"తమరు చూస్తున్నారుగా!" అన్నాడు మాధవశాస్త్రి కామేశ్వరరావు గారు వికారంగా గొల్లున నవ్వేడు.

మాధవశాస్త్రి నేరుగా యింటికెళ్లి పండ్లు పటము భార్యచేతికిచ్చాడు.

“అమ్మగారికింకా అయ్యగారి మీద కోపం కోపం తగ్గలేదు. అరటిపండ్లు ... అలాగే పోతున్నారుట”. అని విమలమ్మ వంగా చూచుకుంటూ లోపలికెళ్లింది.



ఒకనాడు ధర్మకర్తగారైన రామిరెడ్డిగారు మద్రాసులో ఒక సినిమాతారగారింట్లో విందారగించి, వనకుచేరి సోఫాలో విశ్రాంతిగా పడుకున్నారు. కింద ఒక జాబు కన్పించింది. తలాలున ఆ జాబు చేతికి తీసుకొని త్వరగా విప్పి చదివాడు.

“ప్రియమిత్రులు రామిరెడ్డిగారికి,

మహాశయా! తమరు అమాయకులు. మీ వంటి తెల్లనివన్నీ పాలు, నల్లనివన్నీ నీళ్లు అనుకొనే తత్వం మీది. మీరు ఇంటిసంగతే మరిచిపోయి మద్రాసులో లక్షణంగా కాలం గడుపుతున్నారు. మీ అర్ధాంగి అక్కడ లక్షణంగా, - హాయిగా ... ఒక కుసుమహారసాధభక్తునితో కాలక్షేపం చేస్తూ ఉంది. ఎంత అమాయకులండీ మీరు!

ఇట్లు,

మీ శ్రేయోభిలాషి.

దీర్ఘాలు లేని ఆ జాబు చూచుకొని రామిరెడ్డిగారి హృదయం భగ్గున అగ్నిజ్వాల లాగా మండింది. వెంటనే డ్రైవరునుపిల్చి కారు ఊరికి కదిలించమన్నాడు.

కారు నూరుమైళ్ల వేగంతో పోతూ ఉంది. రామిరెడ్డిగారి ఆలోచనలు వెయ్యిమైళ్ళ వేగంతో గిర్రున తిరుగుతున్నాయి. తెల్లవారుఝామున నాలుగుగంటలకు ఊరికి చేరాడు.

సావిత్రమ్మ అప్పుడే లేచి బావి దగ్గర చన్నీళ్ళ స్నానం చేసి, “అఖిలాండేశ్వరి కుసుమాంబా, నా కథయు మొసంగవె జగదంబా” అని పాడుతూ, కుసుమహారసాధుని పటానికి నమస్కారం చేస్తూ ఉంది. కారుశబ్దం విన్పించగానే వాకిటికి వచ్చింది. రామిరెడ్డిగార్ని చూచి ఆశ్చర్యంతో, ఆనందంతో తలడిల్లిపోతూ ఎదురుగుండా వచ్చి కిలకిలా నవ్వింది. రామిరెడ్డిగారు తక్షణం భార్యను జుట్టు పట్టుకొని పడక గదిలోకి ఈడ్చుకొనిపోయి ఛెళ్లున ఒక్క చెంపదెబ్బ కొట్టేడు.

సావిత్రమ్మ గొల్లున ఏడుస్తూ పడకమీద పడి తను చేసిన నేరమేమిటో తెలియక గిజగిజలాడుతూ ఏడ్చింది.

రామిరెడ్డిగారు పరుగెత్తుతూ వెళ్లి కుసుమహారసాధుని పటాన్ని తీసుకొనిపోయి బావిలో పడేశాడు.

సావిత్రమ్మ పడకగదిలోనుండి వచ్చి హారసాధుని పటం ఉన్నచోటు ఖాళీగా ఉండడం చూచి, పొంగివస్తున్న దుఃఖం ఆపుకుంటూ, “పటం ఎక్కడ పారేశారు?” అని దీనంగా అడిగింది.

జవాబు చెప్పకుండా ఛెళ్లున ఇంకొక

కొంతదెబ్బ తీశాడు రామిరెడ్డిగారు. చిరునవ్వులు చిందులాడుతూ లక్ష్మీదేవిలా ఉండే ఆమె వదనం ఒక కర్కశహృదయుని చేతి వ్రేళ్ళ వాతలతో వికారమయిపోయింది.

దాసదాసీజనం ఒక్కొక్కరే నిద్ర లేస్తున్నారు. ఏమీ జరగనట్లు సావిత్రమ్మ పడకగదిలోకి వెళ్ళి తలుపు వేసుకొంది.

రామిరెడ్డిగారు పడకకుర్చీలోనే కూర్చొని ఆవేశంతో ఏదో గాఢంగా ఆలోచిస్తూ కూడున్నారు.

సూర్యోదయం కాగానే సావిత్రమ్మ కన్నీరు తుడుచుకొని మిద్దె దిగివచ్చింది.

“నీకా పటం ఎవరిచ్చారు?” అని గద్దించాడు రామిరెడ్డిగారు.

“మాధవశాస్త్రిగారిచేత నెల్లూరు నుంచి తెప్పించుకున్నాను” అని అమాయకంగా జవాబు చెప్పింది సావిత్రమ్మ.

రామిరెడ్డిగారు పళ్ళు పటపటకొరికి, క్రూరంగా ఆమెవైపు చూశాడు. ఆ చూపులు, ఆ చేష్టలు, ఆమె కేమీ అర్థం కాలేదు. కుసుమహరనాథుని ధ్యానించుకుంటూ లోపలికి వెళ్లింది.

ఆ రోజు రాత్రి మాధవశాస్త్రిగారు గరటయ్యతో మాట్లాడి వస్తామనుకొని, భోజనం చేసి వెళ్ళారు. రాత్రి పదకొండు గంటల వరకు ఆ రామభక్తునితో ఈ కుసుమహరనాథ భక్తుడు లోకాభిరామాయణం మాట్లాడి తిరిగి వస్తున్నాడు.

హరిజనవాడకూ గ్రామానికీ మధ్య షుమారు ఒకమైలు దూరం ఉంటుంది. మార్గమధ్యంలోకి వచ్చేసరికి ఎవరో నోరు నొక్కారు. “ప్రభూ! కుసుమహరా!” అని మాధవశాస్త్రి మనసులోనే ప్రార్థించుకున్నాడు. ఎవరో నోరు నొక్కుతూ ఇంకొకరు కత్తితో పొడుస్తూ ఉంటే, ఏ ప్రభువూ అడ్డురాలేదు.

15

రక్తంతో తడిసిన ఒక కుసుమహరనాథ భక్తుని శవం గ్రామచావడివద్ద బండిపై ఉంచారు. ఆ శవానికి ఎదురుగా ఒక బడి పంతులు పసిబిడ్డలాగా ఏడుస్తున్నాడు. అతనిపిల్లలు శవాన్ని చూస్తూ కన్నీరు కారుస్తున్నారు.

ఒక పతివ్రత ఆ బండి చక్రాలకు తల ఆనించుకొని గుండెలు బ్రద్దలయ్యేట్లు దిక్కులు మారుమ్రోగేట్లు విలపిస్తూ ఉంది. “ప్రభూ - నన్నింత అన్యాయం చేశావా? ప్రభూ...” అని విమలమ్మ దీనంగా ఏడుస్తుంటే, ... ఆ ప్రార్థన కుసుమహరనాథ ప్రభువుకు వినిపించిందో, లేదో! పోలీసులు బండిని కదిలించి తీసుకొని పోయారు. విమలమ్మ వీథిలోపడి పొర్లాడుతూ బావురుమని విలపించింది. గాలి రివ్వునవీచి ఆమెకు సానుభూతిగా ఏడ్చింది. కొంతమంది స్త్రీలు కట్టలు తెగిన కన్నీటిధారలను తుడుచుకుంటూవచ్చి విమలమ్మను ఓదారుస్తూ ఇంటికితీసుకొని వెళ్లారు.

“మాధవయ్యా! స్వామీ” అంటూ రామభక్తుడు గరటయ్య మాధవశాస్త్రిని తీసుకొనిపోతున్న బండివెంబడి పిచ్చివాడిలాగా పడి ఎట్టటి ఎండలో పరుగెత్తి ఇక నడువలేక “రామా, రామా...” అని రామనామం చేసుకుంటూ, కన్నీరు తుడుచుకుంటూ పిచ్చివానిలాగా నిల్చున్నాడు.

సావిత్రమ్మ మిద్దె ఎక్కి మాధవశాస్త్రిని తీసుకొనిపోతున్న బండిని చూపులందినంత వరకు చూచి, కన్నీళ్లు తుడుచుకుంది. బండితో కూడా పోలీసులు కీలుబొమ్మల్లాగా తుపాకులు పట్టుకొని నడిచిపోతున్నారు.

రామభక్తుడు గరటయ్య ఆ రాత్రి నిద్రపోనే లేదు. రామనామం జపిస్తూ పిచ్చివానిలాగా తిరిగాడు. సూర్యోదయం కాకముందే, “రామా, రామా” అంటూ చెరువు కట్టమీది కొచ్చాడు. నీళ్ళలో నల్లగా ఏమిటో కనిపించింది గాభరాపడుతూ గరటయ్య మెల్లగా నీళ్ళలో దిగి చూచాడు. నీళ్ళపైన దట్టమైన కేశరాశి తేలుతూ నీళ్ళతో జాలిగా ఆడుకుంటున్నాయి. చీర కొంగు దీనంగా నీటితో ఏమిటో మొర పెట్టుకుంటూ ఉంది. సాష్టాంగపడి దైవానికి నమస్కారం చేస్తున్న మహాభక్తురాలిలాగా నీటిమీద తేలుతున్న ఆ పవిత్రశవాన్ని గరటయ్య వెలుపలికి మోసుకొచ్చి, భూమిమీద పెట్టాడు. విమలమ్మ ముఖం చూచి “రామా, రామా...” అని తల్లికోసం పసిబిడ్డలాగా ఏడ్చాడు.

సీత, సావిత్రి, చంద్రమతివంటి పతివ్రతలుజన్మించిన భారతదేశంలో ఒక మహాపతివ్రత పాదాలకు ఒక రామభక్తుని కన్నీటిధార పూజచేసింది. ★

[సమాప్తం]

నాటిక:

"వసుదేవుడే గాడిదకాళ్ళుపట్టుకున్నాట్ట"

వల్లూరి కృష్ణారావు

పాత్రలు:

తంబి—ఉద్యోగార్థుడు.

పరంధామయ్య—తంబి మేనమామ.

శంకరం—తంబికి పిల్లనిచ్చినమామగారు.

పద్మనాభం—తంబి తండ్రి.

శారద—తంబి భార్య.

పరంధామయ్య: వసుదేవుడే గాడిద కాళ్ళు పట్టుకున్నాట్టరా నీకేంరా తంబీ! అతడే గాడిద కాళ్ళు పట్టుకున్నప్పుడు నీకేం? నువ్వూ ఓ గాడిదను చూసుకో.

తంబి: ఏ గాడిద కాళ్ళు?

పరం: ప్రతీదానికీ నన్నే చంపుతావు. ఏదో దోవ చెబుతానుగాని, అన్నింటికీ నే నెక్కడ చచ్చేది? అయినా పోనీ చూడు. బాంకి శెక్రటరీ, మీ మామా క్లాస్ మేట్సు. మీ మామ చెబితే నీకు తప్పక అవుతుంది. ఆయన్ని పట్టుకో!

తంబి: మా మామగార్నా?

పరం: (విసుక్కుంటూ) అవును. ఏం?

తంబి: (చేతులుతిప్పుతూ. ఈ జన్మలో మాత్రంకాదు. ఉద్యోగంవస్తే వచ్చుగాక! పోతేపోవు గాక!

పరం: (సమాధానపరుస్తున్నట్లు) అది కాదురా వసుదేవుడే...

తంబి: ఏపిశాచు అతడెవడో చవలాయి అయి ఉండాలి. లేకపోతే ఆ గాడిదయినా మంచిదై యుండాలి

పరం: అయితే ఇలా గాడిదలాగయినా ఉంటావంటావు.

తంబి: ఏ వసుదేవుడో నా కాళ్ళకోసం వస్తాడంటావు.

పరం: ఎవడికోసం? నీ కోసంకాదు. వాళ్ళకోసం...పిల్ల నిచ్చుకున్నారు కనక వాళ్ళే వస్తారు నీ కాళ్లదగ్గరికి.

తంబి: ఏదో వొకాటి జరగనీ, నే మాత్రం పోయేదిలేదు.

పరం: పోనీ ఇది చూడు అబ్బీ! మీ ఆవిడచేత చెప్పించు మీ మామకి.

తంబి: (సాగదీస్తూ) మామయ్యా!

పరం: (అదే ధోరణిలో) ఏం?

తంబి: నువ్వు చాలా చిత్రమయినవాడివి మామయ్యా! నే ఉద్యోగం ఎందుకు చెయ్యాలంటావు?

పరం: ఉదరపోషణార్థం.

తంబి: బాగుంది. నా ఒక్కడికేనా?

పరం: కుటుంబంకోసం.

తంబి: రైట్, నువ్వసలు 'మెట్రిక్లేషన్' ప్యాసుకావలసినవాడివే! మా జేళ్లు తుచ్చుకున్నా ఎందుకు ప్యాసు కాలేదో గాని!

పరం: నామాటకేంగాని నీ ఉద్యోగం చూసుకోరా సన్యాసీ ఎన్నేళ్లు తిన్ను కుంటుందో.

తంబి: కాలం ఖర్మం కలిసి రావాలిగా దేనికైనా! సరే. నా భార్యాపిల్లల్ని పోషించేందుకు నే ఉద్యోగం చెయ్యాలంటావు. ఆ ఉద్యోగంకోసం ఓం ప్రథమంలో నాచే భరింపబడేభార్య రికమెండేషనా? ఇది న్యాయమేనా? ధర్మమేనా? పురుషలక్షణమేనా? (పిడికిలి బిగించి ఆవేశపట్టులో) వీల్లేదు. ఇది జరగడానికి వీల్లేదు. ఏమైనా కాని......(పరంధామయ్య చిత్రంగా చూస్తాడు) నే ను అడగను. ఉద్యోగం పోనీ - రానీ!

పరం: ఒరే తంబీ! నువ్వు తంబివిరా. ఇది కాలక్షేపం కాదురా!

తంబి: (తేరుకొని) అదికాదు మామయ్యా! నే చెప్పింది సబబా? కాదా?

పరం: సబబుకాదని ఎలా అన్నా. సబబే. మరి ఎలా? పోనీ మీ నాన్నతో చెప్పిస్తే?

తంబి: అవును చెప్పిస్తే.. (నచ్చినట్లు).. చెప్పిస్తే బాగానేఉంది. సరియైనయోచన.. మామయ్యా! అలా చేస్తాను. (ఒక్కక్షణం ఆగి) మామయ్యా! ఇదికూడా వీల్లేదు.

పరం: ఏం?

తంబి: లాభం లేదు మామయ్యా...... నాన్న నాకు ఇందులో నాన్నే. సందేహం లేదు. నాన్న అంటాడు ఆపళంగా...... (పురాణం చెబుతున్నట్లు) "ఒరేయి సన్యాసీ! నువ్వు నిజంగా సన్యాసివేరా! ఏ గాడిద చెప్పిందిరా నీకే చచ్చు సలహా? (పరంధామయ్య గతుక్కుమంటాడు) లేకపోతే నీకే తట్టిందా ఈ వెధవాలోచన? మీ మామకు చెప్పలేనంతటి నాజమ్మరట్రా? ఉంటా! నే నడగాలా? నాన్న సంగతి నీకు తెల్సుకదూ?"

పరం: అచ్చు మీ నాన్నలా "ఏక్టు" చేశావు.

తంబి: నువ్వుకూడా తరవాలేదు. నువ్వు వాలా 'ఏక్టు' చేశావుకదూ!

పరం: సరేగాని వెధావ్వాయి! ఏం చేస్తావురా మరి.

తంబి: ఏం చెయ్యమంటావు?

పరం: (కోపం తెచ్చుకొని) "ఏ గత మంటాను. బి. ఏ. ప్యాసు అయ్యావు ఎందుకూ? విడవనా! డబ్బు తగలెయ్య మంటే అడ్డగాడిదలా తిరిగి తగలేస్తావు" అంటాడు మీ నాన్న, ఈ మాట మీనాన్న దగ్గరంటే.

తంబి: బలేగ్రేడు వినిపించావే! (కిట్టను కొట్టినట్లు) మామయ్యా! పోనీ నువ్వే పోయి మా మామగార్ని కలుసుకుంటే? (పరంధామయ్య నచ్చినట్లు చూస్తాడు. తంబి ఇంకా హుషారు తెచ్చుకుంటాడు) ఎలా ఉంది మన ఆలోచన?!

పరం: (సాగదీస్తూ) మెరుపులా ఉంది. పీడిశావు కొండచుట్టూ తిరిగి 'ఇది కొండ' అన్నాట్ట ఓ గాడిద!

తంబి: ఆ వెధవగాడిదమాట పోనియ్యి మామయ్యా!

వరం: అదేకదా మనకు కావలసింది. నువ్వు మీ మామగార్ని అడగలేవు గాని ఎవడో మేనమామ, తన మేనల్లుడు కోసం, వాడి సొంత మామగార్ని అడగడమా? సొంతమామకు లేని రంధి పిల్లనిచ్చుకోని మేనమామ కెందుకురా సన్నాసీ!

తంబి: అలా అంటే ఎలా మామయ్యా!

వరం: మరీ ఎలారా తంబీ! - పోనీ తంబీ ...నువ్వే ఆ దయానిధి.

తంబి: అత డెవడు?

వరం: అతడి కాళ్ళదగ్గరకే మీ మామను నీకోసం వెళ్లమంటుంట. దయానిధే శక్రటరీ!

తంబి: అయితే?

వరం: ఏముందీ. నువ్వు అతగాడిదగ్గరకు పోయి ప్రాధేయపడు. బతిమాలు. చేతులుకావు కాళ్లను. ఉద్యోగం లేకపోతే తిండి లేక, ఎండి, కృశించి, నీరసపడి, కొన ఊపిరితో, ఉండబోయే నీ భార్యాపిల్లలకు దారి లేదను చివరిసారిగా నీ పాటను టపటపా వాయించుకో!

తంబి: దయానిధి కనక దయ దొరుకుతుందనుకున్నావా?

వరం: అదికూడా కాదు. నే ఫలానా శంకరంగారి అల్లుణ్ణి అను. నిన్ను చూసి కాకపోయినా మీ మామ మొహం చూసయినా ఉద్యోగం దొరకచ్చు.

తంబి: నువ్వుపూర్తిగా 'మెట్రిక్లేషన్' పోయినవాడవులాగే మాట్లాడుతున్నావు మామయ్యా! నేను శంకరంగారి అల్లుణ్ణి అని చెప్పుకోవడంలో శంకరంగారికి నా మీద ఎంత అభిమానముందో వేరే 'టెస్టిమోనియల్' ఎందుకు? 'మీ మామగారు రాలేదేమంటే' నేనేం చేసేదీ? 'మీ మామగారితో మాట్లాడతాను వెళ్ళండి' అంటే అపుడు ఏ మేనమామ అడ్డువడతాడు? (ఏదో తీరని అపచారం జరిగినట్లే) ఉద్యోగం రాదు సరికదా ఆయనకు నా మొహం ఎలా చూపించను? శారదకు ఏమని సమాధానం చెప్పేది? 'పోనీ నన్నయినా అడిగారా?' అని పల్చగా అంటే ఎంత తేలతనంగా ఒక భార్యముందు నిలబడవలసివస్తుంది? (చాలా విరపాదిగా) మామయ్యా! నువ్వు చాలా ఉత్తిగా, ఆపామాషీగా ఆలోచిస్తావేగాని పరిస్థితులను అవగాహన చేసుకొని ఆలోచించవు మామయ్యా! నీకు తెప్పదు...... (గద్గదస్వరంతో) అవును మామయ్యా... నీకు కూతురుంటే ఏ గాడిదకోసమో పరిగత్తే అవసరం నీ కెందుకుంటుంది! నాకోసం కూడా కాదు నిన్ను వెళ్ళమంటుంట! చనిపోయిన మా అమ్మ మొహం చూసి ఈ సహాయం చేసిపెట్టు...

వరం: (కళ్ళు తుడుచుకుంటూ) వెడతానురా!

తంబి: (బరువైన రెప్పలతో చూస్తాడు)

వరం: (చాలా బరువుగా) తంబీ; ఆశ్చర్యపడకు, ధైర్యంగా ఉండు. అనవసరంగా ఇదైపోకు నీకేం రా! బి. ఏ. ప్యాసయ్యావు. లక్షణమైన భార్య దొరికింది. అన్నివిధాలా అదృష్టవంతుడివి. ఈవేళ కాకపోతే రేపొస్తుంది ఉద్యోగం. మరేం భయపడకు. ఈ బండిలో పోయి మీ మామగార్ని కలుసుకొని ఆయన్ని దయానిధిదగ్గరకు పంపించి రేపీపాటికి దక్కా వస్తాను.

తంబి: శారదను అడిగానని చెప్పు మామయ్యా

వరం: ఏమన్నానా?

తంబి: ఫో మామయ్యా.

* * *

[శంకరంగారి ఇల్లు]

శంకరం: అమ్మాయీ! వరం ధామయ్య బాబయ్యగారు వచ్చారు కాఫీపట్రా!

శారద: (లోపలనుంచే) అలాగే నాన్నా!

వరం: ఇప్పుడెందుకులెండి!

శంక: ఫరవాలేదుగాని ఇప్పుడక్కణ్ణుంచేనా రావడం? తంబి ఏమంటున్నాడు?

శారద: (కాఫీ తెస్తూ) వారు రాలేదా నాన్నా?

శంకరం: (నవ్వుతూ) వస్తే కనపడ్డూ? అయినా ఉద్యోగాల హడావడిలో ఉన్నాట్టలే!

శారద: ఇక్కడుంటే ప్రయత్నించుకోవచ్చుగా.

వరం. నేనూ అదే అన్నాను. 'నీకేంరా తంబీ నిక్షేపంలాంటి భార్య, పలుకుబడిగల మామగారు ఉన్నారు. వెళ్ళరా' అన్నాను. నా మాట వింటేనా? చూడమ్మాయి(బొటనవేలు మడిచి నాలుగు వేళ్ళే చూపుతూ) ఉత్త మొహమాటం మనిషి!"

శంక: మొహమాటం అల్లుడిగారింటి పర్యాయపదమేమో!

శారద: (ఫక్కుమని నవ్వుతుంది)

వరం: (నవ్వు తెచ్చుకుంటూ) అహా! ఈమధ్య చాలా మారిపోయాడు. పూర్వం చలాకీతనం, ఆ నవ్వుతూ మాట్లాడ్డం అతనిలో లేదు ఇప్పుడు.

శారద: (దెబ్బ తిని, దిగజారిపోతూ ఉంటుంది. శంకరంగారు మామూలుగా వింటారు)


వరం: మీరు నమ్మరేమో గాని చాలా మారిపోయాడు. చిక్కి సగమయ్యాడు మనిషి 'ఎందుకురా బెంగ' అంటే 'ఏమీ చెప్పలే'నంటాడు. నే నలా రామాపురం పోతున్నానంటే నన్నొకసారి దిగి శారదను చూసి రమ్మన్నాడు. ఉద్యోగంకోసం ఇంత ఇదైపోయే కుర్రాణ్ణి ఎక్కడా చూడలేదు వట్టి అభిమానం మనిషి చాలా కష్టం వీడితో! (శంకరంగారితో) ఓ కష్టం వస్తుంది! ఓ సుఖం వస్తుంది! వీడితో ఎలాగండి?

శంక: ఉద్యోగం చెయ్యాల్సిన తొందరేముంది అప్పుడే! పోనీ పద్మనాభంగారి ఆఫీసులో......

వరం: సరిపోయింది...ఆఫీసుక్కూడా మడిగట్టుకు వెడతాడు మాబావ.

శారద: (బెంగగా) పోనీ ఆ ఉద్యోగం ఏదో నువ్వు చూసిపెట్టు నాన్నా! ఆయన చాలా తేలికమనిషి. ప్రతిదానికి ఇట్టే బాధపడ్తారు.

శంక: (కటువుగా) నువ్వూ ఇట్టే బాధపడకమ్మాయి. ఉద్యోగం అంతగా కావలసిన



బస్తరుజిల్లా తీరత్‌గఢ్ జలపాతం

ఫోటో: ఇ. అజయ్‌కుమార్, రాజమండ్రి.

వసుదేవుడే గాడిదకాళ్లు పట్టుకున్నాట్ట

కాదు అక్కడ ఉండి బాధపడ్డం దేనికి? వచ్చి నన్నడుగుతే చిన్నతనమా? అడక్కూడదా?

పరం : కూడదని కాదు. అన్నింటికీ మీ రున్నారని అశ్రద్ధ

శంక : అశ్రద్ధ మాని శ్రద్ధగా ఉండమనండి

శారద. పట్టింపులు మాని పనివిషయం చూడండి నాన్నా!

పరం అవును అతగాడు అలా ఉన్నాడంటే అతడు అల్లుడు. ఆడపిల్ల నిచ్చిన వాళ్ళం

శంక అందుకని?

పరం : అదికాదు

శంక : ఉద్యోగం కావలసినవాడు ఇక్కడకే వస్తాడు.

శారద : అలా అంటే ఎలా నాన్నా! ఉద్యోగం అయ్యేదాకా ఈ కష్టం తొక్కడంటే?

పరం : అవును.

శంక : అయితే?

శారద : వాకోసం ఆయనకు ఉద్యోగం చూడాలి మీరు.

శంక: ఇప్పుడేం చెయ్యమంటారు?

పరం: మావూరు బాంకిలో ఉద్యోగం కోసం దరఖాస్తు పెట్టాడు తంబి. బాంకి సెక్రటరీ మీకూ డోక్టీటు.

శంక: దయానిధా?

పరం: అవును.

శంక: ఇది జరగని విషయం. అతడు నాకున్నలేసే చాలా ఇద్దైన మనిషి. నా స్నేహం అతన్ని చాలా ఇరుకున పెడుతుంది. అందుకు నే ఒప్పుకోను. పోనీ తంబినే పోయి అడగమనండి.

పరం: ఈ ముక్క కోసం నేను మీదగ్గరకు రానక్కర్లేదేమో!

శారద: అవును నాన్నా ను వ్యేది చేసినా నాకోసం అని మర్చిపోకు.

శంక. అంచేత?

పరం. మీరలా అంటే ఎలా? వసుదేవుడుకూడా ఒకప్పుడు గాడిదకాళ్లు పట్టుకోవలసి వచ్చింది

శంక: అతగాడు గాడిదమాత్రం కాడు.

పరం: పోనీ ఏను గే అనుకుందాము. ఇందులో కష్టమేముంది?

శారద: (తండ్రికేసి దీనంగా చూస్తుంది. శంకరం చూస్తాడు శారదను)

శంక: అవును. పరిస్థితులు ఎంత ప్రభావమైనవి! నా జీవితంలో ఇదే మొదటిసారి అనుకుంటాను. క్రొత్త అధ్యాయం ప్రారంభమైంది! రేపు దయానిధిని కలుసుకొంటాను.

* * *

[తంబి ఇల్లు]

పద్మ: ఓరే అబ్బీ! మీ మామగారు వొచ్చార్రా!

తంబి. (వస్తూ) ఇలాగా రావడం?

శంక. వంట్లో ఎలా ఉంది?

పద్మ: (తంబికేసి చూస్తాడు)

తంబి: (దిగజారిపోతూ) బాగా నే ఉంది.

శంక: అలా అయిపోతే ఎలా? ఏదో కొత్త ధైర్యంగా ఉండాలిగాని. వెధవ ఉద్యోగం ఈవేళ కాకపోతే రేపవుతుంది. దయానిధితో మాట్లాడాను.

పద్మ: ఆయ నెవరు?

శంక: ఈవూరు బ్యాంకు సెక్రటరీ! తంబి ఉద్యోగంకోసం దరఖాస్తు పెట్టాట్ట. మీకు తెలియదా?


తంబి: (దెబ్బ తిన్నట్లు) మరే నాన్నా!

పద్మ: అహా!

శంక: ఇస్తానని 'ప్రామిస్' చేశాడు. కాని నేనొక 'ప్రామిస్' చేశాను ఆయనకు. మీ 'సెక్షన్ హెడ్' సహాయం కావాలి

పద్మ: మా 'సెక్షన్ హెడ్' ఎనికి?

శంక : దయానిధి తమ్ముడు 'సెలక్షన్ గ్రేడ్' లో పడాలిట. అది కాస్తా వేయించాలి. మీకు ఆయనతో చాలా చనువుంది



విజయవాడ రైల్వేస్టేషన్ యార్డ్

—ఫోటో: పి. రామారావు

కనం. నీ అంతవాణ్ణిని అదెంతలే అని వచ్చాను

పద్మ చంపారు మామూలుగా దను వుంది గాని, ఇల్లాటి విషయాలు నాకసలు పడవు

తంబి అలా అంటే ఎలా బావా! నా కోసం—

పద్మ (నొవ్వుతూ) తంబీ!

తంబి (తగిపోతాను)

పరం (ప్రవేశిస్తూ) అలా అంటే ఎలా బావా? వసుదేవుడే - వెళ్ళి గాడిదకాళ్ళు పట్టుకున్నాట తప్పనిసరి ఎవరికోసం ఇదంతా? (తంబిని చూస్తూ) నువ్వు చేసినా, ఆయన చేసినా, నే చేసేదేమీ లేదనుకో, మాటవరసకి నే చేసినా వాడికోసం

పద్మ సరే అయితే

శంక ఇప్పుడే వెళ్లండి నేను మళ్ళీ సాయంత్రం బండికి వెళ్లిపోతాను

పద్మ. ఇప్పుడేనా?

తంబి అప్రసన్నభావం ఊరిమి గాస్తాడు తంబి అక్కడ ఆగి పరంధామయ్యకేసి చూస్తాడు) పరంధామయ్య (అంగుళించి) అవును బావా! 'శుభస్య శీఘ్రం' అన్నారు

పద్మ సరే అయితే

* * *

తంబి నాన్న వస్తున్నాడు మామయ్యా!

పద్మ (ప్రవేశిస్తూ, హైరానపడుతూ) ఈ ఉద్యోగాలు కాదుగాని

శంక ఏం?

పరం ఏంటావా?

తంబి (తం(డివంక చూస్తాడు)

పద్మ ఏముంది ఆయన ఓ కండిషన్ మీద ఒప్పుకున్నాడు

శంక ఏమిటదీ?

పరం మన అంగుళాటులో నిజేనా?

పద్మ ఏముందీ ఆయనకు ఒక బావమరిది ఉన్నాట్ట ఒక అప్రయోజకుడు వాడి భారం ఈయనమీదుంచట వాడిని ఒక మనిషిగా చెయ్యదలచి 'వసుసేవా ఇన్సూరెన్సు కంపెనీ' లో 'ఏజన్సీ' ఇప్పించి ఊరుమీద వదిలాడు అంగుళోసం తంబి ఉద్యోగం అయిన తక్షణం రెండు వేలకు 'పాలసీ' తీసుకోవాలట!

తంబి వద్దాం!

శంక దీని కేముంది?

పరం దినికేనా! ఇన్సూరెన్సు పాలసీ తీసుకోమన్నారు గాని రెండు వేలిమ్మన లేదుగా ఒక ఇన్సూరెన్సు ఏజంటు తన కొడుక్కి పెళ్ళికట్నం క్రింద ఐదు వేలు ఇగగు, మూడు వేలకు పాలసీ ఇయ్యించుకుని తీసుకోమన్నాడుట

తంబి నే కట్టను

పరం ఏం?

తంబి అలా లేదు మామా లేదు కొడుకు పేరు సోములింగం

పరం కొడుకు పేరు సోములింగం శ్రీరం చెయ్యి ఆ పైన కథకేం భయం లేదు

తంబి ఏమైనా కాని, ఇన్ని కం డి షన్లతో నాకు అక్కర్లేదు ఉద్యోగం

శంక బాగుంది ఈమాట అ వ త ల మాటిచ్చాను కూడాను

పద్మ నేరగాత్రం?

పద్మ ఒరే అబ్బీ నువ్వు పాలసీ తీసుకోకపోతే దయానిధి సహోదరునికి సెలక్షన్ గ్రేడ్ రాదు ఆ అబ్బికి రాకపోతే నీ కుద్యోగం రాదు ఒక లేముక్క ఉద్యోగం కావాలా? అక్కర్లేదా?

తంబి కావాలి గాని

పరం కావాలంటే కట్టు నువ్వు వ్యవహారి

వసుదేవుడే గాడిదకాళ్లు పట్టుకున్నాట్ట

కావాల్సి పనుకో అక్కర్లేదు. నీఉద్యోగం కోసం నీ సహాయం నాకు కావాలి, చూడు.
తంబి: వసుదేవుడే...

పరం: కాదురా తంబీ! తంబె, తంబి కాళ్లు పట్టుకుంటున్నాడు. ఇంకా చూడు చిత్రం. ప్రయత్నం నీదగ్గరనుంచి ప్రారంభమై నదగ్గరకొచ్చి ఆగింది, భూమి గుండ్రంగా ఉన్నట్టు.

[అంతా నవ్వుతారు]

రైలుకట్ట

గుంటూరు లక్ష్మీగణపతి శాస్త్రి

మా వూరికి రైల్వేస్టేషను లేదు. కాని రైల్వేలైను మావూరి ప్రక్కనుంచే పోతుంది.

ఆ రైలుకట్టకు రెండు వేపులా పచ్చని వరి చేలు, చేలమధ్య తెల్లటి పంటచెరువులు. చెరువుగట్లమీద అరటి. వంగ, బెండ మొక్కలు. దిమ్మలమీద గడ్డివాములు. వాములనిండా అల్లుకున్న బీరపాదులు. పాదులనిండా మూడుపువ్వులు, ఆరు కాయలు.

ఎత్తుగా ఏటిగట్టులా ఉంటుంది రైలుకట్ట కట్టవెంబడి దట్టంగా పట్టిన పచ్చిక. కట్ట మీద ఎర్రనికంకర. కంకరమీద ఎండలో తళతళలాడే నల్లత్రాచులవంటి రైలుపట్టాలు. మావూరినుంచి చూస్తే ఎర్రని పెద్ద రోకలి బండలా కనిపిస్తోవుంటుంది ఆరైలుకట్ట.

ఆ రైలుకట్టవెంబడి బయలుదేరతారు - కనుచీకటిలోనే పొలం యజమానులు - కిర్రు చెప్పులు, చేతిలో కర్రా, చెంబు. మోకాళ్ల వరకు ఎగకట్టిన పంచె. ముతక ఖద్దరులాల్చీ, చలికి తలమీదుగా వంటినిండా కప్పుకున్న తెల్లఖండువాతో జోడించిన ఎర్రకాలువా, తాటాకు గొడుగులతో.

కొంచెం వెలుగువచ్చే వేళకి మొదలు - రైతులు, నాగళ్లు, మరకారెములతో, దుక్కి పశువులను తోలుకొంటూ.

చెట్లగుబుర్లలోనుంచి సూదుల్లాంటికిరణాలతో పొడుస్తూ, సూర్యుడుదయించే వేళకు, పచ్చికమీద పట్టినమంచు - ఇంద్రధనస్సులోని రంగులన్నిటినీ విరజిమ్మే ముత్యాలు - ఎండలో మాయమౌతాయి

ఈలోగా, దూరాన మంచులో కనబడకుండా వచ్చే నల్లని మెయిలింజను, రైలుకట్టవెంబడిపోయే రైతులను, పశువులను, టెలిగ్రాఫ్ తీగలమీది పిట్టలనూ, భయమనే కూతతో చెదరగొట్టి, రైలుకట్టనంతనీ దడదడలాడించి, రైలుపట్టాలను కసిదీరా విల్లువంచినట్టువంచి, టకటకలాడించి, వెళ్లిపోతుంది - యింతపొగ - నల్లటిరాతుసిబొగ్గు పొగ రైలుకట్ట ముఖాన్ని కొట్టి.

సూర్యుడు చురచురలాడే జాముప్రొద్దెక్కే వేళకు కాపుపడుచులు, మాలెతలు బయలుదేరతారు - ఊకప్పులకూ, కలుపు తీతలకూ, కారంమీద నీళ్లలోతేందుకూ-రంగురంగుల చీరలు మోకాళ్లవరకు బిగించి కట్టుకుని. వెలవెలబోయే కడియాలతో, తళతళలాడే గాజులతో నున్నటి కొప్పులలో తురిమిన పచ్చటి పువ్వులతో, ఎండలో మెరిసే టిఫిన్ కారియర్లతో, గలగల కబురు చెప్పుకుంటూ, కిలకిలా నవ్వుకుంటూ, లేళ్లలా పరుగెత్తుతూ

పదిగంటలయ్యేసరికి. గేదెలమంద-నల్లగా, ఎండలో మెరిసే నల్లబండరాళ్లవంటి గేదెల మధ్య తెల్లని ఆవులు- ఎండలో మరీ తెల్లగా కనబడి మాపులను చెదరగొడుతూ.

ఇంత మందకూ వెనక ఎక్కడున్నారో కనబడరు - ఇద్దరు ముగ్గురు బుడతలు, - వేలెడంత కుర్రాళ్లు. వాళ్లదగ్గర లేమీ ఉండదు - వెలిసిపోయిన ఎర్రమొలతాడుకి జానెడు గోచీపేలిక. రెండుజానల తువ్వాలుగుడ్డ తలకు చుట్టుకు నేంచుకు. చేతిలో కర్ర ముక్కలు - గోటిబిళ్ళ ఆటలోక్కి, మెత్తటి రాగిటి నేలలో విసిరి గుచ్చే ఆటలోకి, పని కొచ్చే విధంగా సూదిమొనలుగా చెక్కుకున్నవి - తప్ప. ఎండల్లో తిరిగినందువల్ల, నల్లగా మాడిపోయి నిగనిగలాడే శరీరం, వానల్లో తడిసి, ఎండకు ఎండినందువల్ల, ఎర్రబడి రాగిపీచులాగవున్న జుట్టు.

మంద రైలుకట్ట ప్రక్కల్ని పచ్చగడ్డి కొరుకుతూ వుంటుంది. ఈ కుర్రాళ్ళు పట్టాలమీదకూ క్కని, గేదెలమీదికీ, నీళ్ళల్లోకీ, పట్టాలమీదికీ, కంకరరాళ్లు విసురుతూ, వింతలూ, విశేషాలూ చెప్పుకుంటూంటారు. ఇంతలో ఒక గేది ప్రక్కచేలో బడుతుంది అక్కడినించి ఆ రైతు తిట్లు. "యువకల్లారా! ఎక్కడ చచ్చినార్రా! కళ్లు కనపడ్డం లేద్రటా!" ఒకడు పరుగెత్తుకునివెళ్ళి, తాటికమ్మతో గేదెను నాలుగు బాది, కసిదీరా తిట్టి, దానిమీదెక్కి సవ్వారీ చేస్తాడు.

ఇంతల్లో వస్తుంది ట్రాలీ - రైల్వేట్రాలీ - ఎర్రటి జెండా - దొర టోపీలో, కాకీ లాగు, తెల్లచొక్కాలతో, బొజ్జింక మీసాలతో ఆఫీసరూ, వెనకవైపుని పట్టాలమీద పరుగెత్తి బండినితోసే గాంగు కూలీలూ.

ఆ బండిని చూడగానే వీళ్లు దులుపుకుని లేచి, మందని కదలేసి, తోలుకుని వెనుతొన్నట్లు నటిస్తారు. ట్రాలీమీద వాళ్లు వీళ్లకేసి కొరకొరా చూస్తారు, రైలు గట్టుమీద మళ్ళీ మేపుతున్నందుకు. ఆఫీసరు రిపోర్టు చేస్తున్నాడని తోచగానే వీళ్లు "దణ్ణాలండి బాబయ్యా!" మంత్రం పఠిస్తారు, దొంగ భయం నటిస్తూ. అంతే! అది టకటకలాడుతూ వెళ్లిపోగానే పోయాడ్రా నా.." అని వాణ్ణి తిట్టుకుంటూ బైతాయిస్తారు, ఆ ట్రాలీకేసే చూస్తూ. దాన్ని చూస్తే వీళ్లకు వింత. "దాని కింజనూ ఉండదు, ఏమీ ఉండదు. కింద నాలుగు చక్రాలు, పైన నాలుగు కర్రలూ అంతేన్రా!" అని ఒకడు.

"వాళ్లు బలేగా పరుగెడతారు పట్టాల మీద! పరుగెట్టి పరుగెట్టి బండిమీద కూకుం

టారు. బండి దానంతటదే బలే స్పీడుగా పోతాది" రెండోవాడు "వాళ్లకు బలే హార్పిసుతా! మనం నాలుగడుగులేస్తే, తూలి కింద పడతాం" మూడోవాడు.

పదకొండు గంటలవేళకు చేరుకుంటారు నడుము వంగిపోయిన ముసలమ్మలు, నడుము రాని ఆడపిల్లలు—పేడతట్టలు చంక బెట్టుకుని. గుడ్డలతోను తాళ్లతోను కట్టుకున్న పాదరక్షలతో వాళ్ళు ఒకరితో ఒకర పోట్లాడుకొనే విధానం చూస్తే, వృద్ధాప్యం రెండవ బాల్యదశ అనే షేక్స్పియరు మా...

సుర్రుకొస్తుంది. వాళ్లు పేడకళ్లు వండుకోడం మరిచిపోయి, గేదెలను, ఆవులను, పంచుకుంటారు. "మా కామందు సత్తిరాజు గారి గేదెలన్నీ నావి మా బుల్లెంకడు కాపీ గేదెలన్నీ నావి" అంటుందో పిల్ల. అంతటితో ముసలిదాని కోపం తారాజువ్వలాగ లేచి, నిసిం(ద్రీలా చీదేస్తుంది. "ఆ! మహా నువ్వు గడించావు సత్తిరాజు గార్ని, సత్తిరాజు గారి గేదెల్ని! నక్క పుట్టి నాలు గాదివారాలు కాలేదు గాని..." అని ఆ కోపంలో నోరు తిరక్క ఆయాసం వచ్చి వగరుస్తుంది.

ఇంకా కొంతమంది యీ బాపతే వస్తారు పెద పెద్ద గంపలతో. ఎండిన పుల్లలు, తాటి ఆకులు, కమ్మలు, పులకలు, తీసేసిన ముంజాలు, పొయ్యిలోకి తీసికెళ్లడానికి. పుంతలవెంబడే బయలుదేరతారు బతికున్న చెట్టువీ, చచ్చిపోయిన చెట్టువీ, పనికొచ్చే చెట్టువీ, పనికిరాని చెట్టువీ, పచ్చివీ, ఎండువీ అనే విచక్షణ లేకుండా గంపనిండటమే (ప్రధానం అందరూ పొలాల్లో పనుల హడావుడిలో ఉండే సమయం కనుక అంతా గప్ చిప్. ఇటువంటివాళ్ల కెవళ్లతోనూ, సంబంధం ఉండకూడదు, ఉండదు. కావంటే గంప నింపి, నిండా పేర్చుకొన్న తర్వాత దారిపోయే దానయ్య ఎవడైనా గంప తలకెత్తితే చాలు. మళ్లీ ఆ ఎండలోనే రెండు గంటలయ్యే వేళకు యింటికి జేరుకుంటారు పొయ్యి రాజెయ్యడానికి

పన్నెండు గంటలయ్యే వేళకు వస్తారు రైతుల కూతుళ్లు, భార్యలు, ముసలి తల్లులు —యింటివద్ద ఎవరు ఖాళీగా ఉంటే వాళ్లు తట్టలలో టిఫిన్ కారియర్లు, గిన్నెలతో, అన్నం, పప్పు చారు, మజ్జిగ, నంచుకోనేందుకు పచ్చడితో సహా!

సరి! ఆ వేళకి ఆ వాడ వాడంతా మోత మోతెత్తించేసిన ఊడ్పులు ఊడ్చే, కలుపులు తీసే, నీళ్లు తోడే ఆడవాళ్ల పాటలు, కథలు చెప్పడం, ఊకొట్టడం మొదలైన జానపద గేయాలు, పదాలు, పాటలు, సరాగాలు, క్రమంగా సన్నగిల్లి, నీరసించి గట్టెక్కి కాళ్లు కడుక్కుంటాయి.

చెరువుగట్టుమీద మామిడి చెట్టులు, నిద్రగన్నేరు చెట్ల నీడల్ని, తాటితోపుల్లోనూ, అన్నం గిన్నెలు, మంచినీళ్లూ దగ్గర పెట్టుకొని, గుంపులు గుంపులుగా చేరి సరస సల్లాపాలతో ఆరగిస్తారు.

ఒక్క గడియసేపు అల్లా కూర్చుంటారో లేదో, మళ్లీ చేలల్లో దిగుతారు గేయాలు, పదాలు, పాటలు, కథలు మళ్లీ మొదలు. ఆ పచ్చటి చేలల్లో రంగురంగుల చీరలతో ఆ కాపుపడుచులు వసంతకాలంలో నిండుగా పుష్పించిన చెట్లగుబురలో సీతాకోకచిలుకలతలె కనిపిస్తారు, రైళ్లలో వచ్చేపోయే జనానికి.

"భంయ్"మని గర్జించే కెనెడియన్ ఇంజన్లకు ఉలిక్కిపడి వంచిన నడుములెత్తి విలాస వి(భమాలతో కళ్లు పెద్దవిచేసి, రోకలి బండలా సాగిపోయే రైలుబండిని చూసి మళ్లీ నడుము వంచుతారు.

ఈలోగా ఆకాశంలో వడమటిమూల గుడ్డపేలికంత మబ్బుపింజ బయలుదేరి నింపాదిగా ఆకాశ మధ్యాని కొచ్చేటప్పటికి ఇంతింతై వటుడింతయై మరియు తా నింతై నభోవీధిపై కారు నలు పెక్కేసరికి వాళ్లలో ఒక భీతహరిణేక్షణ, తన కాటుక కళ్లు పెద్దవిచేసి, ఆకాశంవైపు చూసి, ఒక్కసారి మూర్ఛపోయినంత పనిచేసి, కెమలిలా కేక పెడుతుంది. "ఓ లబ్బో! కూసింత సేపట్లో యంత మబ్బట్టిందో! దీని జిమ్మడా! రోజా యీ యాలకే మూసుకొనిపోతుంది పుట్టి మునిగిపోయినట్టు." అది విని మిగిలిన ముద్దులందరూ, తమ మీనలోచనాలను మిలమిలలాడించేసరికి, ఆ మేఘుడికికూడా కొంటెతనం పుట్టుకొచ్చి, వాళ్ళందరినీ హడిలు కొట్టాలని, ఒక్కసారి కడుపు పగిలేటట్టు ఫెళఫెళా నవ్వేసరికి, ఆ ముంపులకు కళ్లు అప్పళించుకొని, తూలిపడకండా ఒకళ్ళనొకళ్లు ఆసరా చేసికొని, ఒకళ్ల మొగాలొకళ్లు చూసుకుంటారు.

ఇంతలోకే మబ్బు తూట్లు సముద్రం చేరకుండా, కడుపు పట్టినన్ని .నీళ్లు (తాగి (తేవ్ మనేసరికి వీళ్ళ చెవుల్లో హోరుమంటుంది. వీళ్ళందరూ బేజారెత్తి, ఏవైపు నుంచి వస్తాందో అని కలయజూసేసరికి అప్పుడే ఔటర్ సిగ్నల్ దగ్గర కొచ్చేస్తుంది వానజడి. అందరూ చేతులలోని నారకట్టలు, కలుపుకట్టలూ, ఎక్కడివక్కడ వదిలేసి, పాలోమంటూ గట్టెక్కేసి, పశువుల సాలలోనికి దూరేలోగా, వీపువెంబడే తరుముకొనివచ్చి, ఒక్కసారి ఛడేలు మనిపించి, చీరకొంగులు తడిపి తీరతాడు పనిపట్టి, పంతంపట్టిన మేఘుడు. వీళ్లందరూ సాలలో పొల్లగొడ్లకు దూరంగా నిలబడి, కుంభవృష్టిగా కురిసే వర్షానికి వడే చూరు నీళ్ళల్లో కాళ్లు కడుక్కొని తుడుచుకొనేలోగా, చల్లని వానజల్లు తుంపరలకు ఒళ్లు ఝల్లుమని పులకించి, తడిసిన రవికల పనిమి వర్షానికి నిళ్ళలమై, మిట్టపల్లాలను మిలమిలలాడే కొంటెగాళ్ల కళ్లకు పమిట తెరలు కప్పేస్తారు.

నాలుగున్నర, అయిదు అయ్యేసరికి మా వూరిలో సగం జనాభా ఆ రైలుగట్టుమీదే ఉంటారు.

ఎలిమెంటరీస్కూలు పిల్లలు బడి వదలగానే పలకా, పుస్తకాలు యింట్లో గిరవాటు పెట్టి ఎనిమిదీ పన్నెండేళ్ళ మధ్య పిల్లలు ఒక జట్టుగా కూడి బయలుదేరతారు.



★ రైలుకట్ట ★

రైలుపట్టాలమీద నడుస్తూ, ఆడుతూ, గంతులేస్తూ, కబుర్లు చెప్పుకుంటూ, కేరింతాలు కొడుతూ, వింతలు, విశేషాలు చెప్పుకుంటూ.

హైస్కూలు పిల్లలు స్కూలు వదలగానే స్నానంచేసి, యిస్త్రీ బట్టలు వేసికొని, ముఖానికింత ఫేసుపౌడరు కొట్టుకొని 'చప్పల్సు' వేసుకొని షికారు బయలుదేరుతారు స్నేహితులంతా కలిసి, స్కూలులో టీచర్సును, విద్యార్థుల మధ్య పాలిటిక్సును తీవ్రంగా విమర్శించుకొంటూ.

పనీ, తీరుబడీ లేని పాతికేళ్ళ యువకులంతా గ్లాసోపంచె, లాల్చీ, కూలింగ్ గ్లాసెస్. రిష్ట వాచీలతో షోకేళీలుగా తయారయి, సినిమా పత్రిక చేతబట్టుకుని, సినీమాలనూ, సినీతారలనూ విమర్శిస్తూ, ఆవూళ్లో ఎవరు, ఏ తారలను పోలివుంటారో చెప్పుకుంటూంటారు.

వయస్సు మళ్లి పాటు పడలేనివాళ్లు కర్ర చేత్తో పుచ్చుకుని, తాపీగా నడుస్తూ, ఆ చల్లటిగాలిలో తమ సాయం వాహ్యాళివల్ల తమ ఆరోగ్యము ఎంత బాగుపడుతుందో అని వూహించుకుంటూ, వాళ్ళ కోజాల్లో అన్నీ ఎంత "యిది"గా ఉండేవో, యిప్పుడెల్లా తగులబడిపోతున్నాయో, ఆలోచించుకుంటూ, రైలు వెనకనుంచైనా, ముందునుంచైనా వస్తూందేమోనని ఎండకు చెయ్యి అడ్డుపెట్టి దూరంచూస్తూ, ఎక్కడ కూర్చోటానికి తగినంత శుభ్రంగా కనబడక, ఇంక పొద్దుకుంకితే కన్ను కనబడదనీ, పురుగూ పుట్రా ఉంటాయనీ, సణుక్కుంటూ ఇంటి దారి పడతారు; దోవలో కనబడిన మనుమణ్ణి చీకటిపడకుండా యింటికి చేరుకోమని హెచ్చరిస్తూ.

ఆరుగంటలకు, అస్తమించే సూర్యుని అరుణకాంతులు సున్నటి రైలుపట్టాలమీద ప్రతిఫలించి పట్టాగుండా మనం ఎంతదూరం వెడితే అంతదూరం మనకూడా వస్తాంటాయి.

ఊడ్పులకుపోయిన కాపువడుచులు చీకటిపడిపోతోందనీ, ఇంటిదగ్గర పిల్ల లేడుస్తారనీ, వెళ్ళి వంట చేసుకోవాలనీ, తొందరపడుతూ, చిన్న చిన్న పరుగులతో, సూచించే వేగిరపాటులోని గలగలలు, గూళ్లకు చేరుకునే పక్షుల కలకలంతో కలిసి చీకటితో మెలసి, చెట్ల గుబుర్లలో నిండుకుంటాయి.

ఏడుగంటలకు రైలుకట్ట పొడుగునా, వెలుగు వెల్లువై, పెద్ద ధ్వనితో భూమిని దద్దరిల్లజేసి, టకటక శబ్దించి, కన్నుమూసి తెరచే అంతలో శరవేగంతోపోయే జనతా ఎక్స్ప్రెస్ వెనుక, రైలుకట్ట మరింత గాఢాంధకారంలో మునిగిపోతుంది.

ఆ తరువాత—అప్పుడప్పుడు వచ్చే రైలు బళ్ళు, రెండువైపులా నీళ్ళదొరువులలోని కప్పల బెకబెకలు, కంకరరాళ్లలోని కీచురాళ్ళ కీచుధ్వనులు, పట్టాలక్రింద మెదిలే ఎలుకలు, పాము పిల్లలు, నిశ్చలమైన పంట చెరువులలో ప్రతిబింబించే నీలాకాశపు నక్షత్రాలకు తోడు జేబురుమనే చెట్లనిండా ముసురుకొని మిణుకు మిణుకుమనే మిణుగురు పురుగుల విలాస చలనాలు. నిద్రలో కలవరించే కులాయాల్లోని పక్షుల కువకువలు. నిశీథపు నిశ్శబ్దాన్ని నిలువునా చీల్చే దివాంధరుతి. ఎండకు ఎండి, వానకు తడిసి, మంచుకు బిగిసే రైలుపట్టాలు - మేకులకు కర్రలకు బిగించబడిన రైలుపట్టాలు - ప్రతిదినము లక్షలకొలది జనాన్ని, వారి సామాన్లను మోసుకొనిపోయే రైళ్ళ వేగానికి భుజాలు దిగిపోయి, నడుములు వంగి, జవసత్వా లుడిగిన రైలుపట్టాలు - విశ్రాంతరాకంలో, మృత్యుశీతలమైన కాళరాత్రి గర్భంలో విశ్వేశ్వరునిముందు సాష్టాంగం పడుకొని సత్యాగ్రహం సాగించే రైలు పట్టాలు. ★

వనితాలోకం

తీరికసమయాలలో ద్రవ్యార్జన

ఇల్లిందల సరస్వతీదేవి

రామాయమ్మ భోజనానికి పిలిచి సేమ్యా పాయసము, నాలుగు రకాల వడియాలు, ఊరగాయలు వడ్డించింది. వాటి రుచులు నన్ను విస్మయపరచాయి దానికి కారణము రామాయమ్మకు ఇటువంటి పనులలో ప్రవేశమున్నదని నాకింతవరకూ తెలియకపోవటమే. అసలే బద్ధకము - అందులో నలుగురు పిల్లలు-ఇవన్నీ చేయటము ఎప్పుడు నేర్చుకున్నదని తర్కించుకుంటూ భోజనము ముగించిలేచాను. ఆమె నన్ను డ్రాయింగు రూములో కూర్చోబెట్టి ఘుమఘుమలాడే వక్కపొడి చేతికిచ్చింది. చిన్ననాటి కబుర్లు, క్లబ్బుకబుర్లు, మధ్య మధ్య గాలికబుర్లు (రేడియో) చెప్పుతూ నవ్విస్తున్నది రామాయమ్మ. నేను వెళ్ళాలని లేవబోతుండగా "నిన్ను భోజనానికి ఎందుకు పిలిచానో తెలుసా? ఇంత కమ్మటివిందు ఆరగించినదానవు, దానిని గురించి నాతో ఒక్క మాటయినా అనకుండా వెళ్లిపోతావా?" అన్నది.

ఆమె ధోరణికి ఆశ్చర్యపడుతూ విందు పదార్థాల రుచులను గురించి ప్రత్యేకముగా పొగడి, "వీటన్నిటికీ తగిన తీరిక, ఓపిక నీకు ఎట్లా కలిగాయి?" అని ప్రశ్నించాను.

"ఇవన్నీ నేను చేశాననుకున్నావా? మా యింటి వెనక వీధిలో ఉంటున్న ఒక ఇల్లాలు చేసింది. మధ్యాహ్నము 12 గంటల నుండి సాయంత్రము నాలుగు గంటలవరకూ ఆమె ఇటువంటివన్నీ తయారుచేస్తుంది. కుట్టుపని అద్భుతముగా చేస్తుంది. పూసలు, దారాలు, అద్దాలు, తళుకులు ఉపయోగించి రవికలు జాకెట్లు, పరికిణీలు, గౌనులు కుట్టుతుంది. ఆమెకు అన్ని రకాల బట్టల కత్తిరింపులు వచ్చును. నేను తొడుగుకున్న రవిక ఆమె కుట్టినదే" అని తన ఒంటిమీది రవికను చూపించింది రామాయమ్మ. దానిని చూడగానే ఇటువంటి పనులలో ఆమెకు బాగా చెయ్యితిరిగినట్లు నాకు తోచింది.

రామాయమ్మ లోపలికివెళ్ళి ఒకహ్యాండు బ్యాగ్ తీసుకొనివచ్చి చూపిస్తూ "ఇది చూశావా - ఎంత బాగున్నదో!" అని నాచేతికిచ్చింది. అది ప్లాస్టిక్ బ్యాగ్ మాదిరిగా ఉన్నది. "ఎగ్జిబిషన్‌లోకొన్నావా?" అన్నాను దాన్ని చూస్తూనే "ఇది కూడా ఆమె చేసినదే. చేరెడు పెరడు వున్నా వృథాపోనివ్వక, ఒక నేతిబీరపాదు పెట్టింది. నిరుడు ఆ పాదుకు 150 కాయలు కాసినాయి. వాటితో ఈ బ్యాగ్‌లను తయారుచేసింది. ఆ కాయలను చెట్టుమీదనే ఎండనిచ్చి, చాకుతో నిలువుగా గీతపెట్టి అటు వైపుకు దిగకుండా కోసింది. లోపలి భాగమంతా తుడిచి, పైబెరడు కూడా దబ్బనముతో తీసివేసింది. బీరకాయపీచు ఎండి తీగలుతీగలుగా కనబడుతూ ఉంటుంది. దానిని మెల్లగా సగానికి మడిచి లోపల దళసరిగుడ్డ వేసి కుట్టింది. హ్యాండిలు కూడా బీరకాయలోనుంచి వచ్చినదే. జిప్పు మాత్రము కొని అమర్చింది. ఇది కొంటే మూడురూపాయలకు పైగా ధర అవుతుంది. వీటన్నిటినీ ఏదోవిధముగా అమ్మి పెట్టమంటుంది. ఎవరికీ తెలియకుండా ఈ విషయాన్ని గోప్యముగా ఉంచమంటుంది. ఆమెకు సహాయము చేయటానికే నిన్ను విందుకు పిలిచాను."

"అంత రహస్యమెందుకు? ఇతరున్నా తప్పుపనా?" అన్నాను ఆగలేక.

"కాదనుకో - కాని - మణి మామగారు జిల్లాజడ్జిగా పెన్షను తీసుకొన్నారు. తండ్రి పేరుపొందిన న్యాయవాది. వాళ్లకు తెలిస్తే బాగుండదంటుంది. ఇంతకూ నీతో చెప్పట

(30-వ పేజీ చూడండి)



మా య లే డి



పి. గజపతిరావు—శ్రీకాకుళం.

తీరిక సమయాలలో ద్రవ్యార్జన

మెందుకంటే మా మహిళా సమాజములో వీటిని అమ్మించి పెట్టుతావని. ఆమె పేరు మాత్రము బయటికి రానివ్వకు" అన్నది.

రామాయమ్మ చెప్పినదానినిబట్టి మణి పరిస్థితులు అర్థమయ్యాయి. పెనిమిటి పట్టభద్రుడు కాలేదు. ఎక్కడో టైపిస్టుగా పనిచేస్తూ, తెచ్చే జీతములో సంసారము గడపటము కష్టముగా ఉన్నది. నలుగురు పిల్లలు చదువుతున్నారు. ఆ నలుగురిలో ఒకడు రెండు సంవత్సరాలు జబ్బుపడ్డాడు. దానితో ఆ యిల్లాలి మంగళసూత్రాలు దారములోకి ఎక్కాయి; చేతులకు మట్టి గాజులు గలగలమంటున్నాయి. మణిసంగతి వినగానే సుమారు నాలుగు నెలల క్రిందట వార్తాపత్రికలో చదివిన విషయము జ్ఞాపకము వచ్చింది. ఒక బ్రిటిషుయువతి రూజువెల్టు చిత్రాన్ని బట్టమీద దారముతో కుట్టి, ఆయన సతీమణికి బహుమానముగా పంపుతూ ఒక ఉత్తరము వ్రాసింది. దానిలో "నాకొక కుమారుడున్నాడు. పక్షవాతము (పోలియో) వచ్చి వాడి కాళ్లు రెండూ పడిపోయాయి. వాడి అభివృద్ధికోసం నేను ఎంత కష్టమయినా పడటానికి సిద్ధముగా ఉన్నాను. నా తీరిక సమయాన్ని వృథాగా గడపకుండా, ద్రవ్యార్జనోపాయాలను అన్వేషిస్తూ సాధన చేస్తున్నాను. మీరు రచయితలు కనుక, నా చేతిపనులను గురించి వ్రాసి ప్రచారము చేయగోరుతున్నాను. కొంతకాలమునుండీ నా ఆదాయములో సగభాగము దేశాభ్యుదయానికై వినియోగిస్తున్నాను" అని వ్రాసి ముగించింది.

రూజువెల్టుకు కూడా కాళ్లు రెండూ స్వాధీనములో లేవు. ఆయన పడుతున్న బాధను ఆమె మనసెంత కష్టపడుతున్నదో మనము ఊహించలేము. కనుకనే చిత్రకారిణి ఆ విధముగా ఆమె సానుభూతిని అర్థించింది. అదిగాక రూజువెల్టు సతీమణి ప్రఖ్యాత రచయిత్రి. అమెరికా దేశపు పత్రికలు అనేకము ఆమె కొరకు ఒక కాలమ్ ప్రత్యేకించాయి. సాటివనిత తన సంసారపుగోడు చెప్పుకొని, చేతనయిన సహాయము చేయవలసినదని అర్థించితే ఆమె కాదనగలదా? "నా చేతనయిన సహాయము చేస్తాను" అని జవాబు వ్రాసింది. ఆమె పెనిమిటి రూజువెల్టు 1945 ఏప్రిల్ వరకు అమెరికాకు ప్రెసిడెంటు. సామాన్య దృష్టితో చూసినట్లయితే, ఆమెకు, చిన్న చిన్న సంసారాలలోని కష్టాలు అర్థము కావటము దుర్ఘటము. అందులోనూ చిత్రకారిణి కోరిన సహాయము చేయటముగాని, ఆ విధానముపైన గాని ఆమెకు అగౌరవము కలిగినా ఆశ్చర్యములేదు. కాని రూజువెల్టు సతీమణి విశాల హృదయ; అనుభవజ్ఞురాలు. చిత్రకారిణి కృషికి ఆనందించి అభినందించింది.

కాని మనకింకా ఆ దశ రాలేదు. పని చేయటములో ఉన్న గౌరవాన్ని మనమింకా గ్రహించలేకుండా ఉన్నాము. దానిని మనము న్యూనతగానే భావిస్తున్నాము. మన హృదయాలలో ఆ భావన ఒక మూల ఇంకా ఉండనే ఉన్నది.

మన సామాన్య కుటుంబాలలో రెండు రకాలు ప్రధానంగా కనబడుతూ ఉంటాయి క్రిందినుంచి పైకి వస్తున్నవీ, పైనుంచి క్రిందికి దిగజారినవీ. మొదటి రకానికి చెందినవారు ఏ విధముగానయినా సంసారాన్ని అభివృద్ధికి తీసుకొని రావలెననే అభిలషిస్తారు. దానికి అనేక మార్గాలు కనిపెట్టి స్త్రీలు పురుషులు కృషిచేసి, ప్రయోజనాన్ని సాధించుకుంటారు. గాని అలా సాధించుకోవటము న్యూనతగా భావించరు. కృషిని ఎప్పటికప్పుడు సింహావలోకనము చేసుకొంటారు. ఫలితము వీసముగాని పరకగాని వాళ్లకు ఆహ్లాదకరముగానే ఉంటుంది. అమితోల్లాసముతో పిల్లలు పెద్దలు క్రొత్తక్రొత్త పథకాలను తిరిగి అన్వేషిస్తారు.

ఇక రెండవరకము పైనుంచి దిగజారినది. యమయాతన ననుభవిస్తుంది. ఈ తరానికి పై తరమువారో - ఆ పై తరమువారో పెద్ద పదవులలో ఉండటము సంభవిస్తుంది. వాళ్లు నాలుగుతరాలవరకు సరిపడ్డ గౌరవాన్ని సంపాదిస్తారు. ధనమువిషయములో ఎంతో జాగ్రతకలవారైతే తప్ప, మరొక తరానికయినా ఇంతో అంతో మిగల్చలేరు. ఆ తరమువరకూ ఆ కుటుంబాల దర్జా సాగిపోతుంది. రెండవతరానికే సామాన్యంగా అవి ఇంగువకట్టిక గుడ్డలవుతాయి తండ్రి పెద్ద హోదాలో ఉండగా పుట్టిన బిడ్డలు సుఖముగా జీవిస్తూ అందరిమీదా అధికారము చలాయించుతూ బ్రతుకుతారు. అదృష్టవశాన వారికి పెద్దవుద్యోగాలు లభించినట్లయితే ఇంకా పైకి అల్లుకొనిపోతారు. లేనిపక్షాన ఆ స్థాయినుంచి దిగలేరు. కాని దానిని భరించలేరు. తండ్రుల హయాములో సిల్కు ఉన్ని బట్టలను ధరించి తిరిగినవారు తమ హయాములో వెంటనే బయటపడిపోతారు. కొంతమంది, ఇళ్లల్లో ఎట్లావున్నా కనీసము బయట తిరిగేటప్పుడయినా దర్జా చూపుకోగలుగుతారు. కొందరు నౌకరులను నియమించుకోనూ లేరు. ఇంటిపనులను చేసుకోనూలేరు. చేసుకొనే శక్తివున్నా న్యూనతగా భావిస్తారు

ఉద్యోగరీత్యా ఉన్నతస్థాయిని అందుకొన్న కుటుంబాలతోపాటే భూవసతిగల కుటుంబాలుకూడా దిగజారినవి ఉన్నాయి. వాటి పరిస్థితులూ అంతే. నూరు యెకరాల భూమిగల ఆసామికి నలుగురు కొడుకులు ఉన్నట్లయితే అందరూ పట్నవాసపు జీవితానికి అలవాటు పడటము, అందరూ పట్టభద్రులు కావటము సామాన్యముగా జరిగే విషయమే. అందరూ పట్టభద్రులు కావటములో ఆస్తిలో కొంతభాగము హరించుకొని పోవలసిందే. నాలుగయిదు యెకరాల భూమితో పాటు, పంపకాలలో కొంత ఋణము ఒక్కొక్కరికి వచ్చినకుటుంబాలు కూడా ఉన్నాయి. ఆస్తి తక్కువయినా చదువు చెప్పించవలసిన తమ్ముళ్లో, పెళ్లి కావలసిన చెల్లెళ్లో కొందరివంతుకు రావటముకూడా ఉన్నది. వీళ్లకు మొదటినుంచీ అలవాటయిన సుఖజీవనము ఇంటినిండా జీతగాళ్లు, దొడ్డినిండా పశువులు, కమ్మటి పెరుగు, వెన్నకాచిన నెయ్యి దుర్లభమవుతుంది. పల్లెటూరి సుఖజీవనము, పట్టణనాగరికత కొంత కాలము అనుభవించిన వారి కుటుంబము చితికిపోయినతరువాత ఉన్నది కాస్తా అమ్ముకొని ఏవో వుద్యోగాలు చేసుకుంటూ జీవించటముకూడా మనకు సంఘములో కనబడుతూనే వున్నది. భూస్వాములలో కొందరు మానసికముగా వెంటనే తేరుకొన్నవారు ఉన్నారు. చేతనయితే ఆస్తిని నిలుపుకోవటానికి ప్రయత్నించటము, విధిలేకపోతే ఆ కాస్తా అమ్మి, మనసు నిశ్చింత చేసుకోవటము వాళ్లకు సులభముగానే కనబడుతుంది. ఉద్యోగపాయాలలో పైకి యెక్కిన కుటుంబాల తరువాతసంతతి పడే అగచాట్లు కొన్ని వీరికి వుండవు. ఏపని చేయబోయినా వీరికి న్యూనతగా కనబడదు విధులవెంట కాలినడకన వెళ్ళటానికి జంకరు. గౌరవభంగమని భయపడరు.

బ్రతికి చెడినవారు ముఖ్యముగా ఆంధ్రులలో స్వల్పాదాయాలతో కుటుంబాలను నిర్వహించలేక పోయినా కొంత కాలానికి

గాని ప్రత్యామ్నాయోపాయాలను అన్వేషించ లేరు. అన్వేషించినా ముందడుగువేసి కృషి చేయలేరు. ఒక విధమైన జంకుతో వాళ్ళ మనసులు క్రుంగిపోతూనే ఉంటాయి. మణి వంటి ఇల్లాండ్రకు కొందరికి ఆదాయాన్ని వృద్ధిచేసుకొనే మార్గాలు తెలుసు. ప్రతి పనిలో తగిన కౌశలము ఉంటుంది. ఆసక్తి ఉంటుంది. కాని-కాని-ఒక్కటే అవరోధము అగేమిటంటే, 'ఈ సంగతి ఎవరైనా వింటే ఏమనుకుంటారో - చులకన చేస్తారేమోనని భయము!

ఇటువంటి మధ్యతరగతి కుటుంబాల

పౌమ్మన లేక....

ముద్దంశెట్టి హనుమంతరావు

చాలాకాలానికి మళ్ళీ విశాఖపట్నం వెళ్ళవలసి వచ్చింది అనంతంకి. ప్రయాణమంటేనే - అతనికి మహా చెడ్డ భయం. ప్రయాణసకిలోడు డబ్బుకూడా ఖర్చవుతుందని యెక్కడికీ వెళ్ళడు. కాని యీసారి విశాఖపట్నం పోవటం తప్పనిసరయ్యింది. అతని భాగస్థుడు సత్యం విశాఖపట్నం కె. జి. హాస్పిటల్‌లో వుండటంవల్ల కేవలం అతన్ని ఓసారి చూసిరావాలన్న వాంఛతో బయల్దేరాడు.

బయల్దేరాడే గాని, అక్కడ ఎవరింట్లో మకాం వేయటమో తట్టలేదు. ఇంతకుముందెప్పుడో వెళ్ళినప్పుడు స్వయాన బావమరిది అక్కడుండటంవల్ల వాళ్ళింట్లో దిగ వేశాడు కానియిప్పుడు బావమరిది అక్కణ్ణించి బదిలీ అవ్వటంతో అనంతంకి గట్టి చిక్కు వచ్చిపడింది. తనకి దగ్గరిబంధువులు, కావలసినవాళ్లు విశాఖలో యెవరెవరున్నారో ఒక్కసారి స్మృతిపథంలోకి తెచ్చుకున్నాడు ముగ్గురు నలుగురున్నారే గాని - వాళ్ళకీ తనకీ అట్టే సరిపడదు ... పోతే రైల్వే గార్డుశాస్త్రికూడా అక్కడేవున్నట్టు యిప్పుడతనికి తట్టింది .... శాస్త్రి అంతదగ్గరిబంధువు కాకపోయినా అభిమానస్థుడు ... ఓమారు అతడు శ్రీకాకుళం వచ్చినప్పుడు అనంతం యింటికి వచ్చాడు చుట్టంచూపుగా వచ్చి వెంటనే వెళ్ళిపోయాడు ... అప్పుడన్నాడు కూడా, 'మీరెప్పుడన్నా విశాఖపట్నం రావటం గాని తటస్థిస్తే మా యింట్లో ఓరోజువుండి మీరు వెళ్ళాలి .' అని అనంతంకి ఆ మాటలు స్పష్టంగా యిప్పటికీ జ్ఞాపకమున్నాయ్. తక్కిన బంధువులకంటె శాస్త్రి కాస్త మెరుగనిపించిందతనికి. ఆ వున్న ఒక్కరోజూ వాళ్ళింట్లో గడిపేయాలన్న సంకల్పంతో బయల్దేరాడు.

ఉదయం పదిన్నరకంతా విశాఖపట్నం చేరుకున్నాడు...శాస్త్రి చెప్పిన ఆనవాలు బట్టి వాళ్ళింటికి ప్రోవ తీశాడు...అట్టే శ్రమపడకుండానే వాళ్లిల్లు తెలుసుకోగలిగాడు.

శాస్త్రి సతీమణి అన్నపూర్ణ అనంతంని చూడగానే ముందుకి వస్తూ

"ఏం బాబాయ్ - యిదే రావటమా?" అంది.

"ఔనమ్మ, యిప్పుడే వస్తున్నా. మా అల్లుడేడీ?" అంటూ కుర్చీలో కూలబడ్డాడు.

"తెనుబాగికి వెళ్లారు బాబాయ్ .."

"ఎప్పుడొస్తాడూ?"

"చెప్పలేం...రేపు, లేకుంటే యెల్లుండి రావచ్చు .."

"అతనుంటాడని యెంతో ముచ్చటపడ్డాను ..ఆ మధ్య శ్రీకాకుళం వచ్చినప్పుడు మా యింటికి వచ్చాడులే నేనెప్పుడూ రావటం లేదని నిందవేశాడు... అయినా అమ్మాయ్ ప్రయాణమంటే మాటలతో పనా? ప్రయాసకి ప్రయాస వుంటుంది ..డబ్బుకి డబ్బూ మంచినీళ్ళ ప్రాయంగా ఖర్చవుతుంది ..అందుకే నేనెక్కడికీ వెళ్ళను ఏదో యిప్పుడంటే విధి లేక రావటమయ్యింది .." అనంతం యీ వుపోద్ఘాతమంతా ఒలకబోస్తూవుంటే అన్నపూర్ణకి విసుగనిపించింది ఇంతలో ఆమె అయిదేళ్ళ చిన్న కొడుకు వడిగా నడుచుకుంటూ అనంతం దగ్గరికి వచ్చాడు. .నిజంగా అనంతం అప్పుడు చాల బాధపడ్డాడు- పిల్లలుంటారని తెలిసికూడా కనీసం బిస్కట్లయినా తెచ్చాను కాదే! అని; ఇప్పుడేం లాభం బాధపడి! అందుకే ఆప్యాయంగా కుర్రాణ్ణి యెత్తుకొని

"నీ పేరేమిటోయ్ వంతులూ?" అన్నాడు నవ్వుతూ.

"రాము..." ముద్దులొలికేట్టు చెప్పాడు అబ్బాయి...

"అచ్చంగా మీ నాన్న పోలికే" అంటూ

★ తీరికసమయాలలో ద్రవ్యార్జన ★

వారికి ఆర్థిక సగుపాయాలను కలిగించటానికై అగ్గిపెట్టెల కర్మాగారాలు దేశములో అక్కడక్కడ స్థాపింప బడుతున్నాయి. స్త్రీలు గడపదాటకుండా, తీరిక సమయాలలో ఈ పనులు చేసి ఆదాయాన్ని వృద్ధి చేసుకోవచ్చు.

ప్రతి మహిళా సమాజమూ ఒక విక్రయశాలను అనుబంధముగా ఏర్పరచుకొన్నట్లయితే దాని ద్వారా స్త్రీలు తమతమ చేతి పనులను రెండవకంటికి వాళ్ళకు తెలియకుండా విక్రయించటానికి వీలవుతుంది ఊరగాయలు, అప్పడాలు, వడియాలు, పేకిలు, చట్నీపొడి, అన్నపుపొడి, చారు, పులుసుపొడి, మొదలైనవి పరిశుభ్రముగా తయారుచేసి విక్రయానికి పెటవచ్చు ఈ విధముగానే కుట్టుపనులు వచ్చిన స్త్రీలు తాము తయారు చేసిన వస్తువులకు ధరలు వేసి, విక్రయశాలలో అమ్మకానికి పంపవచ్చు. స్త్రీలకు కావలసిన సరకులు, వస్తువులు స్త్రీలచేత తయారుచేయబడిన వాటిని విక్రయించటానికి మహిళా సమాజాలు పూనుకొన్నట్లయితే సామాన్య స్త్రీలకు కొన్ని వసతులను కల్పించినవి కాగలవు. ఈ విక్రయశాలలలో, స్త్రీలకు తీరుబాటయిన సమయాలలో, విక్రయించటానికి స్త్రీలనే వేతనాల మీద నియమించవచ్చు దీనివల్ల కొంతమందికి విక్రయశాలలలో పనిచేసే అవకాశము లభించుతుంది గుంటూరులోని శారదానికేతనములో ఈ విధానము ప్రవేశపెట్టబడినట్లు తెలియవచ్చినది. ఇది సంతోషకరమైన వార్త

పెట్టుబడి పెట్టి వస్తువులను తయారు చేయలేని వారిచేత, సమాజాలే పెట్టుబడి పెట్టి తయారు చేయించాలి ఆ స్త్రీల వద్ద ఉన్న పాటవము ఉపయోగపడేటట్లు చూడాలి ఒక గ్రామములో గాని ఒక నగరములో గాని ఒక మహిళా సమాజము స్థాపింపబడినట్లయితే ఆ ప్రాంతపు స్త్రీల అవసరాలన్నీ దాని ద్వారా తీరవలసినదే స్త్రీలు తమకు సహజము గావున్న పరిపాలనాదక్షత, ప్రజ్ఞ సమాజ నిర్వహణములో కనబరచినట్లయితే వాటిని సార్థకపరచటమే కాకుండా, స్త్రీజనానికి ఆరోగ్యకరమైన చింతనను కలిగించినవారు కూడా అవుతారు. ★

అబ్బాయిని హృదయానికి హత్తుకున్నాడు అనంతం. అన్నపూర్ణ తృప్తిగా నవ్వింది. తన పిల్లల్ని చూసి యెవరన్నా ముచ్చట పడ్డా కూడా అంటే ఆమె ఆనందం వర్ణనాతీతం! ఏ తల్లికైనా ఆ ఆనందం వుంటుంది గాని యీమె ఆనందం మరో రెండుమెట్లు పైనుంటుంది...

గోడగడియారం అప్పుడే టంగ్! టంగ్! మని పదకొండు గంటలు కొట్టింది.

"లేచి మడికట్టుకోండి బాబాయ్-భోంచేద్దురుగాని" అంటూ వంటగదికి వెళ్లిపోయింది అన్నపూర్ణ...

అన్నపూర్ణ అదోతరహా మనిషి. ఎగుటి మనుషుల మొహాన యేమీ అనదు... కాని వాళ్ల పరోక్షంలో వారిపైగల కసి వెళ్ళగక్కుకొంటుంది తనవాళ్లు యెవరన్నా చుట్టంచూపుగా వస్తే బాధలేదుగాని, దూరపుబంధువు లెవరన్నా ఖర్మంచాలక వచ్చారా, వాళ్ల మొహాన కొకపోయినా, వాళ్ల వెనక ఆడిపోసుంది...తమాషా యేమిటీ అంటే ఆమెని చెడ్డగా అభిప్రాయపడిన వాళ్లు యింతవరకూ యెవ్వరూ లేరు. ముఖప్రీతి బాగా అలవర్చుకోవటమే ఆమెలో వున్న గొప్పతనం!

అనంతం భోజనం ముగించిన తరువాత తుష్టిగా త్రేన్చుకుంటూ వాలుకుర్చీలో కూర్చున్నాడు. కాస్సేపు కళ్ళుమూసి నిద్రకోసం ప్రయత్నించాడు. వీధినుండి చల్లని గాలి సోకుతూవుంటే అతని ప్రయత్నం ఫలించింది. కాని యింతలో 'రాము' రావటముతో నిద్రాభంగమయ్యింది. మధ్యాహ్నంపూట ఒకసారి నిద్రనుండి మెలకువ వచ్చిందంటే చచ్చినా మరి నిద్ర పట్టదు అనంతంకి మొదట్నుంచీ యీ అలవాటు ఆచరణలోకి వచ్చింది 'రామూ'ని వళ్లోకి తీసుకుని ఓమారు గడియారం వేపు దృష్టిని ప్రసరించాడు. ఒంటిగంటయింది. కాస్సేపయినా నిద్రపట్టినందుకు సంతసించాడు.

పనులన్నీ పూర్తి చేసుకుని అన్నపూర్ణ అక్కడికొచ్చి, అలా తీరుబడిసమయంగనుక చాప వేసుకొని కూర్చుంది.

"పెద్దబ్బాయి వుండాలి - యేడీ అమ్మాయ్?" అన్నాడు అనంతమే

"బడికి పోయాడు బాబాయ్..." అందామె.

"శ్రద్ధగా చదువుకుంటున్నాడుగదా!"

"ఆ! యేదో చదువుకుంటున్నాడింత వరకు...ముందు ముందు యేం చేస్తాడో గాని —"

"ఈసారి యెప్పుడన్నా అల్లుడూ, నువ్వూ కలిసి మావూరు రండమ్మాయ్... వచ్చిపోతుంటేనే బంధుత్వాలు - చుట్టరికాలూను" అన్నాడు అనంతం.

తనయింటికి వచ్చేబంధువులంతా ఇలాగే ఓమాట అనేసిపోతారు...తను యెక్కడికీ వెళ్లదు గనుకనే తెలిసి తెలిసి అట్లా మాట వరుసకి అనేస్తున్నారని ఆమె అనుమానం.

ఆమె నవ్వింది. "మీ కోపాటి దయ వుంటే అంతేచాలు బాబాయ్...ఎక్కడికి పోవాలన్నా నాకు ప్రతిబంధకాలు యెక్కువ...మావాళ్లింటికి వెళ్లడానికే వీలుండదు..."

"అలాగంటే యెలాగమ్మాయ్...ప్రతిబంధకాలు లేనివాళ్లెవరున్నారు...? అవి మనల్ని తప్పించుకుండేట్లు మనం ప్రయత్నించాలిగాని..."

"అది నావల్ల కాదు బాబాయ్...సంసారం బాధ్యతంతా నా నెత్తినే పడేశారాయన ఆయన వుద్యోగమేమిటో ఆయంది ..రోజుకి రోజూ నాకు చికాకనిపిస్తుంది... బదిలీ చేయించుకోమని నేనెంత మొఱబెట్టుకున్నా ఆయన వినకుండా వున్నారు..." ఏ విషయం మాట్లాడుతూ యే విషయానికి వచ్చిందో ఆమెకి తెలీకపోలేదు...

"ఇక్కణ్ణుంచి బదిలీ యేమిటమ్మాయ్! యీవూరు రావాలని యెంతో మంది ప్రయత్నిస్తుంటారు!" ఆశ్చర్యంగానే అన్నాడు అనంతం.

"అందరికీ మంచి స్థలమేగాని, మా విషయంలో మాత్రం చెడ్డదే! మీరు మరేం అనుకోకండి బాబాయ్ మీరొచ్చారని కాదు గాని, యేమిటీ, యెప్పుడూ యెవరో బంధువులో స్నేహితులో వస్తూనే వుంటారు. ఆసుపత్రికని, యూనివర్సిటీకని, యెవరో నాయకులొస్తున్నారు చూడాలని, ఒకటేమిటి యిల్లాంటి వెన్నో కారణాలు చెప్పుకుని వస్తుంటారు .. వచ్చినవాళ్ళని పొమ్మనలేంగా! పోనీ వచ్చినవాళ్లు ఒక పూటలో పోతారా? అదీ లేదు...రెండు మూడు రోజులు తిష్ఠవేస్తారు. మీరే ఆలోచించండి బాబాయ్ ..యీ కరువు కాలంలో అందర్నీ ఆదరించుకొని మనలాంటి వాళ్ళం కూర్చోగలమా? ఇంతా మనం ఆదరిస్తామనుకోండి — మొగమాటానికైనా మన పిల్లల చేతిలో ఓ బిస్కట్టు ప్యాకెట్ పెట్టడానికి కూడా వాళ్లకి తాహతుండదు. తాహతుండక కాదులెండి-ఆ యింగితం లేక." అని చిన్న వుపన్యాసం ఇచ్చింది అన్నపూర్ణ

అనంతంకి ముచ్చెమటలు పోశాయి తనని యేమీ అనుకోవద్దని మొదటే చెప్పింది గాని తన యెదుట అనవల్సిన మాటలేనా యివి! ఎంత నిర్మొహమాటపు మనిషి! తను యిక్కడికి వచ్చి చాల పొరపాటుచేశాడు...ఇంకెవరింటికీ వెళ్ళకపోతే హోటల్లో తినవల్సింది .. అనుకున్నాడు ... వంటి మీదున్న ఖద్దరు బనియను పూర్తిగ తడిసి ముద్దయింది మొహం నిండా చేరిన చిరుచెమట ఓసారి తుండుగుడ్డతో ఒత్తుకుని.

"అబ్బ! గాలన్నది లేదు ... సముద్రపు ఒడ్డునవున్న యీ ప్రదేశంలోనే యిలా వుంటే యింక మావూరుసంగతి వేరే చెప్పాలా? ఆఁ అన్నట్టు అమ్మాయ్! వేళవుతోంది... యిక నే నలా వెళ్లి వస్తాను..." అంటూ అబ్బాయిని క్రిందికి దించివేశాడు. ఇంక అక్కడుండటం కష్టమనిపించింది. అలాగని పూర్తిగా మకాం యెత్తేయలేడుగా!

"కాస్త యెండ తీవ్రత తగ్గనీయండి బాబాయ్...వెళ్దురుగాని; ఆసుపత్రి కెక్కడ దూరముంది గనుక నా: యీలోగా కాఫీ కొద్దిగా కాచియిస్తాను" అంటూ తనూ లేచి నించుంది అన్నపూర్ణ.

"ఇప్పుడు నాకేం కాఫీ వద్దమ్మాయ్.." ముక్తసరిగా అన్నాడు అనంతం.

"మీకోసం ప్రత్యేకంగా పెట్టడం లేదుగా కాఫీ! ప్రతిరోజూ మేం కాఫీ త్రాగుతాం...పోతే యెవరో ఒకరు వుంటనే వుంటారు ..అందుకే మా అల్లుడు నెలకి ఐదువీశెల చీనీ ఒకేసారి తెచ్చి [illegible] చేస్తారు. ఇంతచీనీ నెలాఖరుకి నిండిపోతుంది రెండు కాఫీడబ్బాలు, ఒక్కో నెల చాలవుకూడాను. ఆయనకి డికాక్షను ఘాటుగా వుండాలి .. అదీగాక యెవరికైనా నీళ్లలాంటి కాఫీ యివ్వటం నాకు సిగ్గేస్తుంది..." అంది అన్నపూర్ణ.

అనంతంకి అరికాలిమంట నెత్తికెక్కింది. ఈ వివరాలన్నీ సమగ్రంగా యీవిడ నెవరు నివేదించమన్నారు? ఆమె అభిప్రాయం, పరాయివాళ్లు వస్తూ పోతుండడం వల్లనే యింత ఖర్చవుతుందని గామోసు! అనుకొని కాఫీకి యింక వుండదల్చుకోలేదు...

"ఆసుపత్రికి ఇప్పుడే వెళ్లను లే అమ్మాయ్. మరో స్నేహితుడు ఇక్కడే వున్నాడు... ఆ విషయం మొదట నాకు తెలీదు...ఇందాక బండిదిగి వస్తుంటే కలిసి మధ్యాహ్నం వాళ్లింటికి రమ్మని మరిమరీ చెప్పాడు... వెళ్లకపోతే బావుండదుగా!" అంటూ దుస్తులు ధరించేందుకు వుపక్రమించాడు అన్నపూర్ణ అట్టే బలవంతపర్చదల్చుకోలేదు గామోసు - వూరుకుంది ... దుస్తులు వేసుకున్నాక ఆమెతో చెప్పి బయలుదేరాడు. నిజానికి అతని కింకెవరూ స్నేహితుల్లేరు...వున్నవాళ్లెవరో బంధువులే గాని; ఏ స్నేహితుడూ ఉదయం తారసపడలేదు. అయినా అలా అబద్ధం చెప్పక తప్పిందికాదాసమయంలో. ఎండ తీవ్రంగా వున్నా, రిక్షా చేయించుకుని తిన్నగా హోటలుకి పోయాడు ... మరెందుకూ కాదు - కాఫీ త్రాగేందుకు. అంతే!

* * *

★ పొమ్మనలేక.... ★

ఆసుపత్రిలో తన భాగస్తుణ్ణి కలుసుకుని, యింకా అక్కడక్కడ బజార్లో తిరిగి, అతి జ్ఞాపకంగా ఒక బిస్కెట్ల ప్యాకెట్ కొని శాస్త్రి యింటికి తిరుగుముఖం పట్టాడు అనంతం. బిస్కెట్లు కొనాలన్న విషయం కొనేవరకూ నెమరు వేసుకుంటూనే వున్నాడు. ఔను మరి! అందర్నీ అతని యెదుటే నిందిస్తుంటే అదే నిందని అతనెందుకు భరిస్తాడు! అందుకని తప్పనిసరిగా కొన్నాడు

సాయంత్రం అయిదు గంటలకి యిల్లు చేరుకున్నాడు. ఇల్లు చేరుకున్న వెంటనే అగుపించిన రామూకి బిస్కెట్ల ప్యాకెట్ అందించాడు. ఆ అబ్బాయ్ చెంగు చెంగున గంతులేసుకుంటూ రెండు చేతుల్లో ప్యాకెట్ని అదిమిపట్టి తల్లిదగ్గిరికి చేరం చేశాడు. కొడుకు చేతిలో బిస్కెట్లు చూసిన అన్నపూర్ణ అబ్బురపడి యింట్లోకి వచ్చింది. ఆమె భయమంతా యింకెవరు కొత్త చుట్టాలు వచ్చారోనని. బట్టలు మార్చుకుంటున్న అనంతంని చూసి ఆమె నిబ్బరపడింది. ఆ బిస్కెట్లు బాబాయ్ తెచ్చినవేనని అర్థం చేసుకుంది...

"మాటవరుసకే అన్నాను గాని, అంతలో మీరు బిస్కెట్లు తెచ్చి పెట్టాలా బాబాయ్!" అంది చిన్నగా నవ్వుతూ. మొదట్లో బాబాయ్ యెదుటే అలాంటి మాటలు యెందుకన్నానా, అన్న బాధ ఆమెలో లేశమైనా లేదు.

"నువ్వన్నావని తెచ్చాననుకుంటున్నావా పిచ్చితల్లీ పిల్లలంటేనే, నాకు ముచ్చట...సాధారణంగా నేను బజారుకి పోయానంటే వట్టి చేతుల్తో రాను..." అన్నాడు తన గొప్పతనాన్ని చెప్పుకునే ప్రయత్నంలో. అవుతే అతను చెప్పింది నిజమూ అంటే, కాదు—అనవసరంగా అర్థణా ఖర్చు పెట్టడానికి భయపడే అనంతం పిల్లలపై వున్న మమతవల్ల రూపాయికి పైన ఖర్చు పెడతాడనటం శుద్ధ అబద్ధం! అవుతే యిప్పుడెందుకు తెచ్చాడూ అంటారేమో! 'తప్పనిసరి.' అన్నపూర్ణ ఆ విషయంలో యింకేమీ అనలేదు. అనదు కూడాను!

"కాఫీ కాస్త త్రాగుతారా బాబాయ్?" ఆపాటి అభిమానమున్నా 'యిష్టం' చూపించకపోతే బావుండదని అంది అన్నపూర్ణ. కాఫీ తాగుతారా? భోజనం చేస్తారా? వట్టి కూరలే తింటారా! అన్నం వడ్డించాలా?...యిలాంటి ప్రశ్నలన్నీ వేస్తే యెవరైనా యెలాంటి జవాబు ఇస్తారు?

"ఇప్పుడేం కాఫీలే అమ్మాయ్ స్నేహితుడింట్లో యిప్పుడే కాఫీ పుచ్చుకుని వస్తున్నా" జాగర్తగానే జవాబిచ్చాడు అనంతం అన్నపూర్ణ వెళ్ళిపోబోయింది వంటగదికి.

"అల్లుడు యెప్పుడొచ్చేదీ యింకా నిశ్చయంగా తెలీదు కదమ్మాయ్..." అన్నాడు అనంతం. ఆ విషయం అన్నపూర్ణకి తెలుసు...తనకి తెలిసింది చెబితే ఆ ముసలాయన తప్పకుండా తిష్ఠవేస్తాడని ఆమె భయం! నిజానికి, శాస్త్రి ఆ రాత్రో లేక మరుచటిరోజు వుదయమో తప్పక వచ్చేస్తాడు...అలాగని చెబితే అనంతం వుండిపోతేనో!...ఆలోచించింది అన్నపూర్ణ... అసలు, యీ విషయం మొదటే అబద్ధం చెప్పింది. ఇప్పుడూ అలాగే చెప్పాలనుకుంది.

"నిశ్చయంగా తెలీదు బాబాయ్. అతని వుద్యోగానికి వేళా, పాళా, అంటూ ఉండదు. ఎప్పుడొచ్చి యెప్పుడు వెళ్తారో అంతకంటే నిశ్చయం వుండదు. రేపు యెలాగూ రారు...ఎల్లుండికి రావచ్చు... అదీ సాయంత్రం!" అంది

"అవుతే నేను ఆయనకోసం చూడ్డం అనవసరం...అందుకని రాత్రి బండికి వెళ్ళిపోతానమ్మాయ్." అన్నాడు అనంతం.

"ఈవాళేగా వచ్చారు! యేమంత తొందరొచ్చిందని - రేపు వెళ్ళిపోండి బాబాయ్.." అంది అన్నపూర్ణ. లోలోపల అతను వెళ్ళిపోవాలన్న వాంఛ వున్నా బయటికి అలా అనకపోతే బావుంటుందా? అని ఆమె అభిప్రాయం. అలా అన్నంత మాత్రాన అనంతం వుండిపోయే ఘటం కాదు...ఇతఃపూర్వం అన్నపూర్ణ నివేదించిన వుపన్యాసం అతణ్ణి యెంతో కలత పర్చింది.

"దానికేముందిలే అమ్మాయ్...యీసారి యెప్పుడన్నా వస్తాను" అంటూ వాలు కుర్చీలో చేరగిలబడ్డాడు.

"సరే మీ యిష్టం.. వంట యెలాగూ పూర్తయింది. మీ రెప్పుడు వడ్డించమంటే .." అని చెప్తూంటే అనంతం అందుకుని—

"ఏడు గంటలకి యేదో బండి వుందట - మరో అరగంట పోయాక భోంచేస్తాను" అన్నాడు...

"అలాగే బాబాయ్" అంటూ వంటగదికి వెళ్ళిపోయింది అన్నపూర్ణ. అనంతం యెంతోసేపు ఆమె మనస్తత్వాన్ని తర్కించుకుంటూ కూర్చున్నాడు.

అరగంట సరిగ్గా దాటంగానే మడి కట్టుకొంటూ చెప్పింది అన్నపూర్ణ. అనంతం లేచి మడికట్టుకుని కాళ్ళు కడుక్కుని విస్తరిముందు కూర్చున్నాడు.

అన్నపూర్ణ నెయ్యి వడ్డిస్తూ "మొన్ననే గుంటూరునుండి యీ నెయ్యి తెప్పించాం బాబాయ్...బోలెడు ఖరీదు......అయినా రుచిగా వుంటుందని తెప్పించాం!" అంది.

అనంతం మనసు చివుక్కుమంది.

"బావుందమ్మాయ్ నేయి" అన్నాడు విధిగా.

"మరి కాస్త నేయి వడ్డించనా?" అందామె నేయి గిన్నె పట్టుకోకుండానే. అనంతం యింక వడ్డించమంటాడూ!

"అబ్బే! వద్దమ్మాయ్...చాలు" ముక్తసరిగా అన్నాడు.

"ఈ బియ్యమున్నాయ్ చూశారూ! మేలు రకపు బియ్యం...మణుగు యిరవై యెనిమిది రూపాయలో, యెంతో అన్నారు...... మామూలు ధరవి అమ్ముతున్నారు గాని, మనం తినలేం బాబాయ్...మాకు ఎక్కువ బియ్యం పట్టినా యివే యెప్పుడూ కొంటుంటాం. నెలకి రెండు మణుగులు బియ్యం పడతాయ్..." అంది తనకి తానుగా.

నిజంగా అప్పటి అనంతం అవస్థ వర్ణనాతీతం. అన్నం తిన బుద్ధి పుట్టింది కాదు. అయినా ఆమె యేమనుకుంటుందోనని యెలాగో యెంగిలిపడి మజ్జిగ వేసుకోకుండానే లేచిపోయాడు.

"మజ్జిగ వేసుకోరూ బాబాయ్?" అందామె.


"కొద్దిగా జలుబు చేసినట్టుందమ్మాయ్.. అందుకని మజ్జిగ వేసుకుందుకు భయమేస్తున్నది..." అంటూ వెళ్ళి చేయి కడుక్కున్నాడు.

ఇంక ఒక్కక్షణం కూడా వుండదల్చుకోలేదు...త్వరలో బట్టలు వేసుకుని "వస్తానమ్మాయ్...స్టేషను చేరుకునేసరికి యేడవుతుందేమో! అల్లుడొస్తే నే నొచ్చానని చెప్పు" అంటూ బయల్దేరాడు...వెళ్తున్నప్పుడు యిద్దరు అబ్బాయిలకీ 'వెళ్తున్నా పంతుళ్ళూ!' అని నవ్వుతూ చెప్పాడు కూడాను.

"ఎంత చెప్పినా వుండనంటున్నారు... యేం చేస్తాం! ఈ వూరు మళ్ళీ యెప్పుడన్నా వస్తే మా యింటికి తప్పకుండా రండి బాబాయ్" అంది అన్నపూర్ణ వెళ్ళిపోతున్న అనంతంతో.

"అలాగే!" అంటూ వడివడిగా నడిచిపోయాడు అనంతం. అంతే! మళ్ళీ యెప్పుడూ శాస్త్రిగడప తొక్కలేదు!

★



ఎత్తుకు పై ఎత్తు

అలపర్తి వెంకటసుబ్బారావు

ముత్తడనే బాలుడొకడు
ఎత్తులెన్నొ వేయుచుండు!
ఎదుటివారు మోసపోవ
ఎకసక్కెము జేయుచుండు!

ముత్తడిటులె ఒక్కనాడు
మురుగు గుంట ప్రక్కనిలచి
దేనికొఱకొ వెదకుచున్న
వానిలాగ నటియించెను!

ఆదారిని వచ్చుచున్న
అప్పారావను బాలుడు,
"దేని కొఱకు వెదకుచుంటి"
వని అడిగెను ముత్తడినీ!

"'పెన్సిలు' గొన తెచ్చుకొన్న
బేడబిళ్ళ పోయెనోయి!
బహుశా యీ మురుగులోన
పడివుండును బేడబిళ్ళ!"

అని, ముత్తడు చెప్పగాని
అప్పారావూ వెదకెను
సహాయపడవలయుననెడి
సదుద్దేశము మది గలుగ!

"పోతే పోయింది బేడ
పోతున్నానోయి నేను!
పెన్సిలొకటి కొనవలయును
'సైన్సు' బొమ్మ వేయవలెను.

"అమ్మమ్మను మరోబేడ
అడిగి తెచ్చుకొందు" ననుచు
అప్పారావుతో ముత్తడు
చెప్పి వెళ్లె నచటినుండి!

అప్పారావటు పిమ్మట
అటులె వెదకె కొంతసేపు
కానీ, అట బేడ బిళ్ళ
కానిపించలేదు - అంత

"ముత్త డిపుడు యీరీతిగ
ఎత్తువేసినాడు గనుక
ఎత్తుకు పై ఎత్తువేసి
పడిపింతు వాని నిపుడె!"

అని, తలచిన అప్పారావ్
చనెను ముత్తని గృహామునకు!
అంత, అడిగినాడు యిట్లు
అప్పారావును ముత్తడు,

"ప్రియమిత్రుడ! వచ్చినావు
బేడబిళ్ళ దొరికినదా?"
అప్పారా వందుపైన
చెప్పాడీ రీతిగాను,

"ఎంత వెదకినాగానీ
అంతు దొరకలేదు బేడ
పైగా, నాజేబులోని
పావలా పడిపోయినది!"

అప్పారావటు పిమ్మట
అచటినుండి వెళ్లిపోయె!
పావలా వెదుక ముత్తడు
బయలుదేరి నాడంతట!

గంటల తరబడి ముత్తడు
గాలించెను మురుగుగుంట!
కానీ, పావలాబిళ్ళ
కానిపించలే దతనికి!

ముత్తడపుడు తెలుసుకొనెను
ఎత్తుకు పై ఎత్తు అనుచు!
కత్తి వేటుకు ముఖమందు
నెత్తు రొక్క చుక్కలేదు!



హంసగీతం

అంచలకు మధురమ్ము లైన కంఠములుండు
నంచు వేమారు విన్నట్టియొక పౌరుండు,
విపణి వీథికిపోయి, విలిచె కడు వెల యిచ్చి,
అపురూప రూపయగు హంసగని మదిమెచ్చి.

మందారవనమందు మధ్య కేళాకూళి
సందాల రాయంచ అలవోకగా తేలి,
తెలి తామరల నడుమ తెలి తామరనిపించు,
నెలవంకనీటిలో నిలుచుండె ననిపించు.

కతిపయదినాలిట్లు గడువ నొక చెలికాడు
అతిథియై ఆయింటి కరుదెంచె నొకనాడు.
మృష్టాన్నమిడి ఆదరించె మిత్రుని గేస్తు ;
హృష్టుడై మధువాని త్రేన్చి నాడా నేస్తు.

పిదప యజమాని రావించి తనరాయంచ
"బదమొకటి హాయిగా పాడు"మని యర్థించ,
నోరుమెదపక, మూగ నోము పట్టెనా గాని,
మారాడదాయె పలు మారు లడిగినగాని.

అదిచూచి వెకిలిగా అతిథినవ్వుచు జనెను;
మది నొచ్చుకున్న యజమాని కడుసిగ్గిలెను.
అదలించి బెదరించి యతడూరకొనె విసిగి,
పెదవి విప్పక హంస భీతిల్లె నొదిగొదిగి.

కొంతకాలము గడువ కొలనిలో హంసకును
అంతకాలము ప్రాప్త మయ్యె విధి వశమునను.
అంతనా రాయంచ అమృతగళమెత్తినది;
వింతగా వీనులకు విందుగా పాడినది.

ఖేదమోదములు సంకీర్ణమై, నాదనది
రోదోంతరము నిండి మ్రోయగా పాడినది.
రాలు కరగించు మధురమరాళగానమ్ము
గాలి దేలగ, మిగిలె, కదలేని మౌనమ్ము.

గృహగవాక్షము నుండి గృహమేధి పాటవిని,
గ్రహియించె, జాలి జాలై వారగా మదిని,
"సాజముగ హంస యవసానమున పాడు"నని,
నైజగుణములు మాన్ప నరులేరునేర"రని.

(హంస మరణం సమీపించిందని తెలిసినప్పుడు గానంచేస్తుందని గ్రీకుల నమ్మకం.)

ఈసప్ కథలు : 21

నండూరి రామమోహనరావు



కావ్యకళయు, చిత్రకళయు,
శ్రావ్యమైన గానకళయు,
అవ్యాజములై నపుడే
అవ్యయమ్ములగుచు వెలయు.

బాలసాహితి సీరియల్ ......

మార్టిన్ రాట్లర్

మూలం: ఆర్. ఎమ్. బాలన్‌టైన్

5

నాలుగేళ్ళు గడిచాయి. ఆ నాలుగేళ్ళలో ఆక్స్‌ఫర్డ్ గ్రామంలో వృద్ధుల తలలు నెరిశాయి; బాలుర కండలు కొత్త పుష్టి చేకూర్చుకున్నాయి; కొన్ని యిళ్ళలోకి మృత్యుదేవత కూడా తొంగిచూసింది. మరికొన్ని యిళ్ళలో దుఃఖదేవత నివాసం ఏర్పరచుకుంది.

మార్టిన్ రాట్లర్ ఈ నాలుగేళ్లలో ఎన్నిసార్లు అడిగినా, నౌకాయానం చేయడానికి పెద్దమ్మ ఒప్పుకోలేదు. అందుచేత విధిలేక చదువు సాగించవలసి వచ్చింది. గ్రీకు, లాటిన్ భాషలు అతనికి కొరుకుడు పడలేదు. వ్యాకరణంకంటె మరణం మేలని నిశ్చయించుకున్నాడు. వాస్కోడిగామా, కొలంబస్ వంటి అతని ఆరాధ్య పురుషులపేర్లు వచ్చినప్పుడు తప్ప మిగతా అప్పుడు చరిత్రను చెత్తగా జమకట్టేవాడు. భూగోళం అంటే మాత్రం అతనికి మంచి శ్రద్ధ. లెక్కలు, జమాఖర్చులు వ్రాయడం అతనికి అభిమాన విషయాలు. పెద్దమ్మ చిట్టా పుస్తకాలు అతనే నరిచూసేవాడు. అందులో అతని శ్రద్ధ జాలీబోయ్‌గారికి కూడా చాలా సంతోషం కలిగించింది.

మార్టిన్ కిప్పుడు పధ్నాలుగోయేడు. ఈడుకు మించిన ఒడ్డూ, పొడుగూ ఉండి బడిలో విద్యార్థులందరికీ అతడు ఒక మహా నాయకుడులాగ కనిపించేవాడు. ధైర్యం, శౌర్యం, వాటికి తగిన మంచితనం అతన్ని అందరికీ ఇష్టుడుగా చేశాయి. అతడు చెయ్యని పని లేదు, చెయ్యలేని పని లేదు. ఎవరితోనూ జగడ మాడే వాడు కాదు. కాకపోయినా అతని ఒడ్డూ, పొడుగూ చూసినవా శ్ళెవరూ అతనితో జగడంపెట్టుకునేవారు కారు. ఇతరబాలు రెవరైనా దెబ్బలాడుతుంటే అడ్డు పడి మాన్పించేవాడు. తగినంత కారణం ఉన్నప్పుడు మాత్రం దెబ్బలాడనిచ్చేవాడు. అటువంటప్పుడు తాను పక్కన నుంచుని అన్యాయం జరగకుండా చూచేవాడు. అతనిలో ఒక వింత గాంభీర్యంకూడా కనపడేది. పెద్ద అవుతున్నకొద్దీ ఉత్సాహం ఎక్కువైంది; అల్లరి తగ్గింది.

బాబ్ క్రోకర్ కూడా ఇంకా ఆ బళ్లోనే చదువుతున్నాడు. తెలివైనవా డవడంచేత మార్టిన్‌తో విరోధం పెట్టుకోక స్నేహంగానే మసులుకుంటున్నాడు. కాని, ఆనాటి "పెద్ద కుస్తీ" మాత్రం మరిచిపోలేదు. మనసులో అప్పటి పగ తాలూకు పొగ ఇంకా కమ్ముకునే ఉంది.

ఒకరోజున బాబ్ క్రోకర్ మార్టిన్‌ను పిలిచి "నేను బిల్టన్ పట్నానికి పోతున్నాను. నువ్వుకూడా వస్తే రా. రకరకాల నౌకలను చూడవచ్చు," అని ఆహ్వానించాడు.

"రావడానికి అభ్యంతరం లేదు. నాకూ తిరగా

అనువాదం: నండూరి రామమోహనరావు

లనే ఉంది. రాత్రి పొద్దుపోయినదాకా ఇంటికి కూడా వెళ్ళవలసిన పనిలేదు," అన్నాడు మార్టిన్.

ఒక గంటలో ఇద్దరూ బిల్టన్ రేవుపట్నం చేరారు. సముద్రపు ఒడ్డున తిరుగుతూ నౌకలను పరిశీలిస్తున్నారు. అలా పోతూఉండగా ఒకచోట నరంగుల పాడవిడి, కేకలు వినబడి ఆగారు.

"అదుగో మార్టిన్, అదే 'ఖద్యోతనౌక' దక్షిణ సముద్రాలకు ప్రయాణమైపోతోంది. పోయి చూసివద్దామా? నీ స్నేహితుడు బార్నీ ఓఫ్లానగన్ ఆ నౌకలోనేగా పనిచేసేది?" అన్నాడు బాబ్.

"అవును. అతడు ప్రతిసారీ నన్ను తనతో సముద్రప్రయాణానికి రమ్మని బలవంతం చేస్తూ ఉంటాడు. నాకూ వెళ్ళాలనే ఉంది. కాని—పోన్లే, ఒకసారి నౌకలోకివెళ్లి అతనికి వీడ్కోలిచ్చివద్దాము,"అని మార్టిన్ అన్నాడు.

"మార్టిన్! పోనీ, పారిపోకూడదూ నువ్వు?" బాబ్ అన్నాడు. ఇద్దరూ "ఖద్యోత" నౌకవైపు పోతున్నారు.

"నేను పారిపోనక్కరలేదు. వెళ్లాలనుకుంటే వెళ్ళమని మా పెద్దమ్మ ఎప్పుడో నాకు చెప్పేసింది. కాని నేను వెళ్లిపోతే తనగుండ బద్దలైపోతుందనికూడా చెప్పింది. అటువంటప్పుడు ఆమెను విడిచి నేనెలా వెళ్ళగలను? జీవితాంతం ఏ దుక్కాణం దగ్గిరో గుమాస్తాగానే ఉంటానుగాని ఆమెనుమాత్రం కష్టపెట్టను."అన్నాడు మార్టిన్.

ఖద్యోతనౌకలోకి వెళ్ళారు. విశాలమైననౌక. చాలా దృఢంగా నిర్మితమైంది. తెరచాపలు వదులుగా వేళ్ళాడు తున్నాయి. కెప్టెన్ సరంగులకు ఆజ్ఞలిస్తున్నాడు. సరంగులు ఆయన ఆజ్ఞలు నిర్వర్తిస్తున్నట్టు కనబడుతూనే తమ తల్లులు, భార్యలు, చెల్లెళ్ళనుండి వీడ్కోలు పుచ్చుకుంటున్నారు.

"ఓడ బయలుదేరుతోంది. ప్రయాణమయ్యేవాళ్లు తప్ప మిగతావాళ్లంతా దిగిపొండి,"అని కెప్టెన్ కేకపెట్టాడు.

బార్నీ ఓఫ్లానగన్ మార్టిన్‌తో ఇలా అన్నాడు:

"నువ్వు వెళ్లకు. హార్బరు ముఖద్వారం దాకా మాతోరా. అక్కడినుంచి ఏదో ఒక చిన్నపడవలో ఒడ్డుకు వెళ్ళవచ్చు. నీతో కొంచెం మాట్లాడాలి."

ఇంతలో నౌకబయలుదేరింది. కాని సరిగ్గా ముఖద్వారం దగ్గిర ఒడ్డుపట్టింది. కెప్టెన్ కోపంతో గర్జించాడు. నౌకను కదల్చడానికి ఎంతప్రయత్నించినా కదలలేదు. మళ్ళీ సముద్రపునీళ్లు పొంగివచ్చేదాకా నౌక కదిలే అవకాశంలేదు. అంతా గందరగోళమైపోయింది. ఈ గందరగోళంలో బాబ్ క్రోకర్‌కు ఒక ఆలోచన తట్టింది. డింగీబోటు ఒకదాన్ని తీసుకుని సముద్రంలోపలికి పోదామనీ, సాయంకాలందాకా చేపలు పడుతూ హాయిగా గడుపుదామనీ చెప్పాడు.

"బావుంది. బలేఆలోచన తట్టింది నీకు. పోదాం పద, అదుగో అక్కడ బోటులో ఉన్నాడే, వాడు నాకు తెలిసినవాడే. కొద్దిగా డబ్బిస్తే వాడిబోటు మనకిస్తాడు. హాలో టామ్!"అని మార్టిన్ కేకవేశాడు బోటులోవున్న కుర్రాడు పలికాడు.

"ఇటు తీసుకురా నీబోటు. కొంచెంసేపు అలా తిరిగివస్తాము,"అన్నాడు మార్టిన్.

బోటును దగ్గిరికి తీసుకొస్తూ ఆ కుర్రాడు "వద్దండిసార్. గాలి బాగావీస్తోంది. బోటు నడపడం కష్టం" అన్నాడు.

"నాన్సెన్స్! నీకు తెలియదు ఊరుకో"అని బాబ్ క్రోకర్ వాడి దగ్గిర నుంచి తాడు అందిపుచ్చుకున్నాడు. "నువ్వు మాతో రావద్దు. నువ్వుకూడా వస్తే బరువెక్కువ అవుతుంది. మార్టిన్! నువ్వు బోటులో కెక్కు నేను తాడుపట్టుకుంటాను. ఎక్కావా? ఆ నేనూ వస్తాను. ఒకే టామ్! ఈతాడు నువ్వుపుచ్చుకో. నే నెక్కేదాకా వదలబోకు. ఎక్కిన తరువాత వదివేలేసెయ్," అని తాడును బాలుడి చేతికందిస్తూ పొరపాటున దాన్ని జారవిడిచాడు.

వెంటనే ఒక తరంగంవచ్చి ఆ చిన్నబోటును హార్బరులోంచి అవతలకు కొట్టేసింది. మార్టిన్ వెంటనే తెడ్డుతీసుకుని బోటును వెనక్కితిప్పాడు. పడవ నడపడం బాగా చేతైనవాడే; రెండునిమిషాల్లో తిరిగి వెనక్కిరాగలిగేవాడే. కాని గాలి తీవ్రంగావీస్తూ, అంతకంతకీ బోటును ఒడ్డుకుదూరంగా తోసుకుపోతోంది. ఆపడానికి ఎంతయత్నించినా ఆగలేదు. ఇక ప్రయత్నించడం అనవసరమని మార్టిన్ చెయ్యిఊపుతూ "బాబ్! ఫరవాలేదు. నేను దక్షిణాన ఉన్న అగ్రగందగ్గిరికి బోటును తీసుకువస్తాను. నువ్వు అక్కడికిరా. అక్కడి

నుంచి మళ్ళీ ఇద్దరం వెనక్కి తెడ్లువేసి వద్దాం" అని కేకవేశాడు.

బిల్టన్ హార్బరుకు మూడుమైళ్లు దక్షిణాన ఉన్నది ఒక అగ్రం అది సముద్రంలోపలికి చాలా దూరం చొచ్చుకునిఉన్నది. మార్టిన్ రాట్లర్ ధైర్యం గలవాడనీ, నేర్పుగా పడవనడపగలడనీ బిల్టన్‌లో చాలా మందికి తెలుసు. అందుచేత అతడు సురక్షితంగా ఒడ్డుకు రాగలడని భావించి అందరూ ఎవరి పనులలో వాళ్లు ఉండిపోయారు. బాబ్ క్రోకర్ వెంటనే కాలి నడకన బయలుదేరి నాలుగుమైళ్లు నడిచి దక్షిణానికి చేరుకున్నాడు.

ఈ లోగా గాలి దుమారం పెద్దదైంది. దట్టంగా మబ్బులుపట్టాయి. గాలి ప్రళయంగా వీచసాగింది. అందుచేత మార్టిన్ పాపం ఎంత బలంగా తెడ్డువేసినా, దక్షిణాగ్రాన్ని చేరలేకపోయాడు. అయినా యావచ్ఛక్తి ఉపయోగించి నడిపాడు. దక్షిణాగ్రం కనుచూపు మేరలో కనిపించింది. కాని పడవ ఎంతకూ దాన్ని సమీపించలేదు. తెడ్డువేసి వేసి అలిసి పడిపోయాడు. గాలీ, కెరటాలూ పడవను అతివేగంగా సముద్రంలోకి

తోసుకుపోయాయి. బాబ్ క్రోకర్ దక్షిణాగ్రం దగ్గర కొచ్చేసరికి మార్టిన్ పడవ దూరాన ఎక్కడో చుక్క భాగమాత్రమే కనబడింది.

అప్పుడు బాబ్ క్రోకర్ వెనక్కి పరుగెత్తుకు పోయి పట్నంలో అందరికీ మార్టిన్ సంగతి చెప్పాడు. తుపాను సూచనలు కనిపించే ఆ సాయంత్రం ఒక్కరైనా మార్టిన్ కోసం పడవలో బయలుదేరే సాహసం గలవారు కనిపించలేదు. వారికి ఈ సంగతి తెలిసేసరికే ఆ చిన్నబోటు దూరాన అదృశ్యమైపోయింది. గాలి కూడా తీవ్రంగా విజృంభించింది. బార్నీ మాత్రం బాబ్‌ను గుచ్చిగుచ్చి అడిగి, మార్టిన్ సరిగ్గా ఏ ప్రాంతంలో కొట్టుకుపోయిందీ జాగ్రత్తగా తెలుసుకున్నాడు. చివరికి ఖద్యోతం నౌక ఎలాగైతేనేం బయలుదేరింది. బార్నీ తెరచాప కొయ్యలపైకి ఎగప్రాకి అక్కడ నిలబడి ఎక్కడన్నా మార్టిన్ బోటు కనిపిస్తుందేమో పరిశీలించ సాగాడు.

చీకటి పడుతోంది. చుట్టూ విశాలమైన సముద్రంలో ఆతురతగా వెదకుతున్న నావికుడు బార్నీ హృదయంలో నిరాశ జనించింది. కెరటాల నురుగు తప్ప మరేమీ కనబడనందున అతనికి చాలా బాధ కలిగింది. విసుగు పుట్టి, నిరాశ చేసుకుని అతడు దిగి వచ్చాడు.

ఇంతలో నౌక ఒక చిన్న బోటును సమీపించింది. కొద్దిలో తప్పిందిగాని, నౌకకు కొట్టుకుని బోటు తలకిందులై పోవలసిందే. అందులో మనుషులున్న అలికిడి వినరాలేదు. అందుచేత దాన్ని ఎవరూ పట్టించుకోలేదు. కాని బార్నీకి ఆ పడవను పట్టుకొని ఏదో నల్లటి వస్తువు కనిపించింది. వెంటనే "ఒక బోటు నీళ్ళలోకి దింప"మని బార్నీ నావికులకు చెప్పాడు. తను నీళ్ళలోకి దూకాడు. అతడు దూకగానే నావికులు ఒక బోటును నీళ్లలోకి దింపారు. నావికులు బోటును బార్నీ గొంతుక వినవస్తున్న దిశగా నడుపుకుంటూ పోయారు. మరొక పదిహేను నిమిషాల్లో బార్నీ, మార్టిన్ ఇద్దరూ "ఖద్యోతం" మీదికి కులాసాగా చేరారు. నౌక తిరిగి ప్రయాణం సాగించింది.

మరొక అరగంట గడిచాకగాని మార్టిన్‌కు స్పృహ రాలేదు. స్పృహ వచ్చిన తరవాత బార్నీ "మార్టిన్! ఈసారి నువ్వు సముద్ర ప్రయాణం చెయ్యక తప్పదు," అన్నాడు. పాపం మార్టిన్ నోట మాటరాక, దిగాలుగా చూస్తున్నాడు. "ఇప్పుడు వెనక్కి పోవడానికి కెప్టెన్ ఒప్పుకోడు. గ్లోస్టర్ వరకూ వెళ్ళాక, నువ్వు నీ తిరుగు ప్రయాణం సంగతి ఆలోచించవచ్చు. నిన్ను చూస్తే కెప్టెన్ వదిలిపెట్టడు. అతనికి నీలాంటి చురుకైన కుర్రాడు ఒకడు చాలా అవసరం."

బార్నీ మార్టిన్ పక్కన కూర్చుని తల నిమురుతూ ఓదారుస్తున్నాడు. కాని లాభం లేకపోయింది. తాను రాత్రి ఇంటికి రాకపోతే పెద్దమ్మ డరోతీ గ్రంబిట్ ఎంత బాధపడుతుందో, తను ఒక చిన్నబోటులో సముద్రంలోకి కొట్టుకుపోయాడని తెలిస్తే ఆమె హృదయం ఎంత క్షోభిల్లుతుందో తలచుకుని అతడు పిచ్చెక్కినట్లయిపోయాడు. తను మునిగిపోయాననే ఆమె అనుకుంటుందని తలచాడు. తన్ను ఏదైనా ఒక పడవ ఇచ్చి వెనక్కి పంపవలసిందిగా కెప్టెన్‌ను ప్రతిమాలాడు. ఆఖరికి అలా పంపకపోతే చంపేస్తానని పిచ్చిగా అరిచాడు. కెప్టెన్ నవ్వి ఇదంతా నువ్వు చేతులారా చేసుకున్న పనేగా" అని అన్నాడు. "మునిగిపోకుండా బతికి బయటపడినందుకు సంతోషించు. వంద పౌన్లు ఇచ్చినా వెనక్కి తిరగను," కచ్చితంగా చెప్పాడు.

ఇంటికి వెళ్లే ఆశలు పెట్టుకుని లాభంలేదని మార్టిన్ రాట్లర్ గుండె దిటవు చేసుకున్నాడు. నెమ్మదిగా కిందికి దిగివెళ్ళి నావికులు పడుకునే చోట ఒక పక్కమీద పడుకుని, గోడకి ముఖం పెట్టి చాలసేపు ఏడ్చి ఏడ్చి నిద్రపోయాడు.

6

ఒక్కొక్క రోజే గడిచినకొద్దీ మార్టిన్ రాట్లర్ మనస్సు కుదుటపరచుకుని ఓడలో తన విధులు నిర్వర్తించ సాగాడు. కెప్టెన్ ఎప్పుడూ చిరచిరలాడుతూ ఉండేవాడు. సరిగ్గా నడుచుకుంటేనే జీతం ఇస్తానని మార్టిన్‌తో చెప్పాడు. మార్టిన్ పై ఉద్యోగిమాత్రం చాలా మంచివాడు. మార్టిన్‌పట్ల స్నేహంగా మెలిగేవాడు కాని మార్టిన్‌కు ఓడలోవారందరిలోకీ ముఖ్య స్నేహితుడు బార్నీ ఓఫ్లానగన్ ఒక్కడే. బార్నీ ఓడలో వంటవాడుగా పనిచేస్తున్నాడు మార్టిన్, బార్నీ రాత్రిళ్ళు పహారా కాయవలసి వచ్చినప్పుడల్లా, ఎంతో ఆప్యాయంగా, ముందు ముందు ఏం చేయాలో

చర్చించేవారు. దూరదూర ప్రదేశాలను గూర్చి మాట్లాడుకునేవారు.

మార్టిన్‌కు వంటిమీద ఉన్నవి తప్ప వేరే బట్టలు లేవు. అవి కొత్తగా కుట్టించినవి కనుక, బాగానే ఉన్నాయి. బార్నీ అతనికి నీలపు చారల చొక్కాలు రెండు ఇచ్చాడు. ఒక వంట్లాము, ఒక పొట్టి చొక్కా కాలిజోళ్ళు తయారుచేసి ఇచ్చాడు. వాటిని తయారు చెయ్యడం, పాడైతే బాగుచేసుకోవడం కూడా అతనికి నేర్పాడు.

"మార్టిన్! చూశావా? ఇలా అన్నివనులూ నేర్చుకుంటే, మనకు ఒక్కొక్కసారి ఎంత ఉపయోగ పడతాయో. నామట్టుకు నేను, ఈ చిన్నపెట్టె లేకుండా ఎప్పుడూ, ఎక్కడికీ బయలుదేరను," అన్నాడు బార్నీ.

"చిన్నపెట్టె దేనికి?" అన్నాడు మార్టిన్ నవ్వుతూ.

"అందులో ఒక సూది, దబ్బనం, ట్వైనుదారం, చాకు ఉన్నాయి. కాన్వాస్‌గుడ్డ ఇస్తే చాలు, నీకు ఏది కావాలంటే అది తయారుచెయ్యగలను," బార్నీ అన్నాడు.

"నీకు చాలా విద్యలు వచ్చునల్లే వుంది. ఈ వంటపనిలో కెలా దిగావు."

"ఎలా దిగానో చెప్పడం కష్టమే. నాకే సరిగా తెలియదు. నేను రెండడుగుల ఎత్తు ఉన్నప్పటినుంచీ నా జీవితం అంతా వంటగదుల్లోనే గడిపినట్టు నా అనుమానం. నా అంతట నేనే వంటపనిలో కుదిరానుగాని, కేవలం జీతపురాళ్లకోసం కాదు. కాని ఎప్పుడు చూసినా, నా ఖర్మకాలి, చేతులో కాళ్లో కాల్చుకుంటూనే ఉంటాను, అదేం చిత్రమో," బార్నీ అన్నాడు.

కెప్టెన్ నావికులకు ఓడ ప్రయాణదిశను గూర్చి ఆజ్ఞలిస్తున్నాడు. మార్టిన్‌ను అడిగి టెలిస్కోపు తీసుకుని దూరాన దేన్నో పరీక్షిస్తున్నాడు. అత డలా పరీక్షించడం నావికులందరికీ ఆందోళన కలిగించింది.

ఆ సమయంలో ఖద్యోత నౌక దక్షిణ అమెరికా తీరప్రాంతంలో ప్రయాణం చేస్తున్నది. ఆ రోజుల్లో అక్కడ సముద్రపు దొంగల భయం జాస్తీగా ఉండేది. వర్తక నౌకలను దోచుకొని, సముద్రపు దొంగలు విలువైన సరకులను ఎత్తుకుపోవడమే కాక, క్రూరంగా వర్తకులను, నావికులను వధించేవారు. అందుచేత దక్షిణ అమెరికాదేశాలతో వ్యాపారంచేసే నౌకలు అక్కడి కొచ్చేటప్పటికి చాలా జాగ్రత్తగా ఉండేవి. అనుమానింపదగిన ఓడలను తప్పించుకు తిరిగేవి. ఆ కారణంచేత ఖద్యోతనౌక కెప్టెన్ దూరదర్శినితో దూరాన కనిపించే తెరచాపలను పరీక్షగా చూడడం నావికులకు ఆందోళన కారణమైంది.

"అది స్పానిష్ ఓడలాగా కనిపిస్తోంది. అయినా నమ్మడానికి వీల్లేదు," అని కెప్టెన్ ఆగ్నేయంగా పోతున్న తన నౌకను వాయవ్యంగా తిప్పమని ఆజ్ఞాపించాడు.

"ఆ ఓడ మన్ని సమీపించిందంటే మన ప్రాణాలు మనకు దక్కవు. ఒక్కడుకూడా మిగలకుండా సఫా అయిపోతాము తెలిసిందా? త్వరగా వెనక్కి మళ్లించండి,"అని గర్జించాడు కెప్టెన్.

కొన్ని నిమిషాల్లో నౌక వ్యతిరేక దిశగా ప్రయాణించసాగింది. కాని ఖద్యోతం బాగా పెద్ద నౌక; బరువైనది. దానికేసివస్తున్న నౌక చిన్నదీ, తేలికైనదీ. అందుచేత చిన్ననౌక అతివేగంతో ఖద్యోతంవైపు వస్తోంది. కొద్దిగంటలలోనే సమీపించేటట్లు కనిపించింది. ఆ విధంగా సాయంత్రందాకా చిన్ననౌక పెద్దనౌకను వెంటాడింది. అకస్మాత్తుగా నావికులలో ఒకడు "అదిగో ఒడ్డు కనిపిస్తోంది"అని అరిచాడు.

"ఎక్కడా?" అని కెప్టెన్ ఆదుర్దాగా అడిగాడు.

"అదిగో, ఆ ఎదురుగా" అన్నాడు నావికుడు.

"అయితే ఓడని ఒడ్డుపట్టిస్తాను. వాళ్లు మన్ని ఎలా సమీపిస్తారో చూస్తాను," కెప్టెన్ అన్నాడు చిన్ననౌకను చూస్తూ.

చిన్ననౌక వేగంగా సమీపిస్తోంది. నల్లటి జెండా భయంకరంగా ఎగురుతోంది.

మరికొద్దినిమిషాల్లో ఎదురుగా ఒడ్డుకు కొట్టుకుని విరిగిపోతున్న కెరటాలు కనిపించాయి.

"ఒడ్డుకు చేరడానికి ఏదైనా దోవ ఉన్నదా?" అని కెప్టెన్ అడిగాడు. "ఉన్నది" అని నావికుడు సమాధానం చెబుతుండగా వెనకాల చిన్ననౌకనుండి తెల్లనిపొగ వెలువడింది. తుపాకి

గుండు ధన్ మనివచ్చి పెద్దతెరచావ కొయ్యకుతగిలి ఆ కొయ్య, దానితోపాటు కొన్ని తెరచాపలు అన్నీ కింద పడ్డాయి. అవి కిందపడుతూ మరికొన్నిటిని కూడా పడే శాయి. కొన్ని క్షణాల్లో ఖద్యోతనౌక నిరుపయోగమై పోయింది.

"చిన్న బోట్లను నీళ్ళలోకిదించండి. మనంవాళ్లని తప్పించుకోడానికి అదొక్కటేమార్గం. ఇంక రెండు నిమిషాల్లో చీకటిపడుతుంది," అని కెప్టెన్ ఆజ్ఞాపించాడు.

కెప్టెన్ అన్నది నిజమే. అత్యుష్ణ మండలాలలో సాయంసంధ్య అనేది ప్రత్యేకంగాఉండదు. సూర్యుడస్త మించడం, చీకటి అవతరించడం రెండూ దాదాపు ఒకేసారి జరుగుతాయి. చిన్న పడవలనుదించి, మను షులు వాటిలోకి దిగేలోగానే చీకటిపడిపోయింది. ఈ చర్యలన్నిటినీ చిన్ననౌకలో వాళ్లు కనిపెడుతూనే ఉన్నారు. తాముకూడా చిన్నబోట్లనుదించి మళ్లీ వెంట బడ్డారు.

ఒడ్డు ఇంకాదూరానే ఉన్నది. మబ్బులు బాగా పట్టినందున చీకటి మరింత దట్టమైపోయింది. తెడ్ల చప్పుడునుబట్టి దొంగలబోట్లు అతి త్వరగా తమ్మ సమీపిస్తున్నట్లు గ్రహించారు. "గట్టిగా వెయ్యండి తెడ్లు. అరమైలుకంటే ఎక్కువదూరం ఉండదు ఒడ్డు," అని కెప్టెన్ ధైర్యంచెప్పాడు.

"ఏం ఫరవాలేదండి. మనం వాళ్ళతో పోట్లాడ గలం. మనందరి దగ్గిరా కత్తులూ, పిస్తోళ్ళుఉన్నాయి" అని ఒక నావికుడన్నాడు.

"వాళ్లతో మనమా పోట్లాడేది? నీకేం పిచ్చా? మనకి నాలుగురెట్లమంది ఉన్నారువాళ్లు. వాళ్ళలో ప్రతి ఒక్కడికీ జోలెడు ఆయుధాలుంటాయి. ప్రాణా లపై తీపిఉంటే, నోరుమూసుకుని తెడ్డువెయ్యి," అని కెప్టెన్ అన్నాడు.

ఇంతలో చిన్ననౌక తాలూకు బోట్లు మసక మసకగా కనిపించాయి. హఠాత్తుగా ఒక మొరకు కంఠం వినిపించింది: "తెడ్లు ఆపివెయ్యండి గాడిదల్లారా! లేకపోతే మీ తలకాయలు టపాకాయల్లా పేల్చే స్తాను,"అని వచ్చీరాని ఇంగ్లీషులో వినబడింది. ఈ బెద రింపులోపాటు ఒక తుపాకిగుండుకూడా వదలబడింది. అది కెప్టెన్ తలకు అంగుళంవాసిలో దూసుకు పోయింది. ఖద్యోతనావికులు తెడ్లు నిలిపేశారు. దొంగలబోట్లు సమీపించాయి.

"మార్టిన్!" అని బార్నీ రహస్యంగా పిలి చాడు. "నేను ఒడ్డుకు ఈదుకుపోతాను. నేను నీళ్ల లోకి దిగగానే, చప్పుడు చెయ్యకుండా నువ్వుకూడా నీళ్లలోకి దిగి ఈదుకురా," అన్నాడు.

క్షణమైనా సందేహించకుండా మార్టిన్ సము ద్రంలోకి దిగాడు. అతడు దిగిన క్షణంలోనే దొంగల పడవలు నావికుల పడవల మధ్యకి వచ్చేశాయి. మరొక నిమిషంలో బార్నీ, మార్టిన్ నిశ్శబ్దంగా ఒడ్డు కేసి ఈదుకుపోయారు. వీరిద్దరూ తప్పించుకుపోవడం తోటి నావికులు కూడా కనిపెట్టలేదు. కొద్దిక్షణాల్లో ఎవరూ పట్టుకోలేనంత దూరం పోయారు.

"నా దగ్గిరగానే ఈదుకుంటూ రా. దూరం పోబోకు. ఈ చీకట్లో మనం విడిపోతే మళ్లీ కలుసుకో లేము. ఆయాసంవస్తే నా బుజం పట్టుకుని తేలుతూ రా. మన మాటలు వాళ్లకి వినిపించవు నీళ్ళను బాదుతూ ఈదితే మంచిది; సొరచేపలు భయపడి దూరంగా పోతాయి," అని బార్నీ సలహాలిచ్చాడు.

"సరే," నన్నాడు మార్టిన్. "ఇలాంటి వెచ్చని నీళ్లలో నేను బాగా ఈదగలను. నువ్వు కొంచెం వేగం తగ్గించు. నేను నీ వెంబడే వస్తాను."

ఈ విధంగా ఒకరి కొకరు ధైర్యం చెప్పు కుంటూ, చీకట్లో వేరుపడిపోతామేమోనని దగ్గిర దగ్గిర గానే ఈదుతూ, ఇరువురూ తీరాభిముఖులైవెళ్లారు.

(ఇంకా ఉంది)

చైనీస్‌కథలు: ఫెంగ్‌స్వే - ఫెంగ్:

16. ఎలుక తోక

"అన్ని ఎలుకలకూ తోకలున్నాయి. నాకూ ఉంది వెధవతోక! ఎందుకొచ్చిన తోక! అందరిలాగానే తోకఉంటే నా గొప్ప ఏమి ఏడిసిందిక!" అని భావించిన మూర్ఖ మూషికం, తన మిత్రమైన మరొక మూషికం వద్దకు వెళ్ళి తన తోక కొరికివేయమని బతిమాలింది.

"అందరూ తోకలమీదే ఆశలు పెట్టుకు బతుకుతారు. నాకు ఈ వెధవ తోకతో నిమిత్తంలేదు" అని చెప్పింది. ఇది విని రెండో ఎలుక 'ఎప్పటికైనా దీనికి పశ్చాత్తాపం కలగకపోతుందా' అని ఆలోచించి కొరుకుతున్నట్టు నటిస్తూనే తోకను కురచగా ముడివేసింది.

తోక పోయిందనుకొని, మూర్ఖ మూషికం తాను అకస్మాత్తుగా ప్రపంచ ప్రఖ్యాత మూషికాన్ని అయిపోతున్నానని భావించింది. ఠీవిగా తలెత్తుకుని ఇతర మూషికాల ముందు పచారు చెయ్యసాగింది. మొదట ఎలుకలన్నీ దాన్ని చూసి 'ఇదేమి వింత' అని తెల్లబోయాయి. సంగతి గ్రహించగానే ఫక్కున నవ్వాయి. నవ్వి, నవ్వి అలిసిపోయాయి. తోకలేని ఎలుకను విపరీతంగా వేళాకోళంచేసి, ఏడిపించాయి. వాళ్ల హేళన వింటుంటే మూర్ఖమూషికానికి భోళ్లున ఏడుపు రాబోయింది. తను భూమిలోకికుంగిపోతే బాగుండుననిపించింది. వెంటనే మళ్ళీ మిత్రమూషికం దగ్గిరికి పరుగెత్తుకుపోయి ఇలా ప్రార్థించింది.

"మొదట్లోనే నాకు అపశకునం ఎదురైందోయ్. తోక లేకపోవడం ఏం బాగా లేదు. కాస్త ఏదైనా పసరో గిసరోరాసి తోక త్వరగా పెరిగేట్టు చెయ్యి లేకపోతే ఏ నుయ్యో గొయ్యో చూసుకుని చస్తాను."

మిత్రమూషికం దయతలచి వెంటనే ముడులన్నీ విప్పేసి తోకను మామూలుగా చేసింది.

అప్పుడు ఎలుక తోక ఝాడించి, అందరిలాగానే తనకూ ఒక తోక ఉన్నందుకు ఎంతో మురిసిపోయింది. ★

చీకటి మొట్టికాయలు

సూరంపూడి భాస్కరరావు

ఒకరోజున సీత గబగబా పరిగెత్తుకుంటూ నాదగ్గిరికొచ్చింది. ఉసిరిచెట్టుకిందకూచుని వీరేశలింగంగారి స్వీయచరిత్ర కాబోలు చదువుతున్నాను. ఉలికిపడిచూసేసరికి సీత రోజుకుంటూవచ్చి నామీద పడింది.

"రాజూరాజూ నన్నా చెట్టెక్కించు గబగబా. వాళ్లొచ్చేస్తున్నారు" అంది ఆత్రంగా.

వాళ్లెవరూ కనపళ్లేదు. ఎవరూ లేందే" అన్నాను. "కాదు వాళ్ళింకా చూళ్లేదు. కొంచెం ఉంటే వచ్చేస్తారు. దబ్బునెక్కించూ" అని తొందరపెట్టేసింది. ఏం కొంపమునిగిపోతుందో అని సీతను ఉసిరిచెట్టెక్కించేశాను ఖంగారుగా. కాని ఉసిరిచెట్టుని ఆకుల్లేవు కొమ్మెక్కి కూచుంది. "అయ్యో. యీ చెట్టెక్కించావేమిటి? దింపెయ్యి. అబ్బా కనపడిపోతున్నాను." అని గోలచేసింది గొంతు సన్నంచేసి.

నోరెత్తకండా దింపేశాను. కాని సీతమాత్రం నాచెయ్యి వదల్లేదు. "నడు. తొందరగా ఆ మామిడిచెట్టెక్కించు" అంటూ పరిగెత్తింది. సీతంత చరచర పరిగెత్తలేదు నేను. సీత కంగారు నాకేం తెలుస్తుంది. నేను మామిడిచెట్టు చేరేలోగా సీత మూడుమాట్లు దానిదగ్గిరికెళ్ళి మళ్ళీ నాకోసం పరిగెత్తుకొచ్చింది.

సరిగ్గా నేనూ సీతను మామిడిచెట్టెక్కిస్తూండగా ఓ మూలనుంచీ రాజ్యం దౌడు తీసుకుంటూ వచ్చేస్తోంది. నేనున్నానుకదా కనుక్కుందామని కాబోలు నావేపుకే సరాసరి వచ్చేస్తోంది. రాజ్యం ఆ కొసనుండగానే సీత కనిపెట్టేసింది. "రాజూ! అలా గులాబీఅంట్లుకేసి పరిగెత్తిందని చెప్పు. లేకపోతే యిలా వచ్చేస్తుంది. వెళ్లూ"అని ముక్కింది.

నాకేం పాలుపోలే. సీత చెప్పినట్టు చెయ్యాలికాబోలునని బ్రరున రాజ్యందగ్గిరికెళ్లాను. "సీతేనా? ఇప్పుడే అటు పరిగెత్తింది"అన్నాను గులాబీ అంట్లవైపు చూపిస్తూను. నిజమే అనుకుని రాజ్యం వెళ్ళిపోయింది.

"ఇదేంఆట సీతా?" అని అడిగాను. "ఇప్పుడు చెప్తను. సుశీలా వాళ్లు కడుపుబ్బిందనేదాకా నేని చెట్టు దిగకూడదు. నువ్వెళ్ళిపో" అంది ఇంక నాఅవసరం అప్పటిమట్టుకు తీరిపోయిందికదా అని. "నే వెళ్లిపోతే నిన్నెవరు దింపుతారు?" అన్నాను. క్షణంలో ఆలోచించి చెప్పేసింది. "అయితే దింపేసి వెళ్లిపో. నువ్విక్కడుంటే వాళ్లంతా కనుక్కుంటారు."

"దింపేస్తే నువ్వు కనపడిపోవూ?" అన్నాను.

"మరెల్లాగ?" అంది బిక్కమొగంపెట్టి.

"ఆఁ. నువ్విక్కడేఉండు. వాళ్లకి కడుపుబ్బిందో లేదో కనుక్కుని వస్తాను" అని బయల్దేరాను. సుశీల ఒకపక్కని వెతుకుతోంది. జానకి యింకోపక్కని వెతుకుతోంది.

★ చీకటి మొట్టికాయలు ★

అందరు ఒక్కొక్క చెట్టుకే ప్రదక్షిణం చేసుకుంటూ వొస్తున్నారు. అంత పెద్ద చెట్టెక్కి కొమ్మల్లో రెమ్మల్లో గువ్వపిట్టలా కూచుంటుందని వాళ్ళెలా అనుకుంటారు? రాజ్యం, సుందరి వెతకలేక వెనక్కొచ్చేశారు. సుశీలా జానకీకూడా వెతకడం చాలించేశారు. "ఎక్కడ దాక్కుంది చెప్మా" అంది సుందరి బాదంఆకు తుంపుతూను. "ఇంటికెళ్లిపోయిందికాబోలే" అంది జానకి. "అయితే కడు పుబ్బినట్టేనా?" అన్నాను నేను. "ఆఁ. ఇట్టే పట్టుకుంటాం దొంగనిచూసుకో." అన్నారంతా ఒక్కసారి. "రాజే దాచాడే మొక్కడోను. టక్కరిచూపు లెలా చూస్తాడో చూడు." అంది ఆపలించకముందే పేగులు లెక్కపెట్టే రాజ్యం. "ఎక్కడ దాచావో చెప్తావా చెప్పవా?" అని గద్దించింది సుశీల పట్టపురాణిలా రీవిగా. అంతా నన్ను ముట్టడించేశారు.

వీళ్లకి రహస్యం బయటపెట్టడానికి మార్గమెల్లాగో నాకు బోధపడలేదు. "సీత దాక్కున్నచోటు నేను చెప్తానుగాని, నేను చెప్పానని సీతకి చెప్పకండేం?" అని "కానీ మీరంతా ఒక పని చెయ్యాలి. ఆ మామిడిచెట్టు దగ్గిర ఒక చింత మొక్క ఉంది. ఆ మొక్కకి మొదట్లో ఒక చిన్న కాగితంముక్క పెట్టాను. అది చదువుకున్నవాళ్లకి సీత యెక్కడ దాక్కుందో తెలిసిపోతుంది" అన్నాను. "ఏమీ చప్పుడు చేయకుండా వెళ్లాలి సుమా" అని హెచ్చరిక చేశాను. సీత మామిడాకులు నములోంది. వీళ్ళందరికీ కాగితంకోసం వెతుకులాటేగాని చెట్టుమీదకి దృష్టి మళ్లితేగా.

పాపం వాళ్లంతా వెళ్ళి ఊ, వెతుకున్నారు. చింత మొక్కలెన్నైనా ఉన్నాయిగాని కాగితం ముక్క ఉంటేగా. చింకి కాగితం ముక్కలు ఉన్నా వాటిలో చదివేందుకేముందిగనక. నేనుకూడా వెళ్ళి చెట్టుకింద కూలబడ్డాను. "అసలు సీత ఎందుకు దాక్కుంది రాజ్యం?" అన్నాను.

దాగుడుమూతల్లో దొంగై మూడుసార్లు ఎవర్నీ ఔటుచెయ్యలేకపోయింది. చీకటి మొట్టికాయలకి తల్లిదగ్గరకూర్చున్నట్టేకూర్చుని ఒక్కగంతున లేచిపోయింది. "కూ వోవేం?" అంటూ, "నేను ఒకచోట దాక్కుంటాను, నను మీరు వెతుక్కుంటే అప్పుడు చీకటి మొట్టికాయలు తింటాను" అంది. మరి "ఎంతమంచిచోటు జ్ఞాపకం వచ్చిందో!" అని రాజ్యం ఆలోచనలోపడ్డట్టు చూసింది. మిగతా వాళ్లంతా చింతమొక్కదగ్గిర కాగితమే సీత అన్నట్టుగా వెతుకుతున్నారు. 'ఓహో అదా సంగతీ— పోనీలే ఎక్కడదాక్కుంటే మనకేం గాని, అంతావచ్చి కూర్చోండి కబుర్లుచెప్పుకుందాం' అన్నాను. "కాగితంలేదు, ఏంలేదు. అన్నీ అబద్ధాలే" అంది ఉడుకుమోతు పిల్ల జానకి. "అబద్ధాలా? ఈ చెట్టుమీదే కోకిలుంటేనా దాని చేత చెప్పిద్దును సీత దాక్కున్నచోటు నాకు తెలుసుకో తెలియదో." అన్నాను నేను.

"మరే కూర్చున్నాయి కోకిలలు నీతో కబుర్లు చెప్పడానికి" అంది సిసింద్రీలా సుశీల. నేను సత్యవచనుణ్ణని వీళ్ళందరిదగ్గరా ఋజువు చేసుకోడం ఎల్లాగా అని ఆలోచించాను. "కోకిలా, నువ్వు చెట్టుమీదున్నావో లేదోగాని ఉంటే నే నడిగిందానికి జవాబు చెప్పు" అన్నాను. 'కూ' అంది కోకిల్లాగ సీత. 'అమ్మ దొంగా! ఇక్కడున్నావా?' అని అంతా ఒక్కసారి పైకిచూచారు. ఆపుకోలేక సీత ఫక్కున నవ్వింది విజయగర్వంతో. ఆ నవ్వుకి చేతులు పట్టుజారిపోయినందుకు గబుక్కున నేను పట్టుకున్నాను గనక సరిపోయింది గాని లేకపోతే అప్పుడు అమ్మగారి పెళ్ళి. చీకటి మొట్టికాయలు తప్పినా తల బొప్పికట్టటం తప్పకపోయేది. ★

★ చీమలు పెట్టిన పుట్టలు ★

(12-వ పేజీ తరువాయి)

"ఏతే నీ అనుమానం ఎవరిమీద నాగరాజూ?" అన్నాడు అనుమానమేమిటి, ఆక్రోశించాడు

"అదే చెప్పబోతున్నాను బావా! ఇది ఇంట్లోవాళ్లుతప్ప మరెవరూ చేసినపని కాదని తెలుస్తోందికదా! ఇంట్లోమాత్రం బోలెడుమంది ఎవరున్నారు గనుక! నేనూ మాఆవిడ, కల్యాణి తప్ప ఇంకెవరూ లేరు. ఆ వాసు ఒకడున్నాడనుకో వాడంత అర్ధంగతికి వరండాప్రక్కన గదిలో పడుకుంటాడు. తెల్లవారేదాకా చస్తే లేవడు అదిగాక వాడీడబ్బు కాజేసివుంటే ఈపాటికి ఏ మద్రాసుకో బొంబాయికో పరారై పోయివుండేవాడు అలా అనుమానించడానికి వీలేలేదాయె! ఇంకా యేం చెప్పను బావా! ఇప్పటికే నీకు అర్ధమై ఉంటుంది."

రాధాపతి దిగ్భ్రాంతితో నాగరాజు మాట్లాడుతున్నంతసేపూ అతడి ముఖాన్ని చూస్తూ వుండిపోయాడు. అతడి కళ్లఎదుట ప్రపంచం గిర్రున తిరుగసాగింది. అతడు లేచాడు. ఒకటి రెండుసార్లు ఆ గదికీ ఈ గదికీ మధ్య వడివడిగా పచారు చేశాడు.

"నువ్వు అనాలోచితంగా మాట్లాడుతున్నావు నాగరాజూ! కల్యాణి నీతోబుట్టువు ఆమెగుణం నీకు తెలియందికాదు. ఐనా నీమతి యిప్పుడు పెడదారి పట్టింది. నువ్విప్పుడు నింపాదిగా మంచేదో చెడ్డేదో ఆలోచించే స్థితిలో లేవు" అందామనుకున్నాడు కానీ అనలేకపోయాడు ఇంట్లోవున్నవాళ్లు ముగ్గురే తమ సొత్తును తామే దొంగిలించవలసిన అవసరం ఆలుమగళ్లకుండదుకదా! మరి డబ్బేమైవుంటుంది? ముంజేతి కంకణానికద్దమెందుకు? ఇక్కడ అనుమానించడానికి ఎవరికైనా అవకాశముంది "కడకు ఎంతపని చేశావు కల్యాణీ! పాపిష్టి డబ్బుపట్ల నీలోకూడా యింత ప్రలోభం దాగివుంటుందని నేను కలైనా కనలేదే కల్యాణీ!" అనుకున్నాడు అనుకుంటూ ఆగ్రహపరవశుడై వీధిలోకి వచ్చాడు పంతులుగారు గాలిపాటుకు ఎగిరిపోతున్న ఎండుటాకులా వీధిలో పరుగెత్తుతుండడం చూచినవాళ్లందరూ విస్తు

పోయారు కులగిరులు పెకలించినా కంపించని మనిషి, ఈయన ఈగోలు ఇలా మారిపోయాడేమిట్రా అని ఒకరినొకరు ప్రశ్నించుకున్నారు వాళ్లకు జవాబు దొరకలేదు

సుడిగాలిలా ఇంట్లోకి వచ్చిపడ్డాడు రాధాపతి. ప్రక్క గదిలో ట్రంకుపెట్టెతో ఎవరో కుస్తీ పడుతుండడం విని కల్యాణి వంటగదిలోనుంచీ బయటికి వచ్చింది. రాధాపతి చురకత్తితో తాళాన్ని బద్దలు కొట్టేస్తున్నాడు "అదేం పనండీ?" ఏం చేస్తున్నారు మీరు! నన్నడిగితే తాళంచెవి యివ్వనటండీ!" అంటూ కల్యాణి రాధాపతిని బిత్తరపోయి చూచింది ఆ సాంతకే తాళం బద్దలైపోయింది పెట్టెమూత తనంతట తానే తెరచుకుంది రాధాపతి పెట్టె గుమ్మరించాడు చీరలను చెల్లాచెదరు చేశాడు చెదరుగా పడివున్న చీరల్ని మడత విప్పి చూచాడు. పెట్టె అట్టడుగునవున్న పాత న్యూసుపేపర్ని కూడా చింపి అవతల పారవేశాడు. సర్వశూన్యంగా మిగిలిన పెట్టెని ఒక మూలకు గిరవాటువేసి "ఏదీ డబ్బు! ఎక్కడ దాచావో చెప్పు" అని గద్దించాడు.

"డబ్బెక్కడుందండీ! అన్నయ్య నడిగాను. అంతగా అవసరమైతే జాబు వ్రాయమని చెప్పి, సర్దుబాటుచేసి పంపిస్తానన్నాడు. మీరామాట అడక్కుండానే హంగామా చేస్తున్నారు"

"నేనా డబ్బునిగురించి కాదు అడుగుతోంది! నువ్వు దొంగిలించి తెచ్చిన ఐదువేలెక్కడని అడుగుతున్నాను" రాధాపతి కళ్లు ఎర్రబడ్డాయి అతడిముఖం అగ్ని తిన్నవాడి ముఖంలా అదిరిపోసాగింది

"ఏమిటండీ మీమాటలు! నేను డబ్బు దొంగిలించానా! ఎవరన్నారు మీతో?" కల్యాణి తలపైన పిడుగు పడ్డట్టయింది

"ఎవరోగాదు అంటున్నది. నీతోబుట్టినవాడే కుండబద్దలు కొట్టినట్టు చెబుతున్నాడు వెళ్లు అతడికేం చెప్పుకుంటావో చెప్పుకో" అంటూ రాధాపతి కల్యాణిని మెడబట్టి గడపదాకా గెంటుకొచ్చాడు

"అయ్యయ్యో! ఎక్కడికి వెళ్ళమంటారండీ నన్ను! ఐనా ఇదేం అపవాదండీ, నామీద తోశారు!" కల్యాణి వెక్కి వెక్కి ఏడుస్తూ ఇరుగుపొరుగువాళ్లు చూచిపోతారేమోనని తలుపు మూసుకోబోయింది

"మానమర్యాదలు నట్టేట కలిపేపని చేసి, మళ్ళీ తలుపు మూసుకుంటావెందుకు! వెళ్లి ఆ స్కూల్లోవున్నాడు మీఅన్నయ్య చూడు కల్యాణీ! కోపంవచ్చిందంటే నేను పశువుని ఆ డబ్బుతీసుకెళ్ళి అతడిముఖాన కొట్టి, మరి ఇంకొకపని చూడు. నన్ను యింకా కొద్దిరోజులపాటు ఈ లోకంలో తలెత్తుక తిరగనీయ్!" రాధాపతి సింహద్వార తలుపులు తెరచుకుని పొలాల్లోపడి ఊరికి దూరంగా వెళ్లిపోయాడు

ఏడుస్తున్న కల్యాణిపైన బడి బిడ్డలు కూడా ఏడవసాగారు ఊళ్ళో అన్ని యిళ్ళల్లోనూ దీపాలు వెలిగాయి. రాధాపతి యింట్లో మాత్రం ఆ రోజురాత్రి దీపం వెలుగలేదు. ఊరంతా మాటుమణిగింది బిడ్డలు ఏడ్చిఏడ్చి నిద్రపోయారు. కల్యాణి తలుపుతెరచుకుని వీధిలోకి వచ్చి మెల్లగా స్కూలువైపు నడవసాగింది

స్కూల్లో దీపం వెలుగుతోంది ఊళ్ళో పెద్దమనుష్యుల్లో నాలుగురు అక్కడ ప్రోగయ్యారు కల్యాణి ... ద్వారానికి ఈవల నిలబడింది

"... అంటున్నారు: "మీరెంత చెప్పినా ఆ అమ్మాయి యింతటి పని చేసిందంటే నమ్మలేకపోతున్నానండీ! ఐనా కాలంమారింది. ఇప్పుడా సత్యహరిశ్చంద్రుడు బ్రతికివున్నా రోజుకొకటి రెండబద్ధాలు చెప్పకుండా వుండలేకపోయేవాడేమో!"

"పోయింది పదులూ, నూర్లూ అయితే అయ్యగారు యింతదూరం వచ్చేవారేనా నరసయ్యా! ఒకటి కాదు, రెండుకాదు ఐదువేలు! ఒక్కసారిగా ఐదువేలు పోయి, అదీ ఎలాపోయిందో తెలిసికూడా, యింకా ఈయన యింత నెమ్మదిగా వున్నారంటే, చూచుకో, నిండుకుండ తొణకదన్నదెందుకో! చూడండి బాబయ్యగారూ! మీ సొమ్ము గట్టిదైతే తెల్లవారేసరికి మిమ్మల్ని వెదుక్కుంటూ వస్తుంది మీరు నిశ్చింతగా పడుకుని నిద్రపోండి" ఇంకొకాయన సాగదీశాడు


కల్యాణి గిరుక్కున వెనుదిరిగి ఇంటికి దారితీసింది పిల్లల్ని ప్రక్కలో పడుకోబెట్టుకుని పెరట్లో పడుకున్న భర్తని తలచింది వంటయింట్లో తను పోయిమీద విడిచిపెట్టిన అన్నం చిమిడిపోయింది తను కాపురానికి వచ్చిన ఏడేళ్లలో భర్త పస్తుపడుకున్న రోజొక్కటీ లేదు ఈరోజు ఉత్త పుణ్యానికి నిర్నిమిత్తంగా ఈ అభాండంవచ్చి తన తలపైన వ్రాలింది వ్రాలితేనేం! ఎలాటివారికైనా ఇలాటికష్టాలు సంభవిస్తుంటాయి ఏనాటికైనా తన నిర్దోషిత్వం బుజువవుతుంది

కల్యాణి పడుకోలేదు. ప్రక్కయింటిలో గోడగడియారం పన్నెండుసార్లు మోగేదాకా ఆమె గోడకు తలవంచుకుని కూర్చుంది అప్పుడు లేచి తలుపుతీసి మళ్ళీ స్కూలువైపు నడిచింది నిజానిజాలు తేల్చ

★ చీమలు పెట్టిన పుట్టలు ★

చేసిన పెద్దమనుషులందరూ వెళ్ళిపోయారు నాగరాజొక్కడుమాత్రం రెండు బెంచీలు దగ్గరగా వేసుకుని పడుకున్నాడు. కల్యాణి లోపలికి వెళ్ళింది. నాగరాజు పాదాలచెంత బెంచీపైన కూర్చుంటూ "అన్నయ్యా, అన్నయ్యా" అని పిలిచింది. నాగరాజు ఉలికిపడి లేచాడు. లేస్తూనే చెల్లెల్ని చూచాడు. చూచి ముఖం మరోవైపుకు త్రిప్పుకున్నాడు.

కల్యాణి లేచి నిల్చుంటూ "ముఖం త్రిప్పుకోకన్నయ్యా! నన్నొకసారి చూడ్డానికైనా నీకు మనస్కరించడం లేదు కదూ! అవును. నే నీనాడు భర్తచేత నీచురాల్నిగా భావింపబడినదాన్ని. ఈ నాడు నేను లోకంచేత మోసగత్తెగా, దొంగగా ఎంచబడినదాన్ని. లోకులు కాకులు. నేను వాళ్ళ సంగతి చెప్పడంలేదు. నువ్వు నాకు అన్నయ్యవి. నాన్నగారు చనిపోయి పదేళ్లయింది. అమ్మ నాకు తెలియకముందే చనిపోయింది. నాకు తల్లయినా తండ్రయినా నువ్వేనని నే ననుకున్న రోజులున్నాయి. అప్పటికీ యిప్పటికీ నీలో చాలా మార్పువచ్చింది. నీకూ నాకూమధ్య ఇనుపగోడలు లేచాయి. లేక లేక నేను నీయింటికి వచ్చాను. మావదిన నాకోసం ఒకగది ప్రత్యేకించింది. అమ్మవుంటే నే నామె ఒడిలో పడుకునేదాన్ని! నే నా గదిలోనే నాబిడ్డలతోబాటు పదిపదిహేనురోజులు కాలంగడిపాను. ఒకనాడైనా నువ్వు ఇలా రారా బాబూ అంటూ ఒకపుత్రాడినైనా చేరదీయలేదు. నువ్వా కుర్రాళ్ళకి మేనమామవి. వాళ్ళపైన నీకంత అంతఃకరణ ఉంది అదలావుండనీ! నిబావమరది నీకు అమాయకుడిలా కనిపించాడు. నేను మాయలాడినని నువ్వు నోరువిడిచి చెప్పలేదు. అది నా అదృష్టం! వాడు మొదట నీకుతగిన మొగుడు దొరకలేదంటూ ఉపక్రమించాడు. ఆసాయంత్రం ప్రేమలేఖ వ్రాశాడు. ఆరాత్రి దౌర్జన్యం చేయాలని చూచాడు. వాడు నీపాలిటికి గొప్ప సంస్కారం కలిగినవాడిలా కనిపించాడు. నేను విశాలదృక్పథం లేనిదాన్నయ్యాను. ఇన్నిమాట లెందుకన్నయ్యా! నేను నీ యింటికి రావడమే తప్పు. పొరబాటు జరిగింది. ఐనా ఈమాటలన్నీ నీకనవసరం.



నీడబ్బు పోయింది. ఇప్పుడు నీచింత అది! నేను కావలిస్తే నాబిడ్డలపైన ప్రమాణం చేసి చెబుతాను. నీడబ్బేమైందో నాకు తెలియదు. ఈరోజు నువ్వు ఈవూరి కొచ్చావు. తిండి లేకుండా పడుకున్నావు. నువ్వొక్కడివే కాదు. ఆయన నిండుపస్తుతో పక్కలో పైగడ్డయినా పరుచుకోకుండా పడుకున్నారు. ఈరోజు నన్నాయన మెడబట్టి బయటికి గెంటబోయారు. ఎలాగూ నాకు పుట్టినిల్లు కరువైపోయింది. మెట్టినింటికి కూడా ఎసరు పెట్టదలచుకోకు. నీకు చేతు లెత్తి నమస్కరిస్తున్నాను. నువ్వు తెల్లవారక ముందే యిక్కడినుంచీ వెళ్లిపో."

నాగరాజు తల దిమ్మతిరిగింది. అతడు "లేదు కల్యాణీ నువ్వలా చేసివుండవని నాలో నాకు ఎవరో చెబుతున్నా వినిపించుకోకపోయాను. నేను పాపిష్టివాణ్ణి" అనాలనుకున్నాడు. కానీ ఆలోపలే కల్యాణి అక్కడినుంచీ వెళ్ళిపోయింది.

6

నాగరాజు స్వగ్రామానికి తిరిగివెళ్లి గ్రామమునసబు ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పదిరోజుల తర్వాత పోలీసులు గిండీ గుఱ్ఱప్పందాల్లో ఒకవ్యక్తిని అనుమానించి అరెస్టుచేశారు. పోయింది పోనూ అతడివద్ద మిగిలివున్న రెండువేల రూపాయలు స్వాధీనం చేసుకొని నాగరాజుకు కబురు పంపారు. నాగరాజు మదరాసు వెళ్లాడు. కటకటాల్లోవున్న ఖైదీని చూచాడు. "ఇతణ్ణి మీ రెరుగుదురాండీ" అని సబ్ ఇన్‌స్పెక్టరు ప్రశ్నించాడు. నాగరాజు తల ఊపాడు. "ఇది చాలా అసాధ్యమైన ఘటంలా కనిపిస్తోందండీ! ఇతడు దొంగతనమే నాకు తెలియదు పొమ్మంటున్నాడు. ఇంటి యజమానురాలే స్వయంగా ఇతడికి డబ్బిచ్చి వాడుకోమందట!" అన్నాడు సబ్ ఇన్‌స్పెక్టర్. నాగరాజు అతడిచేతులు పట్టుకొని "దయచేసి వీడిని వదిలివేయండి ఇన్‌స్పెక్టరుగారూ! లేకుంటే ఆడది బోనులో నిలబడవలసివస్తుంది" అన్నాడు. ఇన్‌స్పెక్టరు "అబ్బే, వీల్లేదండీ! ఫైలు పైవాళ్ళదాకా వెళ్ళిపోయింది. ఇక కేసు జరగాల్సిందే" అన్నాడు.

నాగరాజు ఖైదీతో పది నిమిషాలపాటు మాట్లాడడానికి పర్మిషను తీసుకుని కటకటాలదగ్గరికి వెళ్లాడు. "ఒరే వాసూ!" అని పిలిచాడు. వాసు గోడవైపు తిరిగి నిల్చున్నాడు. నాగరాజు గోడని వుద్దేశించి చెప్పుకుపోయాడు "రంగథామయ్యగారు పిల్లలేక నన్ను దత్తత చేసుకున్నారు. నాకూ బిడ్డలులేరు! ఈ ఆస్తి ఎప్పటికైనా అన్యాక్రాంతమై పోయేదే. నువ్వు అయిదు వేలు కాజేసినందుకు నాకు చింతలేదు. కానీ ఈ గుణాన్ని నువ్వొక నిర్దోషిపైన తోయజూశావు. పైగా ఈ దొంగతనం చేయడంలో నీ ప్రయోజకత్వమేమీ లేదనీ ఇంటావిడే నీకీ పైకాన్ని కాజేయడంలో తోడ్పడిందనీ అంటున్నావనీ విన్నాను. కావచ్చు! ఏ పుట్టలో ఏ పాముంటుందో ఎవరికెరుక! ఇక కేసు జరుగుతుంది. జరగాల్సిందే! అక్కా తమ్ముళ్ళు ఒకరిపైన మరొకరు నేరారోపణ చేసుకుని, నామాన మర్యాదల్ని నట్టేట్లో కలుపబోతున్నారు. నలుగురూ నన్ను చూచి నవ్వుతారు. నవ్వాలిసిందే! నేను చేసిన అపరాధానికి అదే నాకు శిక్ష!"

వెనుకనుంచీ పోలీసు "ఐదునిమిషాలయిపోయిందండీ" అన్నాడు. 'నా మాటలు కూడా అయిపోయాయి' అనుకుంటూ నాగరాజు స్టేషనునుంచీ బయటికి వచ్చి, అక్కడినుంచీ సరాసరి పోస్టాఫీసుకి వెళ్లి కార్డుతీసి "చిరంజీవి చెల్లెలు కల్యాణికి అన్న దీవించి వ్రాయునది. నిష్కారణంగా నిన్ను అనుమానించాను. నిజమైన దొంగ పట్టుబడ్డాడు. నన్ను మన్నించగలిగితే మన్నించు" అని వ్రాసి సంతకం చేసి పోస్టు చేశాడు. రెండు మూడువారాలవరకూ ప్రత్యుత్తరంకోసం నిరీక్షించాడు. తరువాత మళ్ళీ ఇంకొకజాబు వ్రాస్తూ దానితోబాటు బడికట్టడంకోసం అయిదువందల రూపాయలు ఇన్సూర్ చేసి పంపించాడు. పంపిన నాలుగోరోజున అది తిరిగి నాగరాజు చేతికే వచ్చింది. దానితోబాటూ మరొక కార్డుగూడా అందింది. కార్డులో ముద్దుగా మూడుపంక్తులు మాత్రమే వున్నాయి. "అన్నయ్యా! నా నిర్దోషిత్వం బయటపడ్డం మాత్రమే నాకు కావలిసింది. లేదంటే అన్న చెల్లెలిపట్ల చూపించవలసిన ఆదరంలో శతాంశమో, సహస్రాంశమో నీనుంచీ కోరుతున్నానంతే! డబ్బు నాకు అవసరం లేదు. మరచిపోకు. ఇట్లు నీ చెల్లెలు కల్యాణి"

★

విజ్ఞానవీధులు

"డాక్టర్"

మునిమాణిక్యం వారి కాంతం

తెలుగునాటి ముచ్చుగ ఆడుబిడ్డలలో ఒక్కర్తె మధురవాణి, కాంతం, యెంకి ముగ్గురూ ఈనాటి తెలుగు రచయితలు సృష్టించిన త్రిమూర్తికలు. ముచ్చురూ ఊహా ప్రపంచం నుండి దిగివచ్చి తెలుగుగడ్డమీద పాదము పెట్టినవారే. మన ప్రస్తుతవ్యక్తి శ్రీమతి మునిమాణిక్యం కాంతమ్మగారు వాస్తవంగా ఉండిన వ్యక్తే అని నమ్మిన వారు 'కాంతం' గారిని సరిగ్గా గుర్తించిన వారు కానేకారు అంటాను నేను. సాహితీ సమితి అన్నగార్లే "ఆయన అన్నీ ఇంట్లో జరిగిన వ్యవహారాలే రాసేస్తున్నారండీ" అనడము విన్నవారు చాలామంది ఉన్నారు. ఒకరిమీద ఇంకొకరు పద్యాలు రాసుకుని గొప్పవారమవుదామన్న తత్త్వముపట్టుకో కుండానే తెలుగు (క చ ట త ప) కవుల సందర్భ ఒక సమాజంగా ఏర్పరిచి శివశంకరులు గొప్పకార్యాన్నే సాధించినా యీ రకపు క్రీనీడలూ గుసగుసలూ లేవనిపించుకో లేక పోయినై.

కాంతం నూటికి నూరుపాళ్ళూ మునిమాణిక్యంవారి ఊహాసుందరియే (నలుపుఅని వారు వర్ణించినప్పటికేని.) వారి పూర్వపు భార్య (శేషమ్మగారు కాబోలు ఆమెగారి పేరు) గారిని నేను చూడనైన లేదు విబుధ జనులవలన విన్నంతలో ఆమెగారే కాంతం అన వీలులేదు. మునిమాణిక్యంగారి ఆతిథ్య భాగ్యము నాకొకమారు కలుగుటవల్ల వారి ప్రస్తుత గృహిణిని నేను చూచుట తటస్థించింది. నాకు ఆ రెండురోజులూ 'ఈమెగారే కాంతం' అనిపించింది 'మేష్టరు గారు' ఆమెను ఒక్క నిమిషము ఆమెపనికి విడిచిపెట్టరు. "రాజ్యం, రాజ్యమూ? రాజ్యం!" అని అనేక ఉదాత్తానుదాత్త స్వరావళితో పిలుస్తూనే ఉంటారూ, ఆమెగారు సరిగ్గా వారుపిలిచిన స్వరాల ధోరణిలోనే పలుకుతూంటారు వారి సంభాషణ మేష్టారూ-కాంతం సంభాషణలని జ్ఞాపకం తెస్తుంది. నేనున్న రెండురోజుల్లో "కాంతం వృద్ధాప్యం" అన్న కథ విన్నాను మునిమాణిక్యంగారు చదవగా. రెండు రోజులూ రెండుక్షణాలులాగ అయిపోయి నేను వారికడ శలవు తీసుకొని రైలెక్కి, ఆ బండి వారి ఇల్లున్న పేటవైపు సాగి పోతూంటే నామనస్సులో మెరిసిన ఊహ లివి: కాంతం వాస్తవవ్యక్తికాదు. కవుల ప్రేయసివలెనే ఆమె మునిమాణిక్యంవారి ఆదర్శ ప్రేయసి. కవులు అతిలోకసుందరిని సృష్టించుకుని కావ్యాలల్లితే మునిమాణిక్యం గారు ఆదర్శ గృహిణిని సృష్టించుకొని కథ లల్లినారు. ఆసంగతిని 'కాంతం వృద్ధాప్యం' లోని దేవాలయ ఘంటలు ఘోషింటాయి. మునిమాణిక్యం గారి అమృత నిష్యంది లేఖినీ గమనంలో అమర వీథులలోనుంచి తెలుగు నాటికి దిగివచ్చిన గృహామంగాకిని కాంతం.

మునిమాణిక్యంగారు ఎక్కడ ఉంటే అక్కడే కాంతం ప్రత్యక్షం. శేషమ్మగారి జీవితపర్యంతం మునిమాణిక్యంగారి కాంతం ఆమెగారిలో వసించింది నిన్నటివరకూ ఆమె రాజ్యలక్ష్మమ్మగారిలో ఉన్నది. అందరాని వినువీథులలో ఊహాసుందరిని వెతకడము పెట్టుకోక తన సరసకువచ్చిన సహధర్మచారిణిలోనే తన ఆదర్శగృహిణిని ప్రతిష్ఠించుకున్న పరమగృహస్థు మునిమాణిక్యం. వారిసమక్షంలోనే విహరిస్తూ వారిని ఎగతాళిచేస్తూ వారికి చేయూతనిస్తూ వారి జీవితయాత్రను వెన్నెల చాలుగాచేసే 'కృష్ణ' సుందరి కాంతం.

మంచు పడడము

అంటే ఏమిటని కుటుంబరావుగారు అడుగుతున్నారు సిక్కిం నుంచి. 'మంచు పడడము' అన్నది రెండు రకాలు. మన దేశములో మబ్బులనుండి వర్షము కురిసినట్లే, శీతల దేశములలోనూ హిమాలయ ప్రాంతాల్లోనూ మంచు కురుస్తుంది, తడిసిన దూది పింజలు కురుస్తున్నట్టుగా కనపడుతుందిఅది. ఉష్ణోగ్రత హెచ్చుగా లేకపోతే ఇలాగ కురిసినమంచు - కొండశిఖరాలూ, గంట స్తంభాలూ, మేడలకప్పులూ, లాంతరు స్తంభాలకప్పులూ, పిట్టగోడల అంచులూ, మీద, కూడి కనబడుతుంది. ఇంగ్లండులో రోడ్డమీది మంచు మోటారు కార్లచేత ఊడ్పించేస్తారట కాని రోడ్డుపక్కన ఉన్న సిమెంటు కాలిబాటలమీదిమంచు అలాగే వుండి బూట్లతో నడిచేవారు జారిపడడానికి కారణమౌతుందట. ఈమంచు తడిసిన పంచదార పోగులలాగా, సూరేకారము పొరలాగా వుంటుంది పిడికిలితో నొక్కి ఉండచేస్తే బంతిలాగ అవుతుంది. చిన్న పిల్లలు యీ బంతులతో ఒకరినొకరు కొట్టుకుని ఆడతారు.

ఇక మనదేశంలో శీతకాలములో పచ్చిగడ్డి కొసలమీద నిలిచి కనబడే నీటిబిందువులను కూడా 'మంచు' అనే అంటాము. మంచుగడ్డవేసిన సోడా గ్లాసుకుపైన చిన్న చిన్న నీటిబిందువులు - చెమట పట్టినట్టుగా కూడడమూ అందరూ చూచే యుంటారు. గ్లాసులోని నీరు అతిచల్లగా ఉండడమువల్ల గ్లాసుచుట్టూవున్న గాలిలోని నీటిఆవిరి చల్లబడి గ్లాసుచుట్టూ బిందువులుగా యేర్పడు తుంది మనయిళ్లలో వంటకు యెసరు పెట్టినప్పుడు, మూత పెట్టిన ఇత్తడిసిబ్బికి అడుగు వైపున నీటిఆవిరి తగిలి, సిబ్బి చల్లదనము ద్రవీభవించి బిందువులు బిందువులుగాయేర్పడమూ మీరు చూచియుంటారు.

ఈ రీతిగనే శీతకాలములో పగటి వెచ్చదనమువల్ల గాలిలోనికి ప్రవేశించిన నీటి ఆవిరి, రాత్రివేళ నేల చల్లబడగానే ఆ నేలకుతలిగి—సిబ్బికి తగిలిన ఆవిరిలాగే— చల్లబడి ద్రవీభవించి, గడ్డిమీదనయితే బిందువులుగా నిలిచిపోతుంది, నేలమీదనయితే ఇంకిపోతుంది. మెట్టనేలలకు ఈ "మంచు" వానవంటిదే. సెనగ, పెసర, ఉలవ పంటలకు చాల అనుకూలము.

వానవలె నింగినుండి నేలకు వర్షించక పోవడముచేతనూ, చలివల్ల ఏర్పడుటచేతనూ దీనిని 'మంచు' అంటున్నాముకాని నిజానికి ఇది మంచుకాదు.

సిమ్లావంటి కొండప్రదేశాల్లో మబ్బులు ఊళ్లను ఆవరించి క్రమంగా గాలివాటువల్ల దాటిపోయిన తర్వాత రోడ్లన్నీ చెమ్మగా, తడిగా ఉంటాయి చల్లని నేలకు తగిలి, మబ్బులోని ఆవిరి ద్రవీభవించడమువల్ల ఏర్పడినదే ఈ తడి. దీనిని మంచు అనరు. ఎందు చేతనో? ★



ఇద్దరు దొంగలమధ్య ఇరుక్కున్నాడు రేలంగి
అన్నపూర్ణావారి 'దొంగరాముడు'లో ఆర్. నాగేశ్వరరావు, రేలంగి, ఏ. నాగేశ్వరరావు

"దొంగరాముడు"

అన్నపూర్ణా పిక్చర్స్ వారి "దొంగ రాముడు" చిత్రం ఈ నెల ఒకటవ తేదీనుండి ఆంధ్ర దేశంలో ప్రదర్శింపబడుతున్నది. శ్రీ కె. వి. రెడ్డి ఈ చిత్రం డైరెక్ట్ చేశారు. నిర్మాత శ్రీ డి. మధుసూదనరావు. ఎ. నాగేశ్వరరావు, సావిత్రి, జమున, సూర్యకాంతం, రేలంగి, ఆర్. నాగేశ్వరరావు, జగ్గయ్య, వంగర, రామలింగయ్య, మాస్టర్ [illegible], రామన్నపంతులు, తదితరులు యీ చిత్రంలో నటించారు. సంగీత దర్శకుడు శ్రీ పెండ్యాల నాగేశ్వరరావు, మాటలు శ్రీ డి. వి. నరసరాజు, పాటలు శ్రీ సముద్రాల రాఘవాచార్యులు వ్రాశారు. కె. వి. రెడ్డి గారి దర్శకత్వంలో నటీనటులందరూ ఉత్తమంగా నటించారు.

తల్లికి మందు కొనడానికి డబ్బు చాలక రాముడనే బాలుడు దొంగతనం చేసి, పట్టుబడి, జైలుకు వెడతాడు. ఈలోగా తల్లి చనిపోతుంది. చెల్లెలు అనాథ శిశు శరణాలయంలో చేరుతుంది. జైలునుండి విడుదలయి రాముడు చెల్లెలుకోసం వెదుకుతూ, తన అవతారం చూసి వారు దరిచేరనివ్వక పోవడం చేత ధనవంతుడి వేషం వేసుకుని అనాథనిలయానికి వెళ్లి చెల్లెల్ని కనుక్కుంటాడు. ధనవంతుడిని బొంకడం చేత, చెల్లెలుకోసం మళ్ళీ దొంగతనం చేయవలసి వస్తుంది. మళ్లీ జైలుకు వెడతాడు. అతనికి దొంగరాముడనే పేరు స్థిరపడిపోతుంది. ఏవస్తువు మాయమైనా, నేరం అతనికే అంటగడతారు. చివరకు హత్యానేరం కూడా అతనిపైకే వస్తుంది. చివరికి అసలు హంతకుడు దొరకడంవల్ల రాముడు నిర్దోషి అని తేలుస్తుంది. అతనిచెల్లెలు ధనికుడైన ఒక డాక్టరును ప్రేమించి వివాహం చేసుకుంటుంది. రాముడు తనను ఇదివరకే ప్రేమించిన సీత అనే పేదపిల్లను పెళ్లి చేసుకొని సుఖంగా వుంటాడు.

దొంగరాముడుగా ఎ. నాగేశ్వరరావు హాస్యాన్ని, విషాదాన్ని సమానమైన నేర్పుతో నటించాడు. ఈ చిత్రంలో ప్రధానంగా ఆకర్షించే నాగేశ్వరరావు నటన. తరవాత పేర్కొనదగిన నటుడు రేలంగి. పినాకి ధనయ్యగా ఆయన చాలా బాగా నటించాడు. ఇన్ని చిత్రాల్లో ఇన్ని పాత్రలు వేసినా, ప్రతి పాత్రలోనూ కొత్తరకం హాస్యం చేస్తూ చేయగలగడం, ఒక్కొక్క పాత్ర అంతమైనప్పటికీ రేలంగి ప్రారంభ సన్నివేశాల్లో తెలుసుకుంటూ నటించడం ఆయన ప్రతిభను నిరూపిస్తున్నది. రాముడు చెల్లెలు లక్ష్మిగా జమున హాస్య చిత్రాల్లో కంటే బాగా నటించింది. పంతులుగారుగా వంగర, కోటేశ్ గా ఆర్. నాగేశ్వరరావు, సీతగా సావిత్రి, భద్రయ్య పేర్కొముగా



విక్రమ్ ప్రొడక్షన్సువారి "తెనాలి రామకృష్ణ"లో రాధాసానిగా సురభి బాలసరస్వతి

సంఘంవారిని ఆయనస్వయంగా ఆహ్వా నించి మైలాపూర్, వుడ్ లాండ్స్ లో అల్పాహార విందు చేశారు. ఆయన సతీమణికూడా విందులో పాల్గొన్నది.

1935 లో "జీవన్ నైయా" చిత్రంతో ప్రారంభించి, 20 ఏళ్లపాటు, సుమారు 60 చిత్రాల్లో నటించి ఇప్పటికీ ఆయన యువక పాత్రలు ధరిస్తున్నారు. వయస్సు నలభై పైగా ఉన్నట్లు ఆయన కనిపించడు. ఒక పురస్కారం కిందటి సినిమా ప్రేక్షకులకు ఆయన అభిమానతార. నటకులలో దాదాపు మొట్టమొదటి "గ్లామరస్" తార ఆయనే అని చెప్పవచ్చును. చలాకీ స్వభావంగల పాత్రలను హుషారుగా నటించేనటుడుగా ఆయన ప్రేక్షకుల మనస్సులలో నిలిచి పోయాడు. వ్యక్తిగతంగాకూడా అదే స్వభావంగలవాడుగా కనిపిస్తాడు. విందు, గోష్ఠి జరిగినంతసేపూ ఛలోక్తులు విసురుతూ చిత్రాలలో కనబరచే స్వాభావికమైన నవ్వు నవ్వుతూ అందరినీ నవ్వించాడు.

ప్రస్తుత చిత్రాలనుగూర్చి ఆ్యనను అడగగా, "మనదేశంలో నిరక్షరుల సంఖ్య ఎక్కువ. ఏ చిత్రమైనా నాలుగు డబ్బులు సంపాదించుకోవాలంటే, ఈ అధికసంఖ్యాకులు, అధిక సంఖ్యాకంగా వచ్చిచూస్తేనే జరుగుతుంది. ప్రధానంగా వారిని దృష్టిలో పెట్టుకునే చిత్రాలుతీయడం జరుగుతోంది. అందుచేతే ఎక్కువభాగం చిత్రాలన్నీ "ఇల్లిటరేట్"గా ఉంటున్నాయి. "లిటరేట్" చిత్రాలు తయారుకావాలంటే దేశంలో "లిటరసీ" (విద్య) కూడా పెరగాలిసిందే. అధికసంఖ్యాకులు అక్షరాస్యులైనప్పుడు చిత్రాలలోకూడా అక్షరాస్యత పెరుగుతుంది," అన్నారు.



నేషనల్ ఆర్ట్ థియేటరువారి "జయసింహ" లో అంజలీదేవి, బాలకృష్ణ, పద్మనాభం.

★ "దొంగరాముడు" ★

సూర్యకాంతం, డాక్టరుగా జగ్గయ్య, చిన్న ప్పటి రాముడుగా వర్మ, తదితరులు చాలా చక్కగా నటించి ప్రేక్షకుల ప్రశంసకు పాత్రులయ్యారు.

సదసరాజుగారి సంభాషణల రచన, సముద్రాలవారి పాటలరచన ఉత్తమస్థాయిలో సాగాయి. పాటలు, నృత్యాలు బాగున్నాయి. ఈ చిత్రం బాగా విజయంపొందగల సూచనలున్నాయి. ★

మద్రాసులో అశోక్ కుమార్

ప్రసిద్ధనటుడు అశోక్ కుమార్ ఇటీవల ఎ. వి. ఎమ్. వారి "భాయ్ భాయ్" హిందీ చిత్రంలో నటించేనిమిత్తం మద్రాసు వచ్చారు. దక్షిణభారత ఫిలిం జర్నలిస్టుల



ఈమధ్య మద్రాసులో వేసిన "రంగూన్ రౌడీ" నాటకంలో రౌడీపాత్రధారి రాజారెడ్డి.




“మేరా జూతా హై జాపానీ....”
“శ్రీ 420” లో రాజకపూర్



ఇటీవల వివాహం చేసుకున్న తారలు షమ్మీకపూర్, గీతాబాలి.

(ఒకదృష్టితో చూస్తే అశోక్ కుమార్ చెప్పినది సమంజసంగానే కనిపిస్తుంది. కాని మరొక దృష్టితో చూస్తే, అతురాసక్తతకూ, కళకూ సంబంధం లేదనిపిస్తుంది. విరక్తురాలైన ప్రజల సంస్కృతినుండి వెలువడిన నాద కవిత్వంలోనూ, సంగీతంలోను, నృత్య సంప్రదాయాల్లోనూ కళాసౌందర్యం, సౌకుమార్యం కనిపిస్తున్నట్టే, అతురాసక్తి విపరీతంగా పెరిగిన కొన్ని దేశాలనుండి వచ్చే చిత్రాల్లో అసభ్యత, అనాగరికత అంతగానూ కనిపిస్తాయి. ముఖ్యమైనది కళాదృష్టి, సౌందర్యసృష్టి.)

“బెంగాలీ చిత్రాలు హిందీ-చిత్రాలకంటే బాగుంటాయని మీ ఉద్దేశ్యమా?” అని ప్రశ్నించగా “అవును. బెంగాల్‌లో ఉత్తమచిత్రాలకు ప్రజాదరణ ఉంటుంది. బెంగాలులో అతురాసక్తత ఎక్కువగా ఉండడమే దానికి కారణం,” అని అశోక్ కుమార్ అన్నాడు. “పథేర్ పాంచాలి” చిత్రాన్ని ఉదాహరిస్తూ, “ఈ చిత్రం ఎక్స్‌పెరిమెంటల్ గా తీశారు. ఒక్క చోటకూడా స్టూడియో లైట్లను ఉపయోగించలేదట. సూర్యోదయ, సూర్యాస్తమయ దృశ్యాలనుకూడా ఆయా సమయాల్లో ఉండే వెలుగులోనే తీశారట. ఫలితాలు అద్భుతంగా ఉన్నాయని పలువురు నాతో చెప్పారు. ఆ చిత్రాన్ని ఒక్క తారకూడా లేకుండా తీసినా ఆర్థికంగా విజయం పొందుతున్నదట,” అని ఆయన అన్నారు. ★



విక్రమ ప్రొడక్షన్సు వారి "తెనాలి రామకృష్ణ"లో చిరంజీవి మాధవుడూ... రామకృష్ణుడు, భార్య కమల ,

బొంబాయి సినిమా లేఖ

అత్యుత్తమ చిత్రం ఝనక్ ఝనక్....

యుద్ధానంతర చలనచిత్ర చరిత్రలో కల్లా అతి ముఖ్యమైన సంఘటన శాంతారాం నిర్మించిన "ఝనక్ ఝనక్ పాయల్ బాజే" చిత్రం విడుదల. చిత్రనిర్మాణంలో అద్వితీయ ప్రతిభాశాలి, కీర్తి శిఖరాల నధిరోహించినవారు అయిన శాంతారాం తన జీవిత విజయాలకు మకుటాయమానమైన చిత్రం నిర్మించారు. భారతదేశంలో ఇంతవరకూ ఎప్పుడూ, ఎక్కడా, ఏ భాషలోనూ ఇంత గొప్ప చిత్రం చూడలేదు.

వర్ణచ్ఛాయాగ్రహణం, దర్శకత్వం, టెక్నిక్, ప్రొడక్షన్ విలువలు, మనోహర దృశ్యాలు, సంగీతం, నాట్యం అన్నిటిలోనూ [illegible] ఆదర్శచిత్రం [illegible] గా నిర్మించబడిన చిత్రం యిది. భారతీయ నృత్య శాస్త్రీయ, జానపద విధానాలు, భారతీయ సంస్కృతి, శిల్పం, చిత్రలేఖనం, వేదాంతం, జీవిత విధానం - అన్నిటిలోనూ వెల్లివిరిసే సౌందర్యాన్ని ఈ చిత్రం ప్రదర్శిస్తోంది. హాలీవుడ్ చిత్రాలతో పరిహాసాస్పదమైన చిత్రాలను నిర్మించిన భారతీయ చిత్ర పరిశ్రమకు అమెరికాలో నిరాదరణ యెందుకు యెదురౌతున్నదీ అనే ప్రశ్నకు భారత ప్రభుత్వం "ఝనక్ ఝనక్" చిత్రం విడుదల తరవాత సమాధానం చెప్పవలసిన పరిస్థితి యేర్పడింది. రంగుల ఛాయలో "మౌలిన్ రూజ్" చిత్రానికి, దర్శకత్వం, టెక్నిక్‌లలో "జేరీజ్ [illegible]" చిత్రానికి ఏమాత్రం తీసిపోని "ఝనక్ ఝనక్ ...." చిత్రం విడుదలతో, మన చిత్రాలకు అమెరికాలో మార్కెట్ లభించక పోవడానికి యేవో కుంటిసాకులు చెబితే లాభం లేదని తేలిపోయింది. జపాన్ నుంచీకూడా ఎన్నడూ ఇంత గొప్ప చిత్రం రాలేదు. యూరప్ చిత్రాలు దీనికి సాటిరావు. కనూదేశాయ్ కళా దర్శకత్వం, వసంత్ దేశాయ్ సంగీత దర్శకత్వం, బాలకృష్ణ ఛాయాగ్రహణం, గోపీకృష్ణ, భాగేజీ మహారాజ్‌ల నృత్య దర్శకత్వం, అన్నిటినీ మించి శాంతారాం దర్శకత్వం - చూస్తే, ఇటువంటి చిత్రం మరికొన్నేళ్ళదాకా రాదనిపిస్తుంది. దీనితో ప్రభుత్వ బహుమతులకు చిత్రాన్ని పంపుకోవలసిన సమస్య తప్పిపోయింది. దీన్ని దరిదాపుల చిత్రం కనుచూపుమేరలో ఎక్కడా కనిపించదు.

అమెరికాలో భారతీయ చిత్రాలను విడుదల కానివ్వకపోవడంపై చలన చిత్ర వర్గాలు చేస్తున్న ఆందోళనకు "ఝనక్ ఝనక్"తో [illegible] బలం చేకూరింది. కనీసం వెయ్యి సినిమాథియేటర్ల నిర్మాణానికి అనుమతించవలసిందని వారు ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. ప్రస్తుతం విదేశీ చిత్రాలు ప్రదర్శిస్తున్న థియేటర్లు కనీసం నాటికి 50 వంతుల కాలమైనా భారతీయ చిత్రాల ప్రదర్శనకు కేటాయించేటట్లు నిబంధన చేయాలనికూడా వారు ప్రభుత్వాన్ని



ఏ. ఆర్ కర్దార్ చిత్రం "[illegible]"లో స్మృతి బిశ్వాస్

బొంబాయి సినీమాలేఖ

కోరారు. ఈ కోర్కెలు సముంజసమైనవి, జాతీయ ప్రతిష్ఠను ఇనుమడింపజేసేవి, కనుక వీటిని ప్రభుత్వం నెరవేరుస్తుందని మనం ఆశించుదాం.

*　　*　　*

భారతీయ చలనచిత్రాల డిస్ట్రిబ్యూటర్ల సంఘం, భారత సినిమా ప్రదర్శకులసంఘం 1954 అక్టోబరు 28 నుండీ అమలు చేసున్న స్వయంనిబంధనపద్ధతి ఫలితంగా బొంబాయి సర్క్యూట్ లోని డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లలో నూటికి 99 మంది పై సంఘాలలో సభ్యులుగా చేరారు. డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లమధ్య తగాదాలు క్రమేణా తగ్గిపోయాయి. ఉభయసంఘాలూ కట్టుదిట్టంగా తమ ఒడంబడికలను అమలు చేస్తున్నాయి.


*　　*　　*

బొంబాయి రాష్ట్రంలో 1954-1955 సంవత్సరంలో వసూలైన వినోదంపన్ను మొత్తం ఒకకోటి యాభైలక్షలు. దీనిలో ఒక్క బొంబాయి నగరంనుంచే 79 లక్షల 29 వేలు వసూలైంది.


*　　*　　*

భారతీయ చిత్రాల ప్రదర్శన ఫలితంగా ఆఫ్ఘనిస్థాన్ నుండి భారతదేశానికి న్యాయంగా రావలసినధనం ఇంతవరకూ నిలిపివేయబడింది. ఎస్. కె. పాటిల్ గారు ఇటీవల ఆఫ్ఘనిస్థాన్ దేశాలకు వెళ్లినప్పుడు ఆఫ్ఘన్ ప్రధానితో ఈ విషయం చర్చించారు. ఒడంబడిక కుదిరింది. ఇప్పుడు ఆ ధనం వెంటనే భారతదేశానికి పంపివేయబడగలదని తెలియవచ్చింది.

*　　*　　*



పారమౌంట్ వారి విస్టా విజన్ చిత్రం "హెల్స్ ఐలెండ్" లో ఒక దృశ్యం.



సోవియట్ నాటకరంగం: "హామ్లెట్" నాటకంలో హొరేషియోగా ఎ. లవ్రోవ్, హామ్లెట్ గా సమోయిలోవ్, మార్సెలస్ గా ఎన్. ఆర్సెవ్.

షమ్మీకపూర్, గీతాబాలి వివాహానంతరం బొంబాయిలోని ప్రముఖ వ్యక్తులు అనేకులు హాజరయ్యారు. పృథ్వీరాజ్ తండ్రి విశ్వేశ్వరనాథ్ ఈ విందు ఏర్పాటు చేశారు. రాజ్ కపూర్ అతిథులకు స్వాగతమిస్తూ "ఇంతవరకు నాతో కలిసి నటించిన తారకే ఇప్పుడు నేను బావగారినయ్యాను" అని చలోక్తిగా అన్నారు.

(ఆంధ్ర-వారపత్రిక విశేషిక) ★

Printed and Published for
Nageswara Rao Estates Ltd., by
S. Radha Krishna at The
Andhra Patrika Press,
6&7, Thambu Chetty St., Madras
Editor: S. Sambhu Prsaad.